జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | గురువారం 16 ఏప్రిల్ 2026 | సంపుటి: 19 | సంచిక: 39 | పేజీలు: 12 | వెల: రూ.5 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , వైశాఖ మాసము , తిథి: షష్టి - 19:05:09 వరకు నక్షత్రంమూల - నిండా రాత్రి వరకు కరణంవణిజ - 19:05:09 వరకు పక్షంకృష్ణ యోగంవారీయన - 17:09:13 వరకు వారం

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## తెలంగాలో భగ్గుమంటున్న భానుడు

**పలు ప్రాంతాల్లో 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు**

హైదరాబాద్,ఏప్రిల్15(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్నమైతే చాలు భానుడు భగ్గుమంటున్నాడు. దాంతో వాతావరణ కేంద్రం హైదరాబాద్ సహా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారిచేసింది. ఆరెంజ్ అలర్ట్ జారీచేయబడిన జిల్లాల్లో ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్ నగర్,

మిగతా1 2లో..

## ఎసిబికి చిక్కిన లంచగొండి ఇంజనీర్

**50వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత**


కరీంనగర్,ఏప్రిల్15(ప్రజాజ్యోతి): కరీంనగర్ జిల్లాలో అవినీతి మున్సిపల్ అధికారి ఏసీబీ అధికారులకు చిక్కాడు. హుజూరాబాద్ మున్సిపల్ ఆఫీసులో పనిచేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్.. ఓ కాంట్రాక్టర్ నుంచి లంచం

మిగతా 2లో..

# బిల్లులపైనే సర్వత్రా చర్చ

## నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

- మహిళా బిల్లు, డీలిమిటేషన్‌పై చర్చ
- ప్రభుత్వ తీరుపై విపక్షాల అసహనం
- వాడీవేడీగా సాగనున్న సమావేశాలు



**చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు నియోజకవర్గాల పునర్విభజన బిల్లును తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం నేడు దానిని లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ ఈ బిల్లును సభ ముందుకు తీసుకురానున్నారు. అనంతరం బిల్లుపై చర్చ జరగనుంది. ఇప్పుడున్న లోక్‌సభ స్థానాలను గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని బిల్లులో కేంద్రం ప్రతిపాదించింది. ఇందులో రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే వారి సంఖ్య 815గానూ, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 35గా పేర్కొంది. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 81ని సవరించాలని నిర్ణయించింది. ఇప్పటివరకూ ఆర్టికల్ 81(1) కింద రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే గరిష్ఠ లోక్‌సభ సభ్యుల సంఖ్య 530, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికయ్యే వారి గరిష్ఠ సంఖ్య 20గా ఉంది. కానీ ప్రస్తుతం 543 లోక్‌సభ స్థానాలకే ఎన్నికలు జరుగుతున్నాయి. మరోవైపు మహిళా రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయడానికి వీలుగా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు-2026ను కేంద్రం తీసుకొస్తోంది. ఆర్టికల్ 81(3)లో 2026 తర్వాత ప్రచురించే తొలి జనాభా లెక్కల ఆధారంగానే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరగాలని ఉంది. ఇప్పుడు దాన్ని సవరించి, గతంలోని జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల్ని పునర్విభజించడానికి కేంద్రం తాజా బిల్లు తీసుకొస్తోంది.**

న్యూఢిల్లీ,ఏప్రిల్15(ప్రజాజ్యోతి): పార్లమెంట్ మరో చారిత్రక నిర్ణయానికి వేదిక కాబోతున్నది. మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లు ఆమోదం కోసం ఉభయ సభలు గురువారం నుంచి మూడ్రోజులు సమావేశం కాబోతున్నాయి. మహిళా బిల్లును ఇప్పటికే ఆమోదంచారు. 2026 జనాభా లెక్కల మేరకు సీట్లు కేటాయిస్తామని ప్రకటించారు. అయితే ఇప్పుడు 2011 జనాభా లెక్కల మేరకే దీనిని మోదించే అవకాశం కనిపిస్తోంది. ఈ క్రమంలో పార్లమెంట్ ఉభయ సభలు వాడీవేడిగా సాగే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బిల్లు స్వరూపాన్ని విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. అందువల్ల నేటి నుంచి సాగే సమావేశాలపై ఉత్కంఠత కొరసాగుతోంది. ఉభయ సభల్లోనూ బిల్లుల ఆవశ్యకతపై ప్రధాని మోడీ మాట్లాడుతారు. ఇప్పటికే కాంగ్రెస్ తన వ్యూహం ఖరారు చేసుకుంది. తృణమూల్ సహా అనేక పార్టీలు అధికార బిజెపి తీరును తప్పుపడుతున్నాయి. ఇకపోతే దేశంలో అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన కోసం ఇప్పటివరకూ

మిగతా 2లో..

# వసలదారులు గొప్ప వ్యక్తులు

- అమెరికా ఆర్థిక వ్యవస్థలో వసలదారుల కీలక భూమిక
- వారు ఈదేశ ఉన్నతికి ఎంతగానో కృషి చేస్తున్నారు
- తన అత్తామామలు కూడా ఆకోవలోని వారే
- ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ కీలక వ్యాఖ్యలు



న్యూయార్క్,ఏప్రిల్15(ప్రజాజ్యోతి): అమెరికా ఆర్థికవ్యవస్థలో వలసదారులు కీలక పాత్ర పోషిస్తున్నారని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ అన్నారు. అదే సమయంలో ఇమిగ్రేషన్ ప్రోగ్రామ్స్‌పై కఠిన నియంత్రణ నూ సమర్థించారు. అమెరికా పౌరసత్వం పొందడం అంటే ఈ దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడమేనని వాన్స్ స్పష్టంచేశారు. హెచ్-1బీ వ్యవస్థలో మోసాలు జరుగుతున్నాయని భావిస్తున్నట్లు చెప్పారు.

మిగతా 2లో..

## కాల్పుల విరమణ గడవు పొడిగించే ఛాన్స్ లేదు

**శాశ్వతమైన ఒప్పందం వైపే మొగ్గు చూపుతున్నాం**

**డొనాల్డ్ ట్రంప్ మరోమారు కీలక వ్యాఖ్యలు**

వాషింగ్టన్,ఏప్రిల్15(ప్రజాజ్యోతి): పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో కొనసాగుతున్న కాల్పుల విరమణను పొడిగించే ఆలోచన తనకు లేదని.. శాశ్వతమైన ఒప్పందం వైపే తాము మొగ్గు చూపుతున్నామని అన్నారు. టెహ్రాన్‌తో చర్చలు కొనసాగుతున్నప్పటికీ.. కాల్పుల విరమణను పునరుద్ధరించకుండానే అవి ముగిసే అవకాశముందని తెలిపారు. చర్చలు ఏవిధంగా ముగిసినప్పటికీ ఇరాన్‌తో ఒప్పందం కుదిరితేనే అందరికీ

మిగతా 2లో..

## ఇరాన్‌కు భారీ నష్టం వాటిల్లింది

**రూ. 25 లక్షల కోట్లు నష్ట పరిహారం చెల్లించాలి**

**రెండోదఫా చర్చల వేళ ఇరాన్ డిమాండ్**

టెహ్రాన్,ఏప్రిల్15(ప్రజాజ్యోతి): అమెరికాతో రెండో సారి శాంతి చర్చలు ప్రారంభం కానున్న వేళ ఇరాన్ కీలక డిమాండ్‌ను ముందుకు తెచ్చింది. ఇటీవల జరిగిన యుద్ధంలో తమ దేశానికి భారీ నష్టం వాటిల్లిందని పేర్కొంటూ, దాదాపు 270 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ. 25 లక్షల కోట్లు పరిహారం చెల్లించాలని ఇరాన్ డిమాండ్ చేసింది. తమకు జరిగిన నష్టాలను భర్తీ చేసేందుకు ఇతర దేశాలు సహాయపడాలని ఇరాన్

మిగతా 2లో..

## మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు

- యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మంత్రి ఆగ్రహం
- మార్కెట్ యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మం
- రెండేళ్లలో మొత్తం రూ.568.50 కోట్ల వ్యయం
- లైసెన్సులు కొనసాగిస్తున్న ట్రేడర్లపై కఠిన చర్యలు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో సమీక్ష



హైదరాబాద్,ఏప్రిల్15(ప్రజాజ్యోతి): తెలంగాణలో వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి, పారదర్శకతపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి పనుల పురోగతి, రైతులకు అందుతున్న సౌకర్యాలపై ఆయన అధికారులతో చర్చించారు.

మిగతా 12లో..

## దేశవ్యాప్తంగా డీలిమిటేషన్ సెగలు

**నిప్పుతో చెలగాటమాడుతున్న కేంద్రం**
**తమిళనాడు సీఎం స్టాలిన్ తీవ్ర విమర్శలు**
**నేడు రాష్ట్ర వ్యాప్తంగా నల్లజెండాల ప్రదర్శన**



చెన్నై,ఏప్రిల్15(ప్రజాజ్యోతి): దేశ రాజకీయాల్లో నియోజకవర్గాల పునర్విభజన బిల్లు హాట్ టాపిక్ అయింది. గురువారం లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో, దక్షిణాది రాష్ట్రాలు మిశ్రమ గళాన్ని వినిపిస్తున్నాయి. ముఖ్యంగా తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ కేంద్ర తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీలిమిటేషన్

మిగతా 2లో..

## కాంగ్రెస్‌ది ఒకటే స్టాండ్

- మహిళా బిల్లుకు ఓకే
- డీలిమిటేషన్ బిల్లుకు నో
- సమిష్టిగా పోరాడుతాం
- వ్యతిరేకంగా ఓటేస్తామన్న ఖర్గే

న్యూఢిల్లీ,ఏప్రిల్15(ప్రజాజ్యోతి): పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్ల బిల్లు, డీలిమిటేషన్ బిల్లుపై కాంగ్రెస్ సంచలన నిర్ణయం తీసుకుంది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు తెలిపిన కాంగ్రెస్.. డీలిమిటేషన్ బిల్లును మాత్రం వ్యతిరేకిస్తామని ప్రకటించింది. కాగా, దేశవ్యాప్తంగా నియోజక వర్గాల పునర్విభజన, మహిళా

మిగతా 2లో..



## పరిగిలో ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో భూసేకరణ

**ఆందోళనకు దిగిన జాగృతి అధ్యక్షురాలు కవిత**

వికారాబాద్,ఏప్రిల్15(ప్రజాజ్యోతి): వికారాబాద్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అరెస్టు చేశారు. పరిగిలో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం రైతుల భూములను బలవంతంగా సేకరిస్తున్నారని ఆరోపిస్తూ ఉదయం నుంచి

మిగతా 2లో..

## నిజామాబాద్ మార్కెట్లో పసుపు రైతుల దాడి

**ధరలు తగ్గించి కొనడంపై ఆందోళన**

నిజామాబాద్,ఏప్రిల్15(ప్రజాజ్యోతి): నిజామాబాద్ మార్కెట్ యార్డుపై పసుపు రైతులు దాడికి దిగారు. బహిరంగ వేలం ద్వారా కొనుగోలు చేస్తూ పసుపు ధర తగ్గిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆన్ లైన్ లో ఒక ధర ఉంటే.. ఆఫ్ లైన్ ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. మార్కెట్ అధికారుల తీరుపై మండిపడ్డ రైతులు..

## ఘోర ప్రమాదం

**బంగ్లా పౌరుల పడవ మునక**
**250 మంది గల్లంతు.. ముమ్మర గాలింపు**



ఢాకా,ఏప్రిల్15(ప్రజాజ్యోతి): అండమాన్ తీర సముద్రంలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రోహింగ్యా శరణార్థులు, బంగ్లాదేశ్ పౌరులతో వెళ్తోన్న ఓ పడవ మునిగిపోయింది. ఘటనలో దాదాపు 250 మంది గల్లంతయ్యారు. వారి కోసం సముద్రంలో ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. గల్లంతైన వారిలో చిన్నారులు కూడా ఉన్నారు. ఈ ప్రమాదంపై ఐక్యరాజ్య సమితి శరణార్థుల హైకమిషనర్, ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. ఈ పడవ దక్షిణ బంగ్లాదేశ్‌లో టేక్‌నాఫ్ ప్రాంతం నుంచి బయల్దేరినట్లు ఈ ప్రకటనలో ఐరాస అధికారులు పేర్కొన్నారు. మలేసియా వెళ్తుండగా బలమైన ఈదురుగాలులు, కెరటాల ఉద్ధృతి కారణంగా మునిగినట్లు వెల్లడించారు. కాగా.. ఈ పడవలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించారని, అది కూడా


మిగతా 12లో..

# సంపాదకీయం

## దేశానికి దిశ చూపేలా బిల్లులపై చర్చించాలి !

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై పలు విమర్శలు వస్తున్నాయి. పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రాజకీయ పార్టీలతో పాటు, పౌరసమాజంలోనూ అనుమానాలు ఉన్నాయి. ఈ నెల 16 నుంచి పార్లమెంట్ మూడు రోజుల పాటు ప్రత్యేకంగా సమావేశం కాబోతున్నది. అందువల్ల ఈ విషయంలో అనుమానాలు నివృత్తి చేయాల్సి ఉంది. అనుమానాలు వ్యక్తం చేస్తున్న వారు, ఆందోళనలు చేస్తున్న వారు, విమర్శలు చేస్తున్న వారి అభిప్రాయాలకు విలువనివ్వాలి. పార్లమెంట్ వేదికగా సుదీర్ఘంగా చర్చించాలి. విపక్ష, స్వపక్ష నేతలు కూడా పరస్పర వివాదాల జోలికి పోకుండా ప్రజలకు అర్థమయ్యేలా సమగ్రంగా చర్చించాలి. అఖిలపక్ష సమావేశం కన్నా పార్లమెంటులో చర్చించడమే మేలు. ఎందుకంటే ఈ చర్చకు చట్టబద్ధత ఉంటుంది. అలాగే సభ్యుల సూచనలు, సలహాలకు విలువ ఉంటుంది. ఎఐ వినియోగం, సాంకేతికత పెరిగిన ప్రస్తుత కాలంలో ఈ విషయాలపై వాటి సాయం కూడా పొందితే మంచిది. పార్టమెంటులో సుదీర్ఘ ఉపన్యాసాలకు తావులేకుండా, పరస్పర విమర్శలకు చోటు లేకుండా ఈ రెండు అంశాలపై సమగ్రంగా చర్చించాలి. దీనివల్ల ప్రజలకు కూడా అవగాహ కలిగేలా ఉండాలి. రాజకీయపార్టీలు స్వార్థ రాజకీయాలను పక్కన పెట్టి, ఈ అంశాలపై ఓ ఏకాభిప్రాయం వచ్చేలా చూడాలి. ఎందుకంటే మహిళా రిజర్వేషన్ బిల్లు ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉంది. నిజానికి మొన్నటి సార్వత్రిక ఎన్నికలకు ముందే పార్లమెంట్ ముందుకు వచ్చింది. అప్పుడే ఇది చట్టంగా మారివుంటే బాగుండేది. కొత్తగా జనాభా లెక్కల తరవాత దీనిని అమలు చేస్తామని గతంలో బిల్లు ప్రవేశ పెట్టినప్పుడు ప్రభుత్వం చెప్పింది. ఇప్పుడు 2011 జనాభా లెక్కల ప్రకారం అమలు చేస్తే అన్యాయం చేసినట్లు అవుతుంది. 2029లో సార్వత్రిక ఎన్నికలు జరిగితే ప్రజాస్వామ్యం మరింతగా వికసిస్తుందని, బలోపేతం అవుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. విధాన నిర్ణయాల్లో మహిళలు ఎప్పుడైతే క్రియాశీలంగా వ్యవహరిస్తారో అప్పుడు వికసిత్ భారత్ దిశగా ప్రయాణం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్న నేపథ్యంలో దేశంలోని మహిళలకు ప్రధాని ప్రత్యేకంగా లేఖ రాశారు. నిజానికి ఇప్పటికే మహిళల రిజర్వేషన్లు అమలు జరిగివుండాల్సింది. అనేక రంగాల్లో మహిళలు రాణిస్తున్నందున చట్టసభల్లోనూ వారి భాగస్వామ్యం పెరగాల్సిందే. చట్టసభల్లో వారి వాణి బలంగా వినిపిస్తే ప్రజాసామ్యం మరింత బలోపేతం అవుతుంది. అయితే లోక్‌సభ సీట్లు పెరిగితేనే మహిళల రిజర్వేషన్లు అమలు సులువవుతందని ప్రభుత్వ వాదనగా ఉంది. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా ఇప్పుడున్న లోక్‌సభ స్థానాల గరిష్ఠ సంఖ్య 550ని గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 2027 జనాభా లెక్కల నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ అందుకు సంబంధించి లెక్కలు వెలువడటానికి ఆలస్యమవుతుందన్న ఉద్దేశంతోనే ముందస్తు గా ఈ రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకొస్తున్నట్లు కేంద ప్రభుత్వం పేర్కొంది. దాని ప్రకారం వెళ్తే ప్రజాస్వామ్య పక్రియలో మహిళా భాగస్వామ్యం పెంచడంలో జాప్యం జరుగుతుందని అభిప్రాయపడింది. కేంద్ర ప్రభుత్వం ఏ జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోనేదీ ఈ బిల్లులో చెప్పలేదు. అయితే డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కోసం ప్రతిపాదించిన బిల్లులో ఆ కమిషన్ ఏర్పాటయ్యే నాటికి అందుబాటు లో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాలను పునర్విభజించనున్నట్లు పేర్కొంది. అంటే దాని ప్రకారం ప్రస్తుతం అందుబాటు లో ఉన్న తాజా జనాభా లెక్కలు 2011వే కాబట్టి వాటి ప్రాతిపదికనే నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశముంది. 850 సీట్లను ఏ ప్రాతిపదికన పెంచబోయేదీ ఈ బిల్లులో స్పష్టత ఇవ్వకున్నా పార్లమెంటులో చర్చ సందర్భంగా ప్రభుత్వం చెప్పే అవకాశం ఉంది. అప్పుడు అన్ని రాష్ట్రాల్లో స్థానాలను 50శాతం పెంచుతామని చెబితే ఏయే రాష్ట్రాల్లో అసెంబ్లీ, పార్లమెంటు సీట్లు ఎన్ని పెరుగుతాయన్న దానిపై స్పష్టత వస్తుంది. ఆ రాష్ట్రాలకు వచ్చిన సీట్లను అంతర్గతంగా పునర్విభజించుకోవడానికి 2011 జనాభా లెక్కలు పనికొస్తాయి. అలా కాకుండా దేశం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకొని 2011 జనాభా లెక్కల ఆధారంగానే పునర్విభజన చేపట్టాలని నిర్ణయిస్తే డీలిమిటేషన్ కమిషన్ అంతిమంగా నివేదిక ఇచ్చేంత వరకూ ఏ రాష్ట్రం లో ఎన్ని సీట్లు పెరుగుతాయన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కమిషన్‌కు సహాయ పడటానికి ప్రతి రాష్ట్రం నుంచి 10 మందిని నియమిస్తారు. ఇందులో ఐదుగురు ఎంపీలు, ఐదుగురు ఎమ్మెల్యేలుంటారు. లోక్‌సభ సభ్యులను లోక్‌సభ స్పీకర్, ఎమ్మెల్యేలను అసెంబ్లీ స్పీకర్ నామినేట్ చేస్తారు. నియోజకవర్గాల పునర్విభజన కోసం రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్, సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియా, వారి నామినీలను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులను, భౌగోళిక పరిస్థితులపై అవగాహన ఉన్న నిపుణులను, ఇతరత్రా అవసరమైన వారిని పిలిచి మాట్లాడే అధికారం ఈ కమిషన్‌కు ఉంటుంది. కమిషన్ సభ్యుల్లో భిన్నాభిప్రాయాలు ఏర్పడితే మెజారిటీ సభ్యుల అభిప్రాయం చెల్లుబాటవుతుంది. డీలిమిటేషన్ బిల్లులో ఈ కమిషన్ ఏర్పాటు కావడానికి ముందు అందుబాటులో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం నియోజక వర్గాల పునర్విభజన జరుగుతుందని చెప్పింది తప్పితే స్పష్టంగా ఫలానా జనాభా లెక్కల ప్రాతిపదికన అని చెప్పలేదు. 2027 జనాభా లెక్కల సేకరణ జరుగుతున్న తరుణంలో 2011 జనాభా లెక్కలను ఎలా ప్రాతిపదికగా తీసుకుంటారని ప్రతిపక్షాలు ప్రశ్నించే వీలుండటంతో ఆ దాడి నుంచి తప్పించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం తెలివిగా కమిషన్ ఏర్పాటయ్యే నాటికి ముందున్న జనాభా లెక్కల ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పినట్లు కనిపిస్తోంది. అయితే ఇవన్నీ ఓక పజిల్‌లలాగా కనిపిస్తున్నాయి. అందువల్ల పార్లమెంట్ చర్చకు విలువ ఉంటుంది. అఖిలపక్షం కన్నా పార్లమెంటులో చేస చర్చలకే ప్రాధాన్యం ఉంటుంది. విపక్షాలకు ఉన్న అనుమానాలను తీర్చాల్సిన బాధ్యత అధికార పక్షానిది. అనుమానాలను సహేతుకంగా ప్రస్తావించడం ద్వారా విపక్షాలు తమవంతుగా కృషి చేయాలి. అప్పుడే ఈ రెండు బిల్లులపై సమగ్ర చర్చకు అవకాశం ఉంటుంది.

# బిల్లులపైనే సర్వత్రా చర్చ



మొదటిపేజీ తరువాయి..

నాలుగు డీలిమిటేషన్ కమిషన్లు పని చేశాయి. ఇప్పుడు ఐదోది ఏర్పాటవుతోంది. ఇందులో రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే వారి సంఖ్యను 815గా, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 35గా పేర్కొంది. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 81ని సవరించాలని నిర్ణయించింది. దీని ప్రకారం దేశంలో లోక్‌సభ స్థానాలు 54.54శాతం మేర పెరిగే అవకాశముంది. ఇప్పటి వరకూ ఆర్టికల్ 81(1) కింద రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే గరిష్ఠ లోక్‌సభ సభ్యుల సంఖ్య 530, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికయ్యే వారి గరిష్ఠ సంఖ్య 20గా ఉన్నాయి. అయితే ప్రస్తుతం 543 లోక్‌సభ స్థానాలకే ఎన్నికలు జరుగుతున్నాయి.
మహిళా రిజర్వేషన్లను 2029 నుంచి అమలు చేయడానికి వీలుగా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు-2026ను కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తోంది. ఇందులో 2026 జనాభా లెక్కలకు ముందే నియోజకవర్గాలను పునర్విభజించడానికి వీలు కల్పిస్తూ ఆర్టికల్ 55, 81, 82, 170, 330, 332, 334ఏలకు సవరణలు ప్రతిపాదించింది. రాజ్యాంగంలో గరిష్ఠంగా 550 లోక్‌సభ స్థానాలను పేర్కొన్నా ప్రస్తుతం 543 మాత్రమే ఉన్నాయి. అంటే.. గరిష్ఠ సంఖ్యలో 98.72 నియోజకవర్గాలే ఉన్నట్లు లెక్క. ఆ నిష్పత్తి ప్రకారం చూస్తే కేంద్ర ప్రభుత్వం కొత్త స్థానాల సంఖ్యను 840దాకా ఖరారుచేసే సూచనలున్నాయి.

## దేశవ్యాప్తంగా డీలిమిటేషన్ సెగలు

మొదటిపేజీ తరువాయి..

పక్రియను దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న 'చారిత్రక అన్యాయం'గా స్టాలిన్ అభివర్ణించారు. 'కేంద్ర ప్రభుత్వం నిప్పుతో చెలగాటం ఆడుతోంది. జనాభా నియంత్రణను సమర్థవంతంగా పాటించి అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న రాష్ట్రాలకు శిక్ష విధిస్తారా?' అని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాలకు రాజకీయంగా లబ్ది చేకూర్చి, దక్షిణాది ప్రాబల్యాన్ని తగ్గించే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా నేడు తమిళనాడు వ్యాప్తంగా నల్లజెండాలతో నిరసన తెలపాలని డీఎంకే పిలుపునిచ్చింది. ఈ మేరకు ఇంటింటిపై నల్లజెండాలు ఎగురవేయాలని రాష్ట్ర ప్రజలను స్టాలిన్ కోరారు. 'తమిళనాడు పోరాడుతుంది.. తమిళనాడు గెలుస్తుంది' అంటూ ఆయన ప్రకటించారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల విభజన జరిగితే, జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాల లోకసభ సీట్లు తగ్గి, ఉత్తరాది రాష్ట్రాల సీట్లు భారీగా పెరుగుతాయన్నది సీఎం స్టాలిన్ అభియోగం. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల గొంతు నొక్కడం సమాఖ్య వ్యవస్థకే ప్రమాదకరమని ఆయన హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే నిధుల పంపిణీలో అన్యాయం జరుగుతోందని, ఇప్పుడు రాజకీయంగా కూడా మొండిచేయి ఎదురవుతుందని ఆయన వాదిస్తున్నారు. దక్షిణాది ఆత్మగౌరవం కోసం రాజీలేని పోరాటం చేస్తామని స్టాలిన్ స్పష్టం చేశారు. ఒకవేళ కేంద్రం ఈ బిల్లును ఉపసంహరించుకోకపోతే భారీ మూల్యం తప్పదని ఆయన హెచ్చరించారు. మరోవైపు, రేపు పార్లమెంటులో ఈ బిల్లు ప్రవేశపెట్టనున్న తరుణంలో విపక్షాలు ఐక్య పోరాటానికి సిద్ధమవుతున్నాయి. రాజ్యాంగ విలువలు, సమాఖ్య స్ఫూర్తిని కాపాడాలని కోరుతూ గళం ఎత్తేందుకు సిద్ధమయ్యాయి. ఈ పోరు కేవలం సీట్ల కోసం మాత్రమే కాదు, దక్షిణాది రాష్ట్రాల ఉనికి, గౌరవం కోసమని విపక్ష పార్టీలు చెబుతున్నాయి.

## ఇరాన్‌కు భారీ నష్టం వాటిల్లింది

మొదటిపేజీ తరువాయి..

కోరుకుంటోంది. యుద్ధం కారణంగా దేశంలోని మౌలిక సదుపాయాలు, గృహాలు, రవాణా వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఈ నష్టాన్ని దేశం ఒంటరిగా భరించడం సాధ్యం కాదని, అంతర్జాతీయ స్థాయిలో పరిహారం అవసరమని ఇరాన్ పేర్కొంది. గృహ నిర్మాణాలు, మౌలిక వసతులు ధ్వంసం అవడమే కాకుండా, చమురు, వాణిజ్య రంగాల్లో మూసివేత వల్ల నష్టాలు భారీగా ఉన్నాయని ఇరాన్ అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నష్టాల అంచనా ఇంకా పెరిగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. తమ నష్టాలను భర్తీ చేసుకునేందుకు హోర్ముజ్ జలసంధి ద్వారా వెళ్లే నౌకలపై పన్ను విధించడం వంటి చర్యలను కూడా ఇరాన్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. కాగా, యుద్ధ సమయంలో ఐదు అరబ్ దేశాలు తమ భూ భాగాన్ని ఉపయోగించేందుకు అమెరికా-ఇజ్రాయెల్ దళాలకు అనుమతి ఇచ్చాయని, ఆ దేశాలు కూడా తమకు పరిహారం చెల్లించాలని ఇరాన్ ఇప్పటికే కోరింది.

## పరిగిలో ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో భూసేకరణ

మొదటిపేజీ తరువాయి..

కవిత ఆందోళన చేశారు. ఈ క్రమంలోనే రైతులతో కలిసి వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వం పారిశ్రామికీకరణ ముసుగులో రైతుల పొట్ట కొడుతోందని ఆమె ఆరోపించారు. భూసేకరణ ఆపకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. తక్షణమే భూసేకరణ నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ క్రమంలో రైతులు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. దీంతో కొంతమందిని పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణ జాగృతి, ధర్మ సమాజ్ పార్టీలు రైతులకు సంఘీభావం తెలిపాయి.



## తెలంగాలో భగ్గుమంటున్న భానుడు

మొదటిపేజీ తరువాయి..

నిజామాబాద్, ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి ఉన్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇవాళ ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటి నమోదయ్యాయి. రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా మరో ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాగల మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆయా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే ఛాన్స్ ఉందని పేర్కొంది. నిజామాబాద్, ఖమ్మం, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని, గురువారం ఉమ్మడి ఆదిలాబాద్‌తోపాటు నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీస్తాయని తెలిపింది. వడగాలులు వీచే జిల్లాలకు వాతావరణ శాఖ యెల్లో అలర్ట్ జారీచేసింది.

## ఎసిబికి చిక్కిన లంచగొండి ఇంజనీర్

మొదటిపేజీ తరువాయి..

తీసుకుంటూ అడ్డంగా దొరికాడు. జిల్లాలోని హుజురాబాద్ మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ నుసం సుధాకర్ రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. పట్టణంలో నిర్మించిన స్టోమ్ డైనేజీకి సంబంధించిన ఫైనల్ బిల్లు కోసం మెజర్‌మెంట్ బుక్‌లో నమోదు చేయాలని అధికారులన సంప్రదించాడు. అయితే ఏఈ సుధాకర్‌రెడ్డి రూ. 50 వేలు లంచం డిమాండ్ చేయగా బుధవారం హుజురాబాద్ ఆర్టీసీ డిపో చౌరస్తా వద్ద నగదును తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏఈపై కేసు నమోదు చేసి ,అరెస్టు చేశామని, అనంతరం కరీంనగర్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టామని వెల్లడించారు. వాటర్ డ్రెయిన్ పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు



కోసం లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. హుజూరాబాద్ మున్సిపల్ ఆఫీసులో అసిస్టెంట్ ఇంజనీర్ గా పనిచేస్తున్న సుధాకర్ రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. హుజూరాబాద్ కు చెందిన సంతోష్ కుమార్ అనే కాంట్రాక్టర్ నుంచి రూ 50వేలు లంచం తీసుకుంటుండగా అధికారులు సుధాకర్ రెడ్డిని రెడ్ హ్యాండెడ్ పట్టుకున్నారు. హుజరాబాద్ స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనులకు సంబంధించిన మెజర్‌మెంట్ బుక్ నమోదు, ఫైనల్ బిల్ ప్రాసెస్ కోసం కాంట్రాక్టర్ సంతోష్ కుమార్ ను ఏఈ సుధాకర్ రెడ్డి రూ.50వేల లంచం డిమాండ్ చేశారు. మున్సిపల్ ఆఫీసులో బాధితుడినుంచి లంచం తీసుకుంటుండగా అరెస్ట్ చేశారు. ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరచ నున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

# కాంగ్రెస్‌ది ఒకటే స్టాండ్



మొదటిపేజీ తరువాయి..

రిజర్వేషన్ బిల్లులకు రంగం సిద్ధమైంది. ఈ రెండు బిల్లులను ఏప్రిల్ 16 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం రెడీ అయింది. ఈ క్రమంలో పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలు, బిల్లులకు మద్దతు ఇవ్వాలా వద్దా అనే అంశంపై చర్చించేందుకు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి బుధవారంఢిల్లీలోని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే నివాసంలో భేటీ అయ్యింది. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో కూటమి నేతలు వివిధ అంశాలపై చర్చించారు. ఈ భేటీ అనంతరం ఖర్గే మీడియాతో మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని తెలిపారు. మహిళా రిజర్వేషన్లపై అనాడైనా ఇనాడైనా కాంగ్రెస్‌ది ఒకటే స్టాండ్ అని పేర్కొన్నారు. డీలిమిటేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తోన్న ట్రిక్కులకు వ్యతిరేకమని.. మహిళా రిజర్వేషన్లు అంటూ దొంగ దారిలో డీలిమిటేషన్ అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. డీలిమిటేషన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని.. పార్లమెంట్‌లో ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తామని కాంగ్రెస్ పార్టీ వైఖరిని తెలియజేశారు. డీలిమిటేషన్‌పై ఇండియా కూటమి పార్టీలు ఏకతాటిపై ఉన్నాయని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసమే హడావుడిగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను ప్రవేశ పెడుతోందని ఆరోపించారు. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా పార్లమెంట్ లో సమిష్టిగా పోరాడుతామని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి అనుకూలంగానే ఉందని.. కానీ దానిని తీసుకువచ్చే విధానంపైనే అభ్యంతరాలు ఉన్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పేర్కొన్నారు.
రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌ను ముడిపెట్టి కేంద్రం రాజకీయ కుతంత్రాలు చేస్తోందని ఆరోపించారు. రాజ్యాంగం లోని అధికారాలన్నింటినీ కార్యనిర్వాహక వర్గం తీసుకుంటోందన్నారు. కేవలం ప్రతిపక్ష పార్టీలను అణచివేయడానికే కేంద్ర ప్రభుత్వం ఇలా చేస్తోందన్నారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా తామంతా పార్లమెంట్‌లో ఐక్యంగా పోరాడుతామని ఖర్గే పేర్కొన్నారు. కనీసం జనగణన కూడా పూర్తి చేయకుండా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. కొత్త జనాభా లెక్కల తర్వాతే డీలిమిటేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా ఇప్పుడున్న లోక్‌సభ స్థానాల గరిష్ఠ సంఖ్య (550)ని గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ క్రమంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, తొర్రూర్
ఒ.ఎస్.నం. 58 ఆఫ్ 2025

బిట్వీన్:
1) బైరి లలిత
2) బైరి దీపక్
3) బైరి దివ్య .... వాదులు 1, 2 & 3
మరియు
1) ది తహశీల్దార్, దంతాలపల్లి
2) టు హూమ్ ఇట్ మే సో ఎవర్ కన్‌సర్న్ ... ప్రతివాదులు

పై తెలిపిన దావాలోని వాది నెం.1 అయిన బైరి లలిత గారి భర్త అయిన సుధాకర్ తండ్రి: సోమయ్య గారు తేది: 28.098.2024న మరణించినారు మరియు వారి వారసురాలుగా డిక్లేర్ చేయమని, పై తెలిపిన దావా మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి, తొర్రూర్ కోర్టు యందు దావా వేసినారు. పై తెలిపిన దావా వేసిన దానిపైన కోర్టు వారు పత్రికా ప్రకటన చేయమని ఆర్డరు చేసినారు.
ఒకవేళ ఎవరికైన అభ్యంతరములు ఉన్నచో తేది: 01-05-2026వ తారీఖున ఉదయం 10:30 గంటలకు వారు సయంగా గాని లేదా న్యాయవాది గారి ద్వారాగాని, కోర్టు వారి ముందు తమ అభ్యంతరములు తెలుపవలయును. లేనియెడల కోర్టు వారు ఆర్డరు జారీ చేయగలరు.
"కోర్టువారి ఉత్తర్వుల ప్రకారముగా"
తేది: 23-03-2026


ఎ. ప్రేమ్‌చందర్
బి.కాం., బి.ఎల్.,
మహబూబాబాద్ 506102
మహబూబాబాద్ జిల్లా
సెల్ నం. 9440586192

# వసలదారులు గొప్ప వ్యక్తులు

మొదటిపేజీ తరువాయి..

నేను భారత్ నుంచి వలస వచ్చిన కుటుంబానికి చెందిన అమ్మాయిని వివాహం చేసుకున్నాను. నాకు నా అత్తమామలంటే చాలా ఇష్టం. వారు గొప్ప వ్యక్తులు. యూఎస్‌కు వారు ఎంతో సేవ చేశారు. భారత్ నుంచి వచ్చి ఇక్కడ చదువుకొని, ఈ దేశ పౌరుడిగా మారిన మా మామగారు.. అమెరికా ప్రయోజనాల కోసమే పాటుపడ్డారని వ్యాఖ్యానించారు. భారత మూలాలున్న తన అత్తింటి కుటుంబంపై జేడీవాన్స్ ప్రశంసలు కురిపించారు. అమెరికాను సుసంపన్నం చేయడంలో, ఈ దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వడంలో వారు ఒక నిదర్శనంగా నిలిచారన్నారు. జార్జియా యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. హెచ్-1బీ వీసాలపై అమెరికాలో నివసిస్తున్నవారు గ్రీన్‌కార్డ్ కోసం సుదీర్ఘకాలం వేచి చూడాల్సి వస్తోందంటూ భారత సంతతి వ్యక్తి ఒకరు అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా బదులిచ్చారు. ఉషా చిలుకూరి అమెరికాలో కాలిఫోర్నియాలోని శాండియాగో ప్రాంతంలో పుట్టి పెరిగిన తెలుగమ్మాయి. ఆమె పూర్వీకులది ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పామర్రుకి దగ్గర్లోని ఓ కుగ్రామం. తల్లిదండ్రులు రాధాకృష్ణ, లక్ష్మి 1980ల్లోనే అమెరికా వలస వెళ్లారు.

## కాల్పుల విరమణ గడువు పొడిగించే ఛాన్స్ లేదు



మొదటిపేజీ తరువాయి..

మంచిదన్నారు. వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య కాల్పుల విరమణ అంగీకారం గడువు ఈనెల 21తో ముగియనుంది. ఈ నేపథ్యంలో చర్చల ద్వారా శాశ్వత శాంతిఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా ఎదురుచూస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా రాబోయే రెండు రోజుల్లో మరోసారి ఇరాన్ అధికారులతో సమావేశమవనున్నట్లు తెలిపారు. రెండోవిడత చర్చలపై ఆశాభావం వ్యక్తం చేస్తూ..ఆ రెండు రోజులు అద్భుతంగా ఉండబోతున్నాయన్నారు. గతంలో ఇరాన్‌లో ఉన్న అతివాద శక్తులు పోయి.. ప్రస్తుతం కొత్త పాలన నెలకొందన్నారు. కొత్త పాలకుతో కలిసి పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానము, ధర్మపురి పట్టణం, జగిత్యాల జిల్లా

ఆర్.సి. నెం. ఇ/159/2024 తేది: 15-04-2026

2వ బహిరంగ వేలము ప్రకటన

| క్ర. సం. | అంశము | కాల పరిమితి | ప్రవేశ రుసుం డి.డి/నగదు | సెక్యూరిటీ డిపాజిట్ డి.డి/నగదు | ఇ.ఎమ్.డి. డిపాజిట్ డి.డి/నగదు |
|---|---|---|---|---|---|
| 1 | దేవాలయ ఆవరణలో పూజసామాగ్రి & ఫోటోలు & ఇతరత్రా సామాగ్రి అమ్ముకొను హక్కు గూర్చి | 25-04-2026 నుండి 24-12-2026 వరకు (08) నెలల కాలపరిమితి | 1000/- | 1,00,000.00 | 50,000/- |
| 2 | నృసింహ సదన్ షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణం నెం.06 కిరాయి (లీజు) ఇచ్చుటు గూర్చి | 01-05-2026 నుండి 30-11-2028 వరకు | 1000/- | 25,000/- | 50,000/- |

01) పైన పేర్కొన్న అంశములకు తేది: 22.04.2026 బుధవారం రోజున మధ్యాహ్నం 02.30లకు ఒకదాని తర్వాత ఒకటి బహిరంగ వేలం పాట నిర్వహించబడును. 02) అర్హత మరియు మరియు ఆసక్తిగల వారు పై పట్టికలో పేర్కొన్న అంశముల వారీగా డిపాజిట్ చెల్లించి నేరుగా పాల్గొనవచ్చును. 03) మిగతా వివరములకు కార్యాలయ పని వేళలలో సంప్రదించగలరు.
R.O. No. : 663-PP/CL/ADVT/2026-27, Date: 15-04-2026 సం/-కార్యనిర్వహణాధికారి

# సివిల్ డిపార్ట్మెంట్ ఆఫీసులో సింగరేణి కార్మిక బాట




**మంచిర్యాల, 15, ఏప్రిల్ (ప్రజా జ్యోతి) :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి సివిల్ డిపార్ట్మెంట్ కార్యాలయంలో సింగరేణి కార్మిక బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలు, వారు ఎదుర్కొంటున్న ఇబ్బంది లను ప్రత్యక్షంగా తెలుసు కునేందుకు నాయకులు కార్మికులను కలుసుకున్నారు. బెల్లంపల్లిలో సింగరేణి ఆధీనంలోని 34 వార్డులకు నీటి సరఫరా, క్వార్టర్స్ మరమ్మత్తులు వంటి పనులు నిర్వహించేందుకు సివిల్ కార్యాలయం ఏర్పాటు చేసినప్పటికీ, బస్తీల్లో సంవత్సరాల క్రితం వేసిన వాటర్ పైప్‌లైన్లు దెబ్బతిని రంధ్రాలు పడటంతో అనేక చోట్ల నీరు వృథాగా పోతున్నదని కార్మికులు తెలిపారు. ఈ విషయాన్ని జేఈ దృష్టికి తీసుకెళ్లగా, పైపుల మరమ్మత్తులకు అవసరమైన మెటీరియల్స్ లేవని, శాశ్వత వెల్డర్ కూడా లేదని ఆయన వెల్లడించారు. అలాగే సివిల్ డిపార్ట్మెంట్‌లో పనిచేస్తున్న కార్మికులకు క్యాంటీన్, త్రాగునీటి వంటి కనీస సౌకర్యాలు కూడా లేవని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు "సమాన పనికి సమాన వేతనం" ఇవ్వాలన్న సుప్రీం కోర్టు తీర్పు ఉన్నప్పటికీ, కోల్ ఇండియాలో అమలవుతున్న ఫస్ట్ కేటగిరీ వేతనాలు సింగరేణిలో అమలు కావడం లేదని ఆరోపించారు.సివిల్ విభాగంలో కాంట్రాక్ట్ కార్మికులతో ఎనిమిది గంటల పని చేయించాల్సి ఉండగా, కాంట్రాక్టర్లు 12 గంటలపాటు పని చేయిస్తూ సరైన వేతనం చెల్లించడం లేదని కార్మికులు తెలిపారు. డ్రైవర్లకు కూడా తగిన వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. బెల్లంపల్లిలో బొగ్గు నిల్వలు తగ్గిపోవడంతో ఖాళీగా ఉన్న క్వార్టర్స్‌ను కాంట్రాక్ట్ కార్మికులకు కేటాయించాలని టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి పి. మణిరామ్ సింగ్ కోరారు. సింగరేణిలో గుర్తింపు పొందిన కార్మిక సంఘం కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫల మవడంతో మేనేజ్మెంట్ కూడా స్పందించడం లేదని విమర్శించారు.వెంటనే మందమరి జీఎం జోక్యం చేసుకుని సివిల్ డిపార్ట్మెంట్ సమస్యలను పరిష్కరించా లని, లేనిపక్షంలో సివిల్ కార్యాలయం మరియు జీఎం కార్యాలయం ముందు ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గజ్జి దుర్గయ్య, ఉపాధ్యక్షులు గైని తిరుపతి, బొల్లు మల్లయ్య, బి. కుమార్, ఎం. రాజయ్య, ఎండి అన్వర్, ఎస్.ఎస్. పాండే, జి. శ్యామ్, మేకల నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## వేడిగాలులపై అప్రమత్తంగా ఉండాలి

**– జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఎప్రిల్ 15, (ప్రజాజ్యోతి) :** జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. సాధారణ స్థాయికి మించి 1.5లీజ నుండి 3.5లీజ వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశమున్నదని, జిల్లాలో వచ్చే వారం రోజుల పాటు వేడి గాలులు (హీట్‌వేవ్) ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. పట్టణాలు, గ్రామాలు, ట్రాఫిక్ కూడళ్ల వద్ద అవసరమైన ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు, రెడ్‌క్రాస్ వంటి సేవా సంస్థలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. చలివేంద్రాల్లో ప్రజలకు తాగునీటితో పాటు ఓఆర్ఎస్ (ఓ ఆర్ ఎస్) ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రజలు తగినంత నీరు తాగుతూ శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలని, ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు, అనారోగ్యంతో ఉన్న వారు మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా జాగ్రత్త పడాలని సూచించారు. జిల్లాలో హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్‌ను అత్యవసరంగా సిద్ధం చేసి అమలు చేయాలని, ప్రదేశాల వారీగా వాతావరణ పరిస్థితులను భారత వాతావరణ శాఖ (ఐ ఎమ్ డి) వెబ్‌సైట్ ద్వారా నిరంతరం పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. అలాగే అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు అప్రమత్తంగా ఉండాలని, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, డీహైడ్రేషన్ చికిత్సకు అవసరమైన ఔషధాలను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ప్రజలు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## ఓపెన్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**– జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఎప్రిల్ 15, (ప్రజాజ్యోతి) :** జిల్లాలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా స్థానిక సంస్థల ప్రధాన కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. ఓపెన్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు బుధవారం, తన ఛాంబర్ లో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 20వ తేదీ నుంచి 27 వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్న 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు రెండు పూటలా పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లాలో 1035 మంది పదవ తరగతి, 821 ఇంటర్, మొత్తం కలిపి 1856 మంది విద్యార్థులు, 5 ఎస్ ఎస్ సి, 4 ఇంటర్, మొత్తం 9 పరీక్ష కేంద్రాలలో ఓపెన్ పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. అన్ని పరీక్ష కేంద్రాలలో విద్యార్థులు సౌకర్యవంతంగా పరీక్షలు రాసేలా తగిన ఫర్నిచర్, తాగునీరు, నిరంతరాయ విద్యుత్ సరఫరా, తదితర వసతులు ఉండాలన్నారు. తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య సిబ్బందితో కూడిన అత్యవసర వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన అత్యవసర మందులు, ఓఆర్ఎస్ పొట్లాలు అందుబాటులో ఉంచాలన్నారు. దూర ప్రాంత విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా అవసరమైకు ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. ఈ సమావేశంలో డిఈఓ భోజన్న, డిఐఈఓ పరుశురాం, తపాలా శాఖ ఇన్స్పెక్టర్, ఎసిజిఈ పరమేశ్వర్, ఆర్టీసీ, వైద్య శాఖల అధికారులు రమేష్, సౌమ్య, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ రంగ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**– మేకల దాసు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి**




**మంచిర్యాల, 15, ఏప్రిల్ (ప్రజా జ్యోతి) :** విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు డిమాండ్ చేశారు. సమ్మె చేస్తున్న విద్యుత్ కార్మికుల నిరసన శిబిరంలో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఆర్టీసన్ కార్మికులకు సర్వీస్ రూల్స్‌ను అమలు చేయాలని, పీస్ రేట్ కార్మికులకు జీఓ నెంబర్ 11 ప్రకారం వేతనాలు సకాలంలో చెల్లించాలని కోరారు.



అలాగే పీఆర్సీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏ ప్రభుత్వం వచ్చినా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల జీవితాల్లో మార్పు కనిపించడం లేదని విమర్శించారు. కనీస వేతనాలు, మౌలిక సదుపాయాలు, జీతభత్యాల పెంపు, క్రమబద్ధీకరణ వంటి అంశాల్లో ఎలాంటి పురోగతి లేకుండా కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం వంటి విభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉందని పేర్కొన్నారు. విద్యుత్ రంగ కార్మికులు రోడ్డుపైకి రావడం ద్వారా ప్రభుత్వాల వైఖరి స్పష్టమవుతోందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యుత్ రంగంలోని వివిధ విభాగాల కార్మికుల సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని సిపిఐ, ఏఐటీయూసీ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు మిట్టపల్లి పౌలు, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి








**– జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, 15,ఏప్రిల్ (ప్రజా జ్యోతి) :** వాహనదారులు రహదారి భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని నస్పూర్ సమీకృత జిల్లా కార్యాల యాల భవన సముదాయం నుంచి జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన బైక్ ర్యాలీని డి.సి.పి. ఎ.భాస్కర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, గుడిపేట పోలీస్ బెటాలియన్ అడ్మిన్ వెంకటరాములు, జిల్లా రవాణా అధికారి గోపికృష్ణలతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి వాహనదారుడు రహదారి భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "అరైవ్-అలైవ్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదం ఒక కుటుంబానికే కాక సమాజానికీ తీవ్ర నష్టం కలిగిస్తుందన్నారు.

జిల్లాలో రహదారులపై లైటింగ్ సదుపాయాలు మెరుగు పరచడం, బ్లైండ్ స్పాట్లను గుర్తించి చర్యలు తీసుకోవడం, ట్రాఫిక్ నియంత్రణ కోసం సిగ్నల్ వ్యవస్థలను ఏర్పాటు చేయడం జరుగుతోందని తెలిపారు. అనుభవం ఉన్నా ప్రమాదం ఎప్పుడైనా సంభవించే అవకాశం ఉందని, వాహనం నడిపే సమయంలో పూర్తి ఏకాగ్రత అవసరమని సూచించారు.ద్విచక్ర వాహనదారులు మరియు వెనుక కూర్చునే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీట్ బెల్ట్ ధరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, మద్యం సేవించి లేదా మొబైల్ ఉపయోగిస్తూ వాహనం నడపకూడదని హెచ్చరించారు. రాంగ్ రూట్‌లో ప్రయాణించడం ప్రమాదకరమని పేర్కొన్నారు.

తనిఖీలలో మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు తేలితే లైసెన్స్ సస్పెండ్ చేయడం జరుగుతుందని తెలిపారు. 18 సంవత్సరాల లోపు వారు వాహనాలు నడపకూడదని, అలా చేసినట్లయితే తల్లిదండ్రులపై కూడా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రహదారులపై పరిమిత వేగాన్ని పాటించడం, రవాణా వాహనాలు నిర్ణీత లోడ్ మాత్రమే మోసుకోవడం తప్పనిసరి అన్నారు. పోలీస్, రవాణా శాఖల సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నప్పటికీ ప్రజలు స్వచ్ఛందంగా నిబంధనలు పాటించడం అత్యంత అవసరమని అన్నారు. అతివేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని, వేగ నియంత్రణతోనే సురక్షిత ప్రయాణం సాధ్యమని తెలిపారు.రోడ్డు భద్రత నిబంధనలను కఠినంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో బ్రీత్ అనలైజర్లు, స్పీడ్ గన్స్ వంటి పరికరాలను అవసరమైన మేరకు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. వాహనం నడిపే సమయంలో పాటించే చిన్న జాగ్రత్తలే ప్రాణాలను కాపాడుతాయని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కోల్ పెన్షనర్ల ఫ్యామిలీ పెన్షన్ జారీలో జాప్యం ఎందుకు?

- **త్వరగా వితంతువు పెన్షన్ మంజూరుకాక మహిళల ఆవేదన**
- **నిబంధనలు కాగితాల వరకే పరిమితమా..?**
- **వితంతువు కోల్ పెన్షన్ మంజూరులో తీవ్ర జాప్యం**




**మంచిర్యాల, 15, ఏప్రిల్ (ప్రజా జ్యోతి) :** కోల్ పెన్షనర్ల ఫ్యామిలీ పెన్షన్ జారీలో జాప్యం జరుగుతున్నది . త్వరగా సింగరేణి లో మాజీ ఉద్యోగులైన పెన్షన్ దారుల తదనంతరం వితంతువు (విడో ) కు కొత్త పెన్షన్ నిబంధనల ప్రకారం త్వరగా రావలసిన పెన్షన్ మంజూరు కాక మహిళల ఆవేదన వర్ణనాతీతంగా ఉంది. వితంతువు కోల్ పెన్షన్ మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతున్నది. మాజీ ఉద్యోగులైన జీవిత భాగస్వామికి త్వరగా వితంతువు పెన్షన్ మంజూరు అయ్యే అంశం లో నిబంధనలు కాగితాల వరకే పరిమితమా అనే వాదన మొదలు అయింది . దేశంలోని బొగ్గు గని ఉద్యోగుల పెన్షన్ కోల్ మైన్స్ పెన్షన్ స్కీం–1998 ప్రకారం దాదాపు ఆరు లక్షల రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వబడుతుందని గణాంకాలు చెబుతున్నాయి.ఈ పెన్షన్ ఫండ్ కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఆర్గనైజేషన్ నిర్వహిస్తుంది. ఈ సంస్థ కు వివిధ రాష్ట్రాలలో ప్రాంతీయ కమిషనర్ కార్యాలయాలు ఉన్నాయి ..సింగరేణి సంస్థ ఉన్న తెలంగాణ లో గోదావరి ఖని,కొత్త గూడెం లో ప్రాంతీయ కమిషనర్ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. దేశ వ్యాపంగా ఉన్న ఇతర బొగ్గు సంస్థల్లో రిటైర్డ్ ఉద్యోగులతోపాటు సింగరేణి లో పనిచేసి రిటైర్డ్ అయిన పెన్షన్ దారులకు పెన్షన్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నోడల్ బ్యాంక్ ధన్ బాద్(ఝార్ఖండ్) నుంచి ప్రతి నెల పెన్షన్ వారి బ్యాంకు ఖాతా .కోల్ పెన్షనర్ల వాటా దారుల ఖాతా నిర్వహించడానికి ప్రతి నెల ఒక ఖాతా ఒక్కింటికి 39 రూపాయలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ధన్ బాద్ వారు కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ నుంచి సర్వీస్ ఛార్జ్ క్రింద వసూలు చేస్తున్నారని అనధికారిక వార్త. కోల్ పెన్షనర్ మరణిస్తే అతని జీవిత భాగస్వామికి పెన్షనర్ పొందే సొమ్ములో 60 శాతం ఫ్యామిలీ పెన్షనర్ కు ఇవ్వాలని నిబంధన కలదు. ఫ్యామిలీ పెన్షన్ త్వరగా చెల్లించడానికి 2023 జులై నుంచి ప్రతి పెన్షనర్ తన బ్యాంక్ ఖాతాను ఫార్మర్–సర్వైవర్ మోడ్ లో మార్చుకుంటే వారికి రివైజడ్ పెన్షన్ పేమెంట్ ఆర్డర్ లో జీవిత భాగస్వామికి ఎంత ఫ్యామిలీ పెన్షన్ వస్తుందో ముద్రించి ఇవ్వడం జరిగింది. పెన్షనర్ మరణిస్తే అతని జీవిత భాగస్వామి అవసరమైన పత్రాలు సమీప ఎస్‌బి ఐ శాఖలో సమర్పిస్తే వారు ఎస్‌బి ఐ ధన్ బాద్ వారికి పంపించిన తరువాత పత్రాలు అన్ని పరిశీలించి ఆమెకు పెన్షన్ జారీ చేయవలసిన బాధ్యత ఎస్‌బిఐ ధన్ బాద్ పై ఉంది. కానీ వాస్తవికంగా ఈ ప్రక్రియ నిజరూపం దాల్చుట లేదు. నెలలు గడుస్తున్నను వితంతువులకు ఫ్యామిలీ పెన్షన్ జారీ కావడం లేదని వాపోతున్నారు. కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు ప్రత్యేక సెంట్రల్ పెన్షన్ ప్రాసిసింగ్ సెంటర్ కలిగి ఉండి త్వరగా పెన్షన్ లేదా ఫ్యామిలీ పెన్షన్ జారీ కాబడుతుంది.బొగ్గు పరిశ్రమ కూడ కేంద్ర ప్రభుత్వ ఆధీన సంస్థ గా భాసిల్లుతున్నది. బొగ్గు పెన్షనర్ల సమస్య తీవ్రంగా ఉంది. ఎస్ బి ఐ ధన్ బాద్ నుంచి పెన్షన్ కేంద్రీకృతం కావడం వలన ఈ సమస్య కొనసాగుతుందని పలువురి అభిప్రాయం. కావున ఎస్ బి ఐ ప్రాంతీయ శాఖల ద్వారా కోల్ పెన్షన్ ఫండ్ నిర్వహిస్తే ఇటువంటి సమస్యలు పునరావృతం కాదని సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల అభిప్రాయం.

**కొత్తత్త నిబంధనల ప్రకారం వితంతువు పెన్షన్ త్వరగా మంజూరు చెయ్యాల్సిందే: నాయకులు**

కొత్త నిబందనల ప్రకారం వితంతువు పెన్షన్ త్వరగా మంజూర్ చెయ్యాల్సిందే అని నాయకులు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్, మంచిర్యాల జిల్లా రిటైర్డ్ సింగరేణి ఎంప్లాయిస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు రాళ్ళబండి రాజన్నలు డిమాండ్ చేశారు. మాజీ ఉద్యోగి తదనంతరం జీవిత భాగస్వామికి ప్రతి నెల పెన్షన్ మంజూర్ లో కొత్త పెన్షన్ నిబంధనలు బాధ్యత ధన్బాద్ సిఎంపిఎఫ్ అధికారులదా..?

లేక బ్యాంకుల అధికారులదా..? ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు .ఏది ఏమైనా భర్త చనిపోయి ఎలాంటి ఆదాయం లేక ఆర్థిక బాధలతో మహిళగా వారికి రావలసిన వితంతువు పెన్షన్ ను త్వరగా మంజూరు చేయాలని కోరుతున్నామన్నారు.

# అతిబలవంతుడు ఆరోగ్య ప్రదాత హనుమంతుడే







**పంచముఖ హనుమాన్ మాసోత్సవంలో వేద పండితులు నిమ్మగడ్డ సందీప్ శర్మ**

**ఖానాపూర్ ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి) :** అతిబలవంతులు ఆరోగ్య ప్రదాత కలియుగ ఆరాధ్య దైవం హనుమంతుడేనని నిర్మల్ జిల్లా ఖానాపూర్ వేద పండితులు నిమ్మగడ్డ సందీప్ శర్మ అన్నారు. పవిత్ర ఉత్తర్వాహిని గోదావరి గౌతమి నది తీర ప్రాంతంలోని ఖానాపూర్ పట్టణ కొమరం భీమ్ చౌరస్తాలో గత ఐదు మాసాల క్రితం ప్రతిష్టించిన శ్రీ పంచముఖ హనుమాన్ దేవాలయం ప్రతినెల మోసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు ఈ సందర్భంగా పూర్వభద్ర నక్షత్రం బుధవారం ఐదవ మహోత్సవ కార్యక్రమంలో ఉదయం గణపతి పూజ పంచామృత అభిషేకం అనంతరం విశేష అష్టోత్తర శతనామ అర్చన కార్యక్రమాలను హనుమాన్ చాలీసా పారాయణ అనంతరం హారతి కార్యక్రమాలను ఆలయ అర్చకులు తిరునగరి నందకిషోర్ ఆచార్యులు నిర్వహించారు ఉదయం 10 గంటలకు పంచముఖ ఆంజనేయ స్వామి విశేష హోమ కార్యక్రమాల్ని వేద పండితులు నిమ్మగడ్డ సందీప్ శర్మ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా గణపతి నవగ్రహ మన్యు సుక్త హోమాల్ని నిర్వహించారు హోమ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు తోట హనుమంతు ఎడ్ల రాజేశ్వర్ సీనియర్ జర్నలిస్టు మంత్ర రాజాశీ దేవేందర్ చీఫ్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్లు మంత్రరాజం దివ్యశ్రీ అజయ్ కృష్ణ దంపతులతో పాటు తుమ్మనపల్లి లక్ష్మణ్ సుజాత అంజలి శ్రీరామ్ తోపాటు పలువురు పాల్గొన్నారు ఈ సందర్భంగా పండితులు మాట్లాడుతూ సంవత్సరం పాటు ప్రతినెల మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం వల్ల గ్రామంలో గల అష్టహరిష్టాలు తొలగి శాంతి సౌభాగ్యాలతో పాటు గ్రామం సుభిక్షంగా మెలిగేందుకు హోమాలు దోహదపడతాయని ఇందులో పాల్గొన్న భక్తాదులకు సైతం దరిద్రాలు శత్రు రుణ మృత్యు దోషాలు తొలగిపోతాయని సందీప్ శర్మ అన్నారు గ్రామాల్లో ముఖ్యంగా ఆధ్యాత్మిక చింతన మొదలయ్యేది కేవలం ఆంజనేయ స్వామి కృపవల్లనెని ప్రపంచంలో ప్రతి గ్రామాల్లో తప్పకుండా ఉండే ఆలయం ఆంజనేయస్వామి ఆలయమే అన్నారు అత్యంత భక్తి శ్రద్ధలతో స్వామివారిని కొలిచినట్లయితే కోరిన కోర్కెలు తీరిపోతాయని తెలిపారు ప్రతినెల మాసోత్సవాన్ని వైభవంగా ఆలయ కమిటీ అధ్యక్షులు అల్లాడి వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షులు తోట హనుమంతు కార్యదర్శి తుమ్మలపల్లి లక్ష్మణ్ కోశాధికారి ఎడ్ల రాజేశ్వర్ సభ్యులు సింగ్ ప్రవీణ్ రాజేశ్వర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొని నిర్వహిస్తున్నారు అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని సైతం భక్తాదులకు ప్రతినెల అందజేస్తున్నారు నీ మాసంలో అన్నదానాన్ని తుమ్మనపల్లి లక్ష్మణ్ సుజాతలు చేశారు వందలాది మంది భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులయ్యారు ఇందులో నూతన కౌన్సిలర్లు బండేపల్లి సింధుజ బొప్పారపు సత్యవతిలు పాల్గొన్నారు ఆలయ కమిటీ వారిని సన్మానించారు.

# వృద్ధుల ఆరోగ్య వేసవిలో ప్రత్యేక జాగ్రత్తలు అవసరం





**మంచిర్యాల, 15 ఏప్రిల్ (ప్రజా జ్యోతి) :** వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని డెమొక్రటిక్ సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ విజ్ఞప్తి చేశారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా వృద్ధుల్లో వడదెబ్బ ప్రమాదం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఆయన తెలిపారు. వృద్ధులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బయటకు వెళ్లకుండా ఉండాలని, రోజుకు తగినంతగా నీరు మరియు ద్రవాలు తీసుకోవాలని సూచించారు. నూనె పదార్థాలతో కూడిన వేపుడు కూరలను మానివేయాలని, మజ్జిగ, కొబ్బరి నీరు, నిమ్మరసం వంటి పానీయాలు శరీరాన్ని చల్లగా ఉంచడంలో సహాయపడతాయని తెలిపారు.అలాగే తేలికపాటి కాటన్ దుస్తులు ధరించడం, గాలి ఆడే ప్రదేశాల్లో విశ్రాంతి తీసుకోవడం అవసర మన్నారు. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వృద్ధులు తమ మందులను సమయానికి తీసుకోవడంతో పాటు వైద్యుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.తల తిరగడం, అధిక వేడి, అలసట వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప వైద్యుడిని సంప్రదించాలని కోరారు. కుటుంబ సభ్యులు వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, వారికి తగిన ఆహారం, నీరు అందుతున్నాయా అనే విషయాన్ని నిరంతరం గమనించాలని విజ్ఞప్తి చేశారు. వృద్ధుల ఆరోగ్యం మన అందరి బాధ్యత -- జాగ్రత్తలతోనే రక్షణ సాధ్యం అని ఆయన స్పష్టం చేశారు.

# మారుమూల గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

**– హెచ్ ఈ ఓ పవర్ రవీందర్**



**నేరడిగొండ, ఏప్రిల్ 15(ప్రజాజ్యోతి) :** నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తేజాపూర్ సబ్ సెంటర్ పరిధిలో ఉన్న పీవీటీజీ గ్రామం చించోలిలో బుధవారం "ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంతో పాటు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హెచ్ఈఓ పవార్ రవీందర్‌లి హెల్త్ సూపర్ వైజర్ సంతోష్ హాజరయ్యారు. గ్రామంలోని ప్రజల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించి, వారికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రగతి ప్రణాళికలో భాగంగా మారుమూల గ్రామాల్లోని ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యమని తెలిపారు. పీవీటీజీ గ్రామాల ప్రజలు ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే స్థానిక ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎల్.హెచ్.పి వైష్ణవి హెల్త్ అసిస్టెంట్ సాయన్న అంగన్‌వాడీ టీచర్ కనక లక్ష్మి మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# వేడిగాలులపై అప్రమత్తంగా ఉండాలి

**– జిల్లా కలెక్టర్ రాజర్షి షా**




**ఆదిలాబాద్ బ్యూరో, ఎప్రిల్ 15, (ప్రజా జ్యోతి) :** జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. సాధారణ స్థాయికి మించి 1.5లీజ నుండి 3.5లీజ వరకు ఉష్ణోగ్రతలు న మోదయ్యే అవకాశమున్నద ని, జిల్లాలో వచ్చే వారం రోజు ల పాటు వేడి గాలులు (హీట్ వేవ్) ప్రభావం అధికంగా ఉం డే అవకాశం ఉందని తెలిపా రు. పట్టణాలు, గ్రామాలు, ట్రాఫిక్ కూడళ్ల వద్ద అవసరమైన ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పా టు చేయాలని కలెక్టర్ అధికా రులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ లు, రెడ్‌క్రాస్ వంటి సేవా సంస్థ లను భాగస్వామ్యం చేయాల ని సూచించారు.చలివేంద్రాల్లో ప్రజలకు తాగునీటితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబా టులో ఉంచాలని తెలిపారు. ప్రజలు తగినంత నీరు తాగు తూ శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉం చుకోవాలని, ముఖ్యంగా వృ ద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీ లు, అనారోగ్యంతో ఉన్న వా రు మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా జాగ్రత్త పడాలని సూచించారు. జిల్లా లో హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్‌ను అత్యవసరంగా సిద్ధం చేసి అ మలు చేయాలని, ప్రదేశాల వారీగా వాతావరణ పరిస్థితు లను భారత వాతావరణ శాఖ (ఐఎండి) వెబ్ సైట్ ద్వారా ని రంతరం పరిశీలించాలని అధి కారులకు ఆదేశించారు. అలా గే అన్ని ప్రాథమిక ఆరోగ్య కేం ద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రా లు అప్రమత్తంగా ఉండాలని, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, డీహైడ్రేషన్ చికిత్సకు అవసరమైన ఔష ధాలను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ప్రజలు ఎండ తీవ్రతను దృష్టి లో ఉంచుకొని జాగ్రత్తలు పా టిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకో వాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## భారతదేశ ప్రజల జీవితాల్లో. వెలుగులు నింపిన మహనీయుడు అంబేద్కర్

- మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు
- ఘనంగా 135 వ జయంతి వేడుకలు

నాగర్ కర్నూల్ ఏప్రిల్ 14( ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) భారతదేశంలో ప్రజలందరూ స్వేచ్ఛగా జీవిస్తున్నారంటే.. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే, ప్రజలందరూ భిన్నత్వంలో కూడా ఏకత్వం మై జీవిస్తున్నారని మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు స్పష్టం చేశారు. మంగళవారం అచ్చంపేట మున్సిపాలిటీ కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాబాసాహెబ్ 135వ జయంతి సందర్భంగా కౌన్సిల్ సభ్యులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ కేవలం ఒక వర్గానికి చెందిన నాయకుడు కాదు సబ్బండ కులాల చెందిన నాయకుడని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా బాబా సాహెబ్ అంబేద్కర్ సూచించిన విధంగా బోధించు, సమీకరించు, పోరాడు అన్న బాబాసాహెబ్ నినాదాన్ని మనం పూర్తిగా తీసుకొని జీవనం కొనసాగించాలని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు గౌరీ శంకర్, మన్ను పటేల్, అంతటి శివ, తగరం శీను, కో ఆప్షన్ నెంబర్ అచ్చంపేట కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండి ఖాదర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు స్నేహ సంబంధాలను పెంపొంది స్తాయి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

గద్వాల ఏప్రిల్ 14(ప్రజా జ్యోతి ప్రతినిధి): క్రీడలు శారీరకంగా,మానసికంగా దృఢంగా ఉండేందుకే కాక అందరిలో స్నేహ సంబంధాలను పెంపొందించడానికి దోహదపడతాయని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.ఎస్జిటియు(సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్)జోగులాంబ గద్వాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5వ,తేదీ నుంచి 14వ,తేదీ వరకు గద్వాల ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన టిపిఎల్ (టీచర్స్ ప్రీమియం లీగ్) క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ విజేతలకు మంగళవారం నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఉపాధ్యాయులు మొదటిసారి ఈ క్రీడల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని,తాము నేర్చుకున్న క్రీడా నైపుణ్యాలను తమ పాఠశాలలోని విద్యార్థులకు నేర్పించాలని సూచించారు.200 మంది క్రీడాకారులకు 12 టీములుగా క్రికెట్ మ్యాచ్ లను సమర్థవంతంగా నిర్వహించిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.అనంతరం క్రికెట్ పోటీల విజేతగా నిలిచిన గట్టు గేమర్స్ జట్టుకు రూ.20 వేల చెక్కు,రన్నర్స్ గా నిలిచిన గద్వాల గ్లాడియేటర్స్ జట్టుకు రూ.15 వేల చెక్కు తో పాటు పతకాలు,ట్రోఫీలను కలెక్టర్ అందజేశారు.వివిధ విభాగాల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు కూడా బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో డిఈవో విజయలక్ష్మి ,ఇన్చార్జి డి వై ఎస్ ఓ రామలింగేశ్వర్ గౌడ్,వివిధ మండలాల విద్యాధికారులు,ఇతర అధికారులు,ఎస్జిటియు నేతలు,ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ ఆశయాలతో అణగారిన వర్గాల అభ్యున్నతి:ఎంపీ మల్లు రవి

గద్వాల ఏప్రిల్ 14(ప్రజా జ్యోతి ప్రతినిధి): భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగంలో అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా విద్య,ఉద్యోగాలు, రాజకీయాల్లో వారికి ప్రాధాన్యత లభించిందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి పేర్కొన్నారు.అంబేద్కర్ 135వ,జయంతిని పురస్కరించుకుని మంగళవారం గద్వాల అంబేద్కర్ చౌరస్తాలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్,ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ, ప్రజలు రాజ్యాంగాన్ని సులభంగా అర్థం చేసుకునేందుకు "భారత రాజ్యాంగం ముఖ్యాంశాలు" పేరుతో 30 వేల పుస్తకాలు ముద్రింపజేసినట్లు తెలిపారు.రిజర్వేషన్ల వల్ల అనేక మంది అణగారిన వర్గాల ప్రజలు ఉన్నత స్థానాలకు ఎదిగారని పేర్కొన్నారు. జిల్లాలో అభివృద్ధి పనులతో పాటు రైల్వే లైన్,ఈఎస్ఐ ఆసుపత్రి,అంబేద్కర్ కళాభవన్ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు.జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ, అంబేద్కర్ సమానత్వం,స్వేచ్ఛ కోసం జీవితాంతం కృషి చేశారని తెలిపారు.ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ,రాజ్యాంగం ప్రతి పౌరుడికి రక్షణ కల్పించే శక్తివంతమైన పత్రంగా నిలిచిందన్నారు.అనంతరం రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించి,ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,అధికారులు,వివిధ రాజకీయ పార్టీల నాయకులు,ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాల అమలు అత్యంత కీలకం

- ఆటో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు, 'అరైవ్ అలైవ్'లో భాగంగా ప్రత్యేక శిబిరం

వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి): ప్రజల ప్రాణ రక్షణకు రోడ్డు భద్రతా నియమాల అమలు అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. బుధవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా నాగవరం రవాణా శాఖ కార్యాలయం (ఆర్‌టీఓ)లో ఆటో డ్రైవర్ల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్ష





శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డు భద్రత కార్యక్రమాలను నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. రోడ్డు భద్రత నియమాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. నియమాలను కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని ఆటో డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ప్రాణ భద్రత కోసం రోడ్డు నియమాల అమలు అత్యంత అవసరమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీటీఓ మానస, సంబంధిత అధికారులు, రవాణా శాఖ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## "హెల్మెట్ అలవాటు-ప్రాణాల రక్షణకు మొదటి అడుగు":జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

అలంపూర్ ఏప్రిల్ 15(ప్రజా జ్యోతి ప్రతినిధి): ప్రయాణ సమయంలో వాహనదారులు హెల్మెట్ ధరించడం బాధ్యతగా భావించాలి.హెల్మెట్ ధరించడం అలవాటుగా చేసుకోవడం ద్వారా మన









ప్రాణాలకు,కుటుంబాల భద్రతకు రక్షణగా నిలుస్తుందని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు అన్నారు.99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా, జిల్లా లోని అలంపూర్ పట్టణంలోని మౌంటేశ్వరి హై స్కూల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం విద్యార్థుల్లో విశేష చైతన్యాన్ని నింపింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ భావి భారత పౌరులైన విద్యార్థులకు భద్రతపై స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,"ఇంటి నుంచి బయలుదేరేటప్పుడు'నా వల్ల నాకు గానీ,ఇతరులకు గానీ ప్రమాదం జరగకూడదు'అనే ఆలోచనతో ప్రయాణం ప్రారంభిస్తేనే రోడ్డు ప్రమాదాలను తగ్గించగలం"అని పేర్కొన్నారు.ప్రపంచం అంతరిక్షంలో అద్భుతాలు సాధిస్తున్న ఈ కాలంలో కూడా,రోడ్లపై అవగాహన లోపం వల్ల ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని అన్నారు.విద్యార్థులే కుటుంబాల్లో మార్పుకు దూతలుగా మారాలని,తల్లిదండ్రులు, స్నేహితులు,బంధువులకు ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను తెలియజేయాలని పిలుపునిచ్చారు.ప్రత్యేకంగా బాలికలను ఉద్దేశించి మాట్లాడుతూ,వారి భావోద్వేగ ప్రభావం కుటుంబంపై ఎక్కువగా ఉంటుందని,తండ్రులు,అన్నలు బయటకు వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించమని ప్రేమగా కోరితే అది అలవాటుగా మారుతుందని సూచించారు.స్కూల్లో క్రమశిక్షణ ఎంత ముఖ్యమో,రోడ్డు మీద కూడా అదే క్రమశిక్షణ ప్రాణాలను కాపాడుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో హెల్మెట్ వినియోగం,సీట్ బెల్ట్ ధరించే విధానం,జీబ్రా క్రాసింగ్ వినియోగం వంటి అంశాలను ప్రాక్టికల్ డెమో ద్వారా విద్యార్థులకు వివరించారు.మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ సీట్ బెల్ట్ అవసరాన్ని వివరించి,ప్రతి ప్రయాణం భద్రంగా ఉండాలంటే ట్రాఫిక్ నియమాలు పాటించడం తప్పనిసరి అని తెలిపారు.అత్యంత ప్రభావవంతంగా,రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనపై నిర్వహించిన స్కిట్ విద్యార్థులను ఆలోచింపజేసింది.హెల్మెట్ ధరించని వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం,హెల్మెట్ ధరించిన వారు క్షేమంగా బయట పడడం ద్వారా భద్రత ప్రాముఖ్యతను స్పష్టంగా చూపించారు.అనంతరం విద్యార్థులు "అరైవ్ అలైవ్" సందేశంతో మానవహారం నిర్మించి సమాజానికి బలమైన సందేశం అందించారు. గద్వాల డీఎస్పీ వై.మొగిలయ్య మాట్లాడుతూ,మైనర్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రూ.25,000 జరిమానాతో పాటు తల్లిదండ్రులకు శిక్ష విధించే అవకాశం ఉందని తెలిపారు.ట్రాఫిక్ నియమాలపై అవగాహన లేకపోవడమే ప్రమాదాలకు ప్రధాన కారణమని,డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపకూడదని స్పష్టం చేశారు.స్కూల్ యాజమాన్యం"యాక్సిడెంట్ ఈజ్ నాట్ యాన్ యాక్సిడెంట్, ఇట్ ఇస్ ఏ డిజాస్టర్"అనే సందేశంతో ప్రమాదాల తీవ్రతను వివరించింది.ఈ కార్యక్రమంలో గద్వాల డీఎస్పీ వై.మొగిలయ్య,సీఐ ప్రదీప్ కుమార్,ఎంవీఐ ప్రవీణ్ కుమార్,ఎంపీడీవో పద్మావతి,ఎంఈఓ అశోక్ కుమార్,స్కూల్ కరస్పాండెంట్ & ప్రిన్సిపాల్ కేఎన్‌వి రవిప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## గద్వాల జనరల్ ఆసుపత్రిలో సమస్యల పరిష్కారానికి సమిష్టి కృషి అవసరం:కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల ఏప్రిల్ 15(ప్రజా జ్యోతి ప్రతినిధి): గద్వాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సమస్యలను పరిష్కరించి,రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కమిటీ సభ్యులు,వైద్యాధికారులు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు.బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన గద్వాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఆసుపత్రిలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న వైద్యులు,ఇతర సిబ్బందిని నిబంధనల ప్రకారం నియమించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే అవసరమైన పరికరాలు,వసతుల కల్పనకు విభాగాల వారీగా ప్రతిపాదనలు పంపాలని తెలిపారు.ఆసుపత్రి నిధులను ప్రాధాన్య క్రమంలో వినియోగించాల్సిందిగా సూచించిన కలెక్టర్,పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మెప్మా పరిధిలో అర్బన్ షెల్టర్ హోమ్ నిర్మాణానికి ఇప్పటికే నిధులు మంజూరైనందున తగిన స్థలంలో నిర్మాణం చేపట్టాలని అన్నారు.సదరం సర్టిఫికెట్ క్యాంపులకు వచ్చే దివ్యాంగులకు ఇబ్బంది లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.గాంధీ చౌక్‌లోని పాత జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో ఖాళీ గదులను ఉపయోగించి ఆయుష్ ఆసుపత్రిని తరలించే అంశాన్ని పరిశీలించాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ,గద్వాల నుంచి చాలా మంది రోగులు మెరుగైన వైద్య సేవల కోసం కర్నూల్‌కు



వెళ్లాల్సి వస్తోందని అన్నారు.జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు.జనరల్ ఆసుపత్రిలో అన్ని రకాల శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు అవసరమైన వైద్యులు,పరికరాలు అందుబాటులో ఉండాలని కోరారు.గర్భిణీలు ప్రసవాల కోసం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని,అక్కడ అధికంగా సిజేరియన్ ఆపరేషన్లు చేసి భారీ బిల్లులు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ఎక్కువగా ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఆసుపత్రిలో జనరేటర్ల నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయించాలని అన్నారు.మెడికల్ కాలేజీలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులు,ఇతర సిబ్బందిని భర్తీ చేసేందుకు తాను కృషి చేస్తానని తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించినప్పుడే ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని,ఆ దిశగా అధికారులు,కమిటీ సభ్యులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయి,ఆసుపత్రి పర్యవేక్షకులు ఇందిర, మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వరరావు,టీజీఎంఎస్ఐడీసీ డీఈ శ్రీనివాసులు,ఏఈ రహీం,కమిటీ సభ్యులు శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అబార్షన్ కేసులపై అప్రమత్తంగా ఉండాలి

- వైద్యులకు కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాలు

వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి): జిల్లాలో అబార్షన్ కేసుల విషయంలో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి కేసు వెనుక ఉన్న



కారణాలను సమగ్రంగా విశ్లేషించి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం గోపాలపేట మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ పలు విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈడీడీ, డెలివరీ రిజిస్టర్లను తనిఖీ చేసి, ఆసుపత్రిలో నమోదవుతున్న ప్రసవాలు, అబార్షన్లపై వివరాలు తెలుసుకున్నారు. అబార్షన్లకు గల కారణాలు, అవి చోటుచేసుకునే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వైద్యులకు సూచించారు. ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవల కోసం అవసరమైన సదుపాయాలపై ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. మహిళల్లో HPV వ్యాక్సిన్‌పై అవగాహన పెంచాలని, ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

గోపాలపేట మండలం పోలికేపాడు గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి బిల్లుల విడుదలపై వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో మంజూరైన 35 ఇళ్లలో 34 ఇళ్లు గ్రౌండింగ్ పూర్తి కాగా, 3 ఇళ్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. అర్హులైన వారికి తదుపరి దశలో ఇళ్లు కేటాయిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

మోడల్ హౌస్ పరిశీలన

తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను కలెక్టర్ పరిశీలించి నిర్మాణ శైలిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ భవనాన్ని త్వరలో అసిస్టెంట్ ఇంజనీర్ (హౌసింగ్) కార్యాలయంగా వినియోగంలోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు.

సెన్సస్ పనులు వేగవంతం చేయాలి

తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జనగణన ప్రక్రియపై అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, హౌస్ లిస్టింగ్ బ్లాక్స్ గుర్తింపు, డిమార్కేషన్ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ విఠోభా, సీపీ ఓ హరికృష్ణ, తహసీల్దార్ తిలక్, వైద్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.v

## "అరైవ్ అలైవ్"తో రోడ్డు భద్రతపై మేల్కొలుపు

విద్యార్థులతో మానవహారం – ట్రాఫిక్ నియమాల పాటనపై ఎస్పీ జానకి పిలుపు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి బ్యూరో): ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం బుధవారం పోలీస్ లైన్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించబడింది. కార్యక్రమానికి జిల్లా ఎస్పీ దరావత్ జానకి హాజరై విద్యార్థులతో కలిసి మానవహారం ఏర్పాటు చేసి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు ప్రధానంగా నిర్లక్ష్యం, అధిక వేగం, ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం వల్ల జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగించడం, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు. చిన్న వయస్సు నుంచే విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని, వారు బాధ్యత గల పౌరులుగా ఎదగాలని తెలిపారు. విద్యార్థులు ఇక్కడ నేర్చుకున్న నియమాలను తమ తల్లిదండ్రులకు కూడా తెలియజేసి,



కుటుంబ స్థాయిలో అవగాహన పెంచాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులతో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ముఖ్య సూచనలు: ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలి– రెండు చక్రాల వాహనదారులు హెల్మెట్ ధరించాలి

– నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ వినియోగించాలి– అధిక వేగంతో వాహనం నడపకూడదు– మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదు

– డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం నివారించాలి

– పాదచారులు జీబ్రా క్రాసింగ్ వద్ద మాత్రమే రోడ్డు దాటాలి. "అరైవ్ అలైవ్" కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలని, రోడ్డు భద్రతను జీవితంలో భాగంగా మార్చుకోవాలని ఎస్పీ జానకి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి వెంకటేశ్వర్లు, టూ టౌన్ ఇన్స్పెక్టర్ యజాదుద్దీన్ తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిజం ముసుగులో బ్లాక్ మెయిల్‌కు పాల్పడితే చర్యలు తప్పవు : అసత్య ప్రచారాలపై పాలమూరు ప్రెస్ క్లబ్ గర్జన

- విలువల్ని దిగజార్చితే వేటు తప్పదన్న హెచ్చరిక
– సభ్యత్వ రద్దుతో పాటు చట్టపరమైన చర్యలకు సిద్ధం

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి బ్యూరో): జర్నలిజం అనే పవిత్ర వృత్తిని కొందరు వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాడుకుంటూ, ప్రజా ప్రతినిదులు, రాజకీయ నాయకులు, అధికారులను విద్యా వేత్త లు, వ్యాపారస్తులను వేధించడం తో పాటు తోటి జర్నలిస్టులపై అసత్య ప్రచారాలు చేస్తుండటాన్ని తీవ్రంగా ఖండిస్తూ మహబూబ్‌నగర్ ప్రెస్ క్లబ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. బుధవారం ప్రెస్ క్లబ్ కార్యాలయంలో జరిగిన అత్యవసర సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా ఈ అంశంపై చర్చించి కఠిన నిర్ణయాలు తీసుకున్నారు. సీనియర్ ఎడిటర్ చంద్రశేఖర్ గౌడ్‌పై వచ్చిన దుష్ప్రచారం కేవలం వ్యక్తిగత దాడి మాత్రమే కాకుండా, మొత్తం జర్నలిస్ట్ సమాజంపై జరిగిన దాడిగా భావిస్తున్నామని సభ్యులు స్పష్టం చేశారు. సంబంధిత పత్రికలో ప్రచురితమైన వార్తలను ముక్తకంఠంతో ఖండించారు.

జర్నలిస్టుల విలువలకు విరుద్ధం : జర్నలిజం అంటే ప్రజా సమస్యలపై స్పందించి వాస్తవాలను సమాజానికి అందించడం. కానీ తోటి జర్నలిస్టులనే లక్ష్యంగా చేసుకుని అసత్య ఆరోపణలు చేయడం వృత్తి ధర్మానికి విరుద్ధమని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారు జర్నలిస్టులుగా పిలిపించుకోవడానికి అర్హులు కాదని తీవ్రంగా విమర్శించారు. ప్రెస్ క్లబ్ నిధుల దుర్వినియోగంపై జరుగుతున్న



ప్రచారం పూర్తిగా అసత్యమని సభ్యులు తేల్చిచెప్పారు. ప్రతి రూపాయి లెక్క చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ప్రెస్ క్లబ్ వంటి గౌరవప్రదమైన సంస్థలో ఉంటూ, తోటి సభ్యులపైనే విషం చిమ్మే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు.

కఠిన చర్యలకు సిద్ధం : సదరు వ్యక్తి ప్రవర్తనపై మూడు గంటల పాటు సుదీర్ఘంగా చర్చించిన అనంతరం, కేవలం సభ్యత్వ రద్దు మాత్రమే కాకుండా చట్టపరమైన చర్యలకు కూడా వెనుకాడబోమని సమావేశం నిర్ణయించింది. త్వరలో జిల్లా సమాచార మరియు పౌర సంబంధాల శాఖ అధికారులను కలిసి, సంబంధిత వ్యక్తి అక్రిడిటేషన్ రద్దు చేయాలని అధికారికంగా విజ్ఞప్తి చేయనున్నట్లు తెలిపారు.వ్యవస్థను భ్రష్టు పట్టించే వారికి ప్రెస్ క్లబ్ ఎలాంటి అండ అందించదని, విలువలతో పనిచేసే ప్రతి జర్నలిస్టుకు పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. జర్నలిజం ముసుగులో అరాచకాలు చేసే వారికి సంస్థలో స్థానం లేదని తేల్చిచెప్పారు. ఇకపై వాట్సాప్ గ్రూప్‌లలో వ్యక్తిగత విమర్శలు చేయరాదని సభ్యులకు సూచించారు. అలాంటి చర్యలు కొనసాగితే సంబంధిత వ్యక్తులను గ్రూప్‌ల నుంచి తొలగించాలని నిర్ణయించారు.

## చిన్నారుల భద్రతే ప్రాధాన్యం : బస్సు డ్రైవర్లకు డిఫెన్సివ్ డ్రైవింగ్ శిక్షణ

"అరైవ్ అలైవ్"లో భాగంగా ఎస్పీ జానకి అవగాహన – బాధ్యతాయుత డ్రైవింగ్‌పై దృష్టి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి బ్యూరో) : ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కొనసాగుతున్న 99 రోజుల కార్యచరణలో రోడ్డు భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ, "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పాఠశాల, కళాశాల బస్సు డ్రైవర్లకు డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ దరావత్ జానకి హాజరై డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతూ, డిఫెన్సివ్ డ్రైవింగ్ అనేది ప్రతి డ్రైవర్‌కు అత్యంత కీలకమని తెలిపారు. ముఖ్యంగా చిన్నారులను తీసుకెళ్లే బస్సు డ్రైవర్లు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, వారి ప్రాణ భద్రత తమ చేతుల్లోనే ఉందని గుర్తు చేశారు. ఇతరుల తప్పులను కూడా ముందుగానే అంచనా వేసి జాగ్రత్తగా వాహనం నడపడం, వేగ పరిమితులను కచ్చితంగా పాటించడం, ట్రాఫిక్ నియమాలను అమలు చేయడం, వాహనాల నిర్వహణపై శ్రద్ధ పెట్టడం వంటి అంశాలపై ఎస్పీ స్పష్టమైన సూచనలు చేశారు. స్కూల్, కళాశాల బస్సులు నడిపే డ్రైవర్లు మరింత బాధ్యతతో వ్యవహరించి విద్యార్థుల భద్రతను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న డ్రైవర్లతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించి, అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, పి.ఎస్.పి సురేష్ కుమార్, డి.ఎస్.పి వెంకటేశ్వర్లు, వర్టికల్ డి.ఎస్.పి బాలాజీ, డీసీఆర్‌బి డి.ఎస్.పి రమణారెడ్డి, డీటీఓ రఘు కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి, విమెన్ పి.ఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మోతిరామ్ తదితరులు పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని పాఠశాల, కళాశాల బస్సు డ్రైవర్లు పెద్ద సంఖ్యలో హాజరై ఈ అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## హసన్‌పర్తిలో వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నూతన శాఖ త్వరలో ప్రారంభం




**హసన్‌పర్తి, ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి) :** వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నూతన శాఖ హసన్‌పర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనంలో త్వరలో ప్రారంభం కానుంది. ఈ శాఖ ప్రారంభంతో హసన్‌పర్తి మండలం సహా సమీప గ్రామాల ప్రజలకు బ్యాంకు సేవలు మరింత చేరువ కానున్నాయి. ఇప్పటివరకు బ్యాంకు అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొనగా, ఇకపై స్థానికంగానే సేవలు పొందే సౌకర్యం కలగనుంది. ముఖ్యంగా రైతులకు పంట రుణాలు, పశుసంవర్ధక రుణాలు, స్వయం ఉపాధి రుణాలు అందుబాటులోకి రావడం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని అధికారులు పేర్కొన్నారు. అదనంగా పొదుపు ఖాతాలు, స్థిర నిక్షేపాలు, ఆన్‌లైన్ లావాదేవీల వంటి సౌకర్యాలు కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. సభ్యులు, ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని బ్యాంకు అధికారులు సూచించారు. స్థానిక సహకార సంఘాలతో సమన్వయం చేస్తూ ఈ శాఖ గ్రామీణాభివృద్ధికి దోహదపడనుంది. మొత్తంగా ఈ శాఖ ప్రారంభం హసన్‌పర్తి ప్రాంతానికి ఆర్థికంగా కొత్త ఊపును తీసుకురానుందని ఆశాభావం వ్యక్తమవుతోంది

## మొక్కజొన్న కొనుగోలులో నిర్లక్ష్యం

**– రైతులకు మద్దతుగా బీజేపీ నాయకుల రాస్తారోకో**




**వర్ధన్నపేట ఏప్రిల్ 15, ప్రజాజ్యోతి :** వర్ధన్నపేట మండలం ఇల్లంద వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు మద్దతుగా ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. మొక్కజొన్న కాంటాలు ఆలస్యంగా జరగడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కాంటాలు పూర్తయిన ధాన్యాన్ని తరలించేందుకు సరైన రవాణా సదుపాయం కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వెంటనే ట్రాన్స్‌పోర్ట్ సదుపాయం కల్పించి, కాంటాల ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో బీజేపీ జిల్లా నాయకులు కుందూరు మహేందర్ రెడ్డి, పింగిలి సంపత్ రెడ్డి, వడ్డే దేవేందర్, మహిళా నాయకురాలు సొల్లేటి హైమావతి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో రైతులు హాజరై తమ నిరసనను వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న వర్ధన్నపేట ఎస్సై సాయి బాబు ఘటనాస్థలానికి చేరుకుని రైతులు, బీజేపీ నాయకులతో మాట్లాడారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, కాంటాలు పూర్తిచేయడంతో పాటు ధాన్యం రవాణా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం

**– మండల సభల ప్రధాన లక్ష్యం**

**– కొడకండ్ల తహసీల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ : సందీప్ కుమార్ ఝా**



**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి) :** జిల్లాలోని కొడకండ్ల మండల తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం సందర్శించి, ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో నిర్వహిస్తోన్న వివిధ సేవలు, దస్త్రాల నిర్వహణ, హాజరు పట్టికలు, తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ప్రతి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రికార్డు రూంను తనిఖీ చేసి, రెవెన్యూ రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్ సేవల అమలు వంటి అంశాలను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని సూచించారు. కార్యాలయంలో పరిశుభ్రత చర్యలు పాటించాలని, రికార్డుల సంరక్షణపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించాలని తెలిపారు. అనంతరం కొడకండ్ల మండలంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఈ నెల 16న జరిగే మండల సభల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమా వేశం ఏర్పాటు చేసి, సమీక్షించారు. ఈ నేపథ్యంలో అధికారులకు దిశానిర్దేశం చేశారు. మండల స్థాయిలో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని, వెంటనే పరిష్కరించేందుకు మండల సభలు ముఖ్య వేదికగా నిలుస్తాయని కలెక్టర్ తెలిపారు. సభను సమర్థవంతంగా నిర్వహించాలని, సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మైక్ నిర్వహణ, మౌలిక సదుపాయాల ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా సన్నబియ్యం, రేషన్, గృహ నిర్మాణాలు, తదితర అంశాలపై వచ్చిన ఫిర్యాదులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని పేర్కొన్నారు. సభల నిర్వహణలో సమయపాలన పాటిస్తూ, అందిన ప్రతి అర్జీని నమోదు చేయాలని తెలిపారు. మండల స్థాయి అధికారులు సమన్వయంతో పని చేసి సభను విజయవంతం చేయాలని సూచించారు. ఈ తనిఖీలో, సమావేశంలో గృహ నిర్మాణ పీడీ మాతృ నాయక్, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎన్. ఎల్. నరసింహ రావు, ఎంపిడిఓలు నాగశేషాద్రి సూరి, వెంకటేష్, తహసీల్దార్ లు అనిల్ బాబు, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ల్యాబర్తిలో రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ




**వర్ధన్నపేట ఏప్రిల్ 15, ప్రజాజ్యోతి :** రహదారి భద్రతపై అవగాహన పెంపొందించేందుకు బుధవారం ల్యాబర్తి గ్రామంలో జడ్‌పీహెచ్‌ఎస్, ఎమ్‌పీపీఎస్ పాఠ శాలల ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా విద్యార్థులు నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. అనంతరం ల్యాబర్తి జంక్షన్ వద్ద విద్యార్థులు భారీ మానవహారం ఏర్పాటు చేసి, గ్రామస్తులతో కలిసి రహదారి భద్రతా నియమాలను పాటించేందుకు ప్రతిజ్ఞ చేయించారు. "నియమాలు పాటిద్దాం–సురక్షితంగా గమ్యం చేరుదాం" అనే నినాదంతో కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా జడ్‌పీహెచ్‌ఎస్ ల్యాబర్తి ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని, కారు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. వాహనం నడుపుతున్న సమయంలో సెల్ ఫోన్ వినియోగం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండటం ద్వారా మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నర్సయ్య, రెండు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## బాల సదనం బాలికలు బాగా చదువుకోవాలి



- బాల సదనంలోని బాలికలు ఉన్నత లక్ష్యాలతో చదువుకోవాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- సుబేదారి లోని బాలికల బాలసదనంను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్




**హనుమకొండ, ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి) :** బాలికల భవిష్యత్తు బలంగా ఉండాలంటే విద్యే ప్రధాన ఆధారం అని, బాల సదనంలో ఉన్న ప్రతి విద్యార్థిని మంచి లక్ష్యాలతో కృషి చేస్తూ బాగా చదువుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. బుధవారం హనుమకొండ సుబేదారిలో మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికల బాల సదనాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ నివసిస్తూ వివిధ విద్యాసంస్థల్లో చదువుతున్న బాలికలతో ఆత్మీయంగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, వసతి, ఆహారం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. బాల సదనంలో ఉన్న విద్యార్థినుల సంఖ్య, వారు అభ్యసిస్తున్న కోర్సులు, వంటశాల నిర్వహణ, ఆహార నాణ్యతపై విద్యార్థినులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటగదిని పరిశీలించి, భోజన నాణ్యతను పరీక్షించారు. వేసవి సెలవుల్లో బాలికల హాజరు, దత్తత ప్రక్రియలపై జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ మరియు సూపరింటెండెంట్ కళ్యాణి నుంచి వివరాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల సదనంలోని బాలికల పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, వారికి ఉత్తమ సంరక్షణ, విద్యా అవకాశాలు కల్పించాలని ఆదేశించారు. దత్తతకు సంబంధించిన దరఖాస్తులు వచ్చిన పక్షంలో, బాలికల గార్డియన్ సమ్మతితో పారదర్శకంగా, వేగవంతంగా చర్యలు చేపట్టాలని సూచించారు. బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి, ఉన్నత స్థాయికి చేరుకునేలా కృషి చేయాలని ప్రోత్సహించారు. ఇద్దరు విద్యార్థినులు జనరల్ నర్సింగ్ కోర్సులో ప్రవేశం పొందేందుకు సిద్ధంగా ఉన్నట్లు జిల్లా సంక్షేమ అధికారి వివరించగా, కలెక్టర్ వారికి అభినందించారు.

**పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ :**

సందర్శన సమయంలో లక్ష్మీ ప్రసన్న అనే బాలికకు పుట్టినరోజు కావడంతో, జిల్లా కలెక్టర్ ఆమెకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. స్వయంగా దగ్గరకు తీసుకుని ఆశీర్వదించడం ద్వారా బాలికలో ఆనందం నింపారు. అనంతరం బాలికల కోసం సిద్ధం చేసిన భోజనాన్ని రుచి చూసి, నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే బాల సదనానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి అవసరమైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఎం. కళ్యాణి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఇన్‌చార్జి ఎస్. ప్రవీణ్ కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం. మౌనిక, కౌన్సిలర్లు త్రివేణి, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

## గంటూరుపల్లిలో హెల్మెట్ తప్పనిసరి కార్యక్రమం




### వంద శాతం హెల్మెట్ గ్రామంగా తీర్మానం

**హసన్ పర్తి,ఏప్రిల్ 15(ప్రజాజ్యోతి) :** హసన్ పర్తి మండలం గంటూరుపల్లి గ్రామంలో సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షుడు చల్లా రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాహనదారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ హెల్మెట్ ధరించడం తప్పనిసరి అనే సందేశాన్ని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాజిపేట్ ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి, హసన్ పర్తి సిఐ చేరాలు, ఎస్సై దేవేందర్,పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వర్లు, గ్రామ కార్యదర్శి అనూష హాజరై హెల్మెట్ తప్పనిసరి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చల్లా రాకేష్ రెడ్డి మరియు వారి కుటుంబ సభ్యులు విరాళంగా అందజేసిన వంద హెల్మెట్లను గ్రామ వాహనదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాట్లాడిన ఏసిపి పింగిలి ప్రశాంత్ రెడ్డి, ప్రతి వాహనదారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను రక్షించుకోవాలని సూచించారు. రహదారి భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గంటూరుపల్లి గ్రామాన్ని వంద శాతం హెల్మెట్ వినియోగం కలిగిన ఉత్తమ గ్రామంగా తీర్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ మార్కెట్ ఉపాధ్యక్షుడు తంగళ్లపల్లి తిరుపతి, మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి చాణిక్య రెడ్డి, ఉప సర్పంచ్ పోరెడ్డి వాణి, వార్డు సభ్యులు, నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వినూత్నంగా మొక్కజొన్న కంకులతో ఇంటి నిర్మాణం




- బాయర్ డికాల్బ్ 9217 మరియు 9247 తో అధిక దిగుబడి
- రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల

**హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 15, (ప్రజా జ్యోతి) :** గిర్నిబావి గ్రామంలో బుధవారం నిర్వహించిన మొక్కజొన్న ప్రదర్శన క్షేత్ర సందర్శన కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా కంపెనీ ప్రతినిధులు మొక్కజొన్న కంకులతో ఇంటి ఆకారంలో అద్భుతంగా నిర్మాణం చేసి,తమ సామర్థ్యాన్ని డీలర్లకు ప్రదర్శించారు. ఈ వినూత్న అలంకరణను చూసిన డీలర్లు, రైతులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తూ,ఇటువంటి సృజనాత్మక కార్యక్రమాలు వ్యవసాయంపై ఆసక్తిని పెంచుతాయని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా మొక్కజొన్న కంకులతో నిర్మించిన ఇల్లు అందరినీ ఆకర్షించింది. ఈ సందర్భంగా బాయర్ కంపెనీ ప్రతినిధులు అశోక్ రెడ్డి, విక్రమ్, సతీష్, సాయి కృష్ణ మాట్లాడుతూ బాయర్ డీకాల్బ్ 9217,9247 రకం మొక్కజొన్న పంట యొక్క ముఖ్య లక్షణాలు --- మంచి వేరు వ్యవస్థ, బలమైన కాండం,సమానమైన మరియు నిండుగా ఉండే కంకులు ఉండటం వల్ల అధిక దిగుబడి సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఫెర్టిలైజర్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ అధ్యక్షుడు మరియు తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర రావు మాట్లాడుతూ బలమైన వేరు వ్యవస్థ ఉండడం వల్ల వడగాలులు మరియు అకాల వర్షాలను తట్టుకొని అధిక దిగుబడి సాధ్యమవుతుందని, అధిక దిగుబడి వచ్చేటువంటి రకాలను రైతులు ఆదరించాలని అన్నారు. ఏ డి ఏ దమోదర్ రెడ్డి మాట్లాడుతూ మొక్కజొన్న పంటను గురించి తన విలువైన సమాచారాన్ని ఇచ్చారు. వరంగల్ ఏ .ఓ రవీందర్ రెడ్డి మరియు దుగ్గొండి ఏ .ఓ శ్యామ్ పాల్గొని మొక్కజొన్న హైబ్రిడ్స్ పై విలువైన సమాచారాన్ని రైతులకు, డీలర్లకు అందించారు. కంపెనీ చేపట్టిన ఈ వినూత్న ప్రచార కార్యక్రమాన్ని గత నాలుగు రోజులుగా చుట్టుపక్కల గ్రామాల రైతులు వీక్షిస్తూ హర్షం వ్యక్తం చేస్తూ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అనేక మంది డీలర్లు పాల్గొన్నారు. మొత్తం కార్యక్రమం ఉత్సాహభరితంగా విజయవంతంగా జరిగింది.

## ఏనుగల్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం నిలిచిపోయింది





**– 11 రోజులు గడిచినా ఒక్క బస్తా తరలింపు లేదు..**

**– రైతుల ధర్నా హెచ్చరిక..**

**పర్వతగిరి, ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి) :** పర్వతగిరి మండలం ఏనుగల్ గ్రామంలోని సొసైటీ వద్ద ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభమై 11 రోజులు గడిచినా ఇప్పటి వరకు ఒక్క బస్తా కూడా బయటకు తరలించకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. కేంద్రం వద్ద భారీగా మొక్కజొన్న నిల్వలు పేరుకుపోయి ఉండగా, సరైన రవాణా మరియు గోదాముల సౌకర్యాల లేమి రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. గ్రామంలోని రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి రోజులుగా ఎదురు చూస్తున్నారు. అయితే లారీలు ఏర్పాటు చేయకపోవడం, సమీప గోదాములకు అలాట్మెంట్ ఇవ్వకపోవడం వల్ల కొనుగోలు ప్రక్రియ పూర్తిగా స్థంభించిపోయినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఇటీవల వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో పంట తడిసిపోవచ్చనే భయంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "పంట పండించడానికి కష్టపడ్డాం... ఇప్పుడు అమ్ముకునే సమయంలో ఇలాంటి నిర్లక్ష్యం ఎందుకు?" అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈరోజు నుంచే లారీలు ఏర్పాటు చేసి మొక్కజొన్నను లోడ్ చేసి సమీప గోదాములకు తరలించాలని, ఉమ్మడి ఏనుగల్ గ్రామానికి గోదాముల అలాట్మెంట్ కల్పించాలని కోరుతున్నారు. అధికారులు తక్షణ చర్యలు తీసుకోకపోతే రేపు ఏనుగల్ రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించనున్నట్లు రైతులు హెచ్చరించారు. ఈ అంశంపై అధికారుల స్పందన ఏమిటన్నది చూడాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో మొక్కజొన్న పండించిన వివిధ గ్రామాల రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చదువు భవిష్యత్‌కు మార్గదర్శి

**– జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న**

**– ఘనంగా సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం...**



**హనుమకొండ ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి) :** చదువు భవిష్యత్‌కు మార్గదర్శియే కాక సమాజాన్ని మార్చే శక్తినిస్తుందని జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న అన్నారు. వరంగల్ హంటర్ రోడ్లోని తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠంలో బుధవారం ఎం.ఏ తెలుగు కోర్సు మొదటి బ్యాచ్ చివరి సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో డాక్టర్ వెంకన్న మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కళల పట్ల అవగాహన పెంచుకోవాలని, పోటీ పరీక్షలకు సన్నద్ధం అయి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని సూచించారు. ఎం.ఏ తెలుగు మొదటి సంవత్సరం విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ఆమేర్ ఆలీఖాన్, పీఠం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ బాసాని సురేష్, డాక్టర్ చూరేపల్లి రవి కుమార్, అబ్బు గోపాల్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ డాక్టర్ గంపా సతీష్, బుకేబేరర్ సిద్ధోజు సునంద, గెస్ట్ ఫ్యాకల్టీ డాక్టర్ ఎన్ రాజు, డాక్టర్ సునీత, రవీందర్, సిబ్బంది అంజనేయులు, ఆశోక్, సులోచన, పరిశోధకులు సోనబోయిన సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**– ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎటువంటి లోపాలు లేకుండా నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలి**



**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి) :** జిల్లాలోని దేవరుప్పుల మండల కేంద్రంలో, కొడకండ్ల మండల కేంద్ర పరిధిలో, కొడకండ్ల మండలంలోని మొండ్రాయి గ్రామ పంచాయతీలో కొనసాగుతోన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను బుధవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణాల్లో నాణ్యత, పురోగతి, సౌకర్యాల అమలు వంటి అంశాలను సవివరంగా తనిఖీ చేశారు. ప్రతి ఇల్లు వద్ద గదుల నిర్మాణం, ప్లాస్టరింగ్ పనులు, తలుపులు, కిటికీల అమరిక, విద్యుత్, తదితరాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎటువంటి లోపాలు లేకుండా నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న విధంగా ప్రతి పేద కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించేందుకు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, ఇప్పటివరకు ఎన్ని విడతల్లో డబ్బులు వారి ఖాతాల్లో జమ అయ్యాయో వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి ఎదురవుతున్న సమస్యలు, అవసరాల గురించి ఆరా తీశారు. ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. కొడకండ్ల మండలంలోని మొండ్రాయి గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా మురుగు కాలువలు నిరంతరం శుభ్రంగా ఉంచాలని, దోమల నివారణ కోసం ఫాగింగ్ కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని, చెత్తతో కాలువలు మూసుకుపోకుండా జాగ్రత్త పడాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఈ పరిశీలనలో గృహ నిర్మాణ పీడీ మాతృ నాయక్, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటిద్దాం ప్రాణాలను కాపాడుకుందాం

**– విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించిన ఎస్సై నరేష్ యాదవ్**



**రఘునాథపల్లి,ఏప్రిల్ 15(ప్రజా జ్యోతి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలనలో భాగంగా బుధవారం రఘునాథపల్లి మండల కేంద్రంలోని సెంట్ ఆల్ఫాన్సెస్ పాఠశాల ఆవరణంలో అలైవ్–అరైవ్ కార్యక్రమాన్ని ఎస్సై దుదిమెట్ల నరేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... రోడ్డుపై ప్రయాణించే ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడిపి నడపాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపొద్దని, కారు నడిపేవారు సీట్ బెల్ట్ తప్పకుండా ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల ప్రవేశాలకు దరఖాస్తులు

**తుంగతుర్తి, ఏప్రిల్ 15, (ప్రజా జ్యోతి) :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలైన సీఓఈ, రెగ్యులర్ జూనియర్ కాలేజీల్లో ఇంటర్ లో చేరేందుకు ప్రవేశ పరీక్ష కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు www.rjcet.telangana.gov.in లేదా www.tgswreis.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే 15 న ఉదయం 10 గంటలకు నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## గ్రామీణ పేదల జీవనో పాధికి ఉపాధి హామీ పథకం పనిని సద్విని యోగం చేసుకోవాలి

### - సర్పంచ్ఎడ్ల వెంకట్ రెడ్డి



**భువనగిరి, రూరల్ 15 (ప్రజాజ్యోతి) :** భువనగిరి మండలం,బిఎన్ తిమ్మాపురం,గ్రామంలో మన గ్రామ సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి,2026-2027 కు సంబంధించిన ఆర్థిక సంవత్సరం,100 రోజుల గ్రామీణ ఉపాధి హామి పథకం (కరువు పని) ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న పేద ప్రజలను దృష్టిలో పెట్టుకొని,ఈ 100 రోజుల ఉపాధి హామీ పథకం గొప్ప పథకం అని,దీనిని అందరూ సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని ఎండాకాలం సందర్భంగా తగిన ఆరోగ్యజాగ్రత్తలు తీసుకుని ఉపాధి పొందాలని కోరారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ సుధాకర్ కు సూచిస్తూ,ఎండాకాలం దృష్ట్యా ఉపాధి కార్మికులకు మంచి నీటి సదుపాయం,నీడ గొడుగులు,ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందించి వారికి తగిన సదుపాయాలు కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు దొంకేన పాండురంగం,పిన్నెం పాండు మాజి ఉప సర్పంచ్ ఎడ్ల దర్శన్ రెడ్డి,ఎడ్ల ప్రతాప్ రెడ్డి,దొంకేన అశోక్ గ్రామస్థులు ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు

## భీమా జీవితానికి ధీమా

### భువనగిరి ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ : ఆర్ బలరాం



**భువనగిరి,ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి) :** భువనగిరి భారతీయ జీవిత భీమా సంస్థ ఎల్ఐసి కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్ ఆర్, బలరాం, ఆధ్వర్యంలో, 2026-2027 నూతన,ఆర్థిక సంవత్సరం పూజా కార్యక్రమంఉద్యో గులు ఏజెంట్ల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ ఆర్, బలరాం, మాట్లాడుతూ భారత దేశ ఆర్థిక వ్యవస్థకు భారతీయ జీవిత భీమా సంస్థ ఎల్ఐసి వెన్ను, ముకగా నిలుస్తున్న,సందర్భంగా ఎల్ఐసి సంస్థలో పని చేస్తున్న మనం అందరం ఎంతో గర్వించదగ్గ గొప్ప విషయం అని అన్నారు.గత సంవత్సరం,ఏజెంట్లు,స్టాఫ్ అందరి సహకారంతో మన బ్రాంచ్ టార్గెట్ ను విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని ప్రతి ఒక్కరికి నా హృదయపూర్వక ధన్యవాదాలని అన్నారు. మరియు ప్రతి ఒక్కరు జీవిత భీమా తీసుకోవాలని ఆపద కాలంలో కుటుంబానికి ఆర్థిక రక్షణగా ఉంటుందని అన్నారు.ఈ నూతన ఆర్థిక సంవత్సరంలో ఆ యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆశీర్వాదాలతో ఏజెంట్లు అందరూ మంచి వ్యాపారం చేయాలని సికింద్రాబాద్ డివిజన్ స్థాయిలో, భువనగిరి బ్రాంచ్ ను మొదటి స్థానంలో నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ నాగేశ్వర్ రావ్, ఎల్ఐసి ఉద్యోగులు, ఎల్ఐసి ఏజెంట్స్,సబ్ స్టాఫ్ పాలసీదారులు తదితరులు పాల్గొన్నారు.

## హిందూ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ



**మర్రిగూడ, ఏప్రిల్ 15(ప్రజాజ్యోతి) :** మర్రిగూడ మండల కేంద్రంలో ఏప్రిల్ 21 న సాయంత్రం 4 గంటల 30 నిముషాలకు జరిగే హిందూ మహాసమ్మేళనం పోస్టర్ గ్రామ సర్పంచ్ శిరీష లోకేష్ గౌడ్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమం ఉద్దేశించి గౌరవ అధ్యక్షులు లోక వెంకట్ సాయినాథ్ శర్మ మాట్లాడారు.హిందూ సనాతన ధర్మంని కాపాడాలని హిందువులంతా ఐక్యంతో ఉండి మాతృభూమి దేవాలయాల్లో జరుగుతున్న దాడులను అరికట్టాలని ఊర్లలో గుడి బాగుంటేనే ఊరు బాగుంటుందని హైందవ ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్క హిందువు పై ఉందని హిందువులంతా కలిసి ఈనెల 21న జరగబోయే హిందూ మహాసమ్మేళనకు హాజరు కావాలని గడపలోనే కులం గడప దాటితే హిందువులనే నినాదంతో ముందుకు సాగి మండలంలోని ప్రతి గడప నుండి హిందువులు ఈ సమ్మేళనానికి రావాలని ఇది ఆహ్వానంగా స్వీకరించి ప్రతి ఒక్కరూ కార్యక్రమం విజయవంతం చేస్తారని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గుమ్మకొండ విఠల్ రెడ్డి, విజయ రామారావు, నల్ల యాదయ్య, మాస చంద్రశేఖర్,కోలుకులపల్లి యాదయ్య,పగడాల లింగయ్య, పగడాల రఘు,పందుల రాములు,రాజేందర్ నాయక్, రఘురాములు,చెరుకు శ్రీరామ్, గ్యార గోపాల్ పనగంటి రవి హిందూ సమ్మేళ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కోదాడ ఎమ్మార్వో కార్యాలయంలో అవినీతి బాగోతం

- నిబంధనలకు వ్యతిరేకంగా భూమి బదలాయింపు
- తనకు అధికారులు అన్యాయం చేశారని బాధితుడు జహీర్ అహ్మద్ ఆవేదన
- గతంలో కోదాడ ఎమ్మార్వో కార్యాలయంలో ధరణి ఆపరేటర్ గా పనిచేసి టర్మినేట్ అయిన ఓ ఉద్యోగి ఈ దందలో కీలకపాత్ర అని బాధితుల ఆరోపణ





**కోదాడ టౌన్, ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి) :** కోదాడ మండలం ద్వారకుంట రెవెన్యూ పరిధిలోని 134 సర్వే నెంబర్ లో గల ఐదు ఎకరాల రెండు గుంటల భూమిని నిబంధనలకు వ్యతిరేకంగా రెవెన్యూ అధికారులు కోదాడకు చెందిన జలీల్ నాయక్ పేరు పైకి మార్చారని బాధితుడు జహీర్ అహ్మద్ బుధవారం కోదాడ ఆర్టీవో కార్యాలయం ముందు అర్ధ నగ్న ప్రదర్శనతో నిరసన తెలిపి విలేకరుల సమావేశంలో రోధిస్తూ వెల్లడించారు. తన తల్లి అహ్మద్ ఉన్నిసా బేగం పేరా ఈ భూమి ఉందని గత ఏడాది జులైలో సెల్ కం జిపిఏ డాక్యుమెంటు తో ఈ భూమిని నాలా కన్వర్షన్ మూటేషన్ చేశారని వాపోయాడు. ఎమ్మార్వో కార్యాలయంలో పనిచేసే టర్మినేట్ అయిన ధరణి ఆపరేటర్ వెంకయ్య, ఈ దందాలో కీలక వ్యక్తి అని ఆరోపించారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన మైనార్టీ సీనియర్ నాయకుడు ఒకరు ఎమ్మార్వో పైకి ఒత్తిడి తీసుకువచ్చి వీరికి సహకరించారని తెలిపారు. ఇట్టి భూమి పంచనామా సైతం అర్ ఐ జగదీష్ భూమి వద్దకు వెళ్లి ప్రక్కన రైతులతో కాకుండా వారికి అనుకూలమైన వ్యక్తులతో సాక్షిగా సంతకాలు చేయించి పంచనమా చేశారని క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా ముడుపులు తీసుకొని రిపోర్టు ఇచ్చారని ఆరోపించారు. ఇదే విషయమై తనకు న్యాయం జరగాలని లోకాయుక్తను ఆశ్రయించానని బాధితులు వాపోయాడు. స్థానిక ఎమ్మార్వో వాజీద్ అలీ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించి భూమిని తమకు కాకుండా చేశాడని ఇప్పటికైనా పై అధికారులు స్పందించి తమకు న్యాయపరంగా చెందల్సిన భూమిని అప్పగించి అక్రమంగా భూమిపై హక్కులు కల్పించిన ఎమ్మార్వో, ఆర్ ఐ పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తన తల్లి 2010లో మృతి చెందినదని కాగా 2006లో జిపిఏ చేసిందని తెలిపారు. చనిపోయిన తర్వాత 2025 జూలైలో అధికారులు జిపిఏతో అన్యాయంగా ముటేషన్ చేశారని తెలిపారు. వ్యక్తి చనిపోయిన తర్వాత జిపిఏ చెల్లదని అధికారులకు తెలిసిన ముడుపులతో చేశారని ఆరోపించారు.

## కారులో చిక్కుకొని ఊపిరాడక చిన్నారి మృతి

### - పరామర్శించిన సర్పంచ్ జేరిపోతుల భరత్ గౌడ్



**నార్కట్ పల్లి, ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి) :** కారులో చిక్కుకొని ఓ చిన్నారి మృతి చెందిన హృదయ విచారక సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్ పల్లి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నార్కట్పల్లి లోని బీసీ కాలనీకి చెందిన పేర్న సతీష్ గాయత్రి దంపతులకు శరణ్య (5), భాను సంతానం చిన్నారి తాత నాన్నమ్మలు 30 లకు గతం నార్కట్పల్లి కి వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. సతీష్ కొంతకాలంగా స్థానికంగా లేడీస్ హాస్టల్ నడుపుతున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం ఉదయం హైదరాబాదులోని ఆస్పత్రికి వెళ్లారు. తాత నాయనమ్మ అన్న ఇంట్లోనే ఉన్నారు. చిన్నారిప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతి చదువుతోంది. సెలవు రోజు కావడంతో ఇంటి ఎదురుగా ఉన్న కార్లో ఆడుకోవడానికి వెళ్ళింది. ఆ కారుకు మూడు వైపులా లాకులు ఉన్నాయి. డ్రైవర్ పక్కన ఉన్న డోర్ కి కొంత కాలంగా లాక్ పడలేదు. దీని ద్వారా కారు లోపలికి వెళ్ళిన చిన్నారి వెనుక సీటులో కూర్చుని ఆడుకుంటుంది. తరువాత కారు డోర్ తీయడం రాక అపస్మరక స్థితిలోకి జారుకుంది. ఉదయం నుంచి కుటుంబ సభ్యులు వెతికిన చిన్నారి ఆచూకి లభించలేదు. కారు వద్ద చిన్నారి చెప్పులు ఉండడంతో కారు యజమాని వెళ్లి చూడగా అపస్మార్క స్థితిలో కనిపించింది. కుటుంబ సభ్యులు నార్కట్పల్లి శివారులోని కామినేని ఆసుపత్రికి తరలించగా అప్పటికే వైద్యులు నిర్ధారించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని శవ పరీక్ష నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి దర్యాప్తు ప్రారంభించినట్లుఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన సర్పంచ్ జేరిపోతుల భరత్ గౌడ్. నార్కట్పల్లి బీసీ కాలనీలో ఆడుకుంటూ ఇంటి ముందున్న కారులోకి వెళ్లి నా చిన్నారి చరణ్య (5) ఊపిరాడక స్పృహ కోల్పోయింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కార్ డోర్ ని తెరచి ఆసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే పాపం మృతి చెందినట్లునిర్ధారించారు. ఈ విషాద ఘటనపై స్పందించిన సర్పంచ్ జేరిపోతుల భరత్ గౌడ్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

## బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎండి నాజీమ్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రముఖ న్యాయవాది సామరాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు





**భువనగిరి, ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి) :** యాదాద్రి, భువనగిరి జిల్లా ప్రముఖ, న్యాయవాది కోర్టు గ్రంధాల యం కార్యదర్శి,సామ రాజేందర్,రెడ్డి జన్మదిన వేడుకలను స్థానిక జలీల్ పురాలో, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎండీ నాజీమ్ ఆధ్వర్యంలో వార్డు, ప్రజల శ్రేయోభిలాషుల మధ్యన, బాణా సంచా,కాల్చి శాలువాతో, సత్కరించి కేక్ కట్ చేసి ఘనంగా జన్మ దిన వేడుకలను నిర్వహించడం జరిగింది. అనంతరం చిన్నారులకు మిల్క్ శేక్ జ్యూస్ డబ్బాలను పంపిణి చేయడం జరిగింది.ఈ సందర్భంగా యువ నాయ కులు నాజీమ్ మాట్లాడుతూ,అన్న అంటే నేనున్నానని ఆపదలో ఆదుకునే,మంచి మనసున్న నాయకులు, ప్రముఖ న్యాయవాది మోటివేటర్ ఎంతో,మంది యువకులను రాజకీయం లో లీడర్లను తయారు చేసారని అదే విధంగా, న్యాయవాద వృత్తి లో తన వాక్చాతుర్యంతో తన వద్ద కు, వచ్చే కక్షిదారుల కేసులను గెలిపించి వారి జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. లాయర్ అంటేనే అమ్మో ఎన్ని డబ్బులు తీసుకుంటాడో ఎన్ని వేల లక్షల, రూపా యలు ఖర్చు అవుతాయో అని భయపడే వారికి నిరు, పేద ప్రజలకు ఉచితంగా న్యాయం అందిస్తారని తెలి పారు. ఎల్లప్పుడూ పేద ప్రజలకు అండగా ఉండే ఇటువంటి న్యాయవాది సామరాజేందర్ రెడ్డి ఆయురా రోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో సుఖ సంతోషాలతో సదా, వర్ధిల్లాలని ఇటువంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మనసారా ఆకాం క్షించారు. ఈ జన్మ దిన వేడుకల్లో, మైనారిటీ జర్నలిస్ట్ ఫెడరేషన్ వ్యవస్థా పక రాష్ట్ర అధ్యక్షులు ఎండీ ఇంతి యాజ్ అహ్మద్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎండీ ఇస్తి యాక్ అహ్మద్,మాజీ కౌన్సిలర్ నాజిమా సలావొద్దీన్ అజీజ్, కబీర్, అద్నాన్, సల్మాన్ జీషాన్ మొయిద్ ఖలీల్ ముస్తఫా అస్లాం అహె మద్ ఫుర్ఖాన్ సోహెల్, తయ్యబ్, సత్తార్ తయ్యబ్, తైమూర్, జైద్ అసద్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా ప్రముఖ న్యాయవాది సామరాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు





**భువనగిరి,ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి) :** యాదాద్రి, భువనగిరి జిల్లా ప్రముఖ, న్యాయవాది కోర్టు గ్రంధాల యం కార్యదర్శి, సామ రాజేందర్,రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. జన్మదిన వేడుకల్లో మున్సిపాలిటీ మాజీ చైర్మన్ ప్రస్తుత వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల ముఖ్య అతిధులుగా హాజర య్యారు. ఈ సందర్భంగాబాణా సంచా కాల్చి శాలు వాతో, సత్కరించి కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా, ఎంజేఎఫ్ మైనారిటీ జర్నలిస్ట్ ఫెడరేషన్ వ్యవస్థాపకులు రాష్ట్ర అధ్యక్షులు ఎండీ ఇంతియాజ్ మాట్లాడుతూ,అన్న అంటే నేనున్నానని ఆపదలో ఆదుకునే, మంచి మన సున్న నాయకులు, ప్రముఖ న్యాయవాది మోటివేటర్ ఎంతో, మంది యువకులను రాజకీయంలో లీడర్లను తయారు చేసారని అదే విధంగా, న్యాయవాద వృత్తిలో తన వాక్చాతుర్యంతో తన వద్దకు, వచ్చే కక్షిదారుల కేసులను, న్యాయమూర్తులతో వాదించి వారిని గెలిపించి వారి జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు.లాయర్ అంటేనే అమ్మో ఎన్ని డబ్బులు తీసుకుంటాడో ఎన్ని వేల లక్షల, రూపాయలు ఖర్చు అవుతాయో అని భయపడే వారికి నిరు,పేద ప్రజలకు ఉచితంగా న్యాయం అందిస్తా రని తెలిపారు. ఇటువంటి న్యాయవాది యాదాద్రి జిల్లాలో ఉండడం గర్వకారణమని అన్నారు. ఎల్లప్పుడూ పేద ప్రజలకు అండగా ఉండే ఇటువంటి న్యాయవాది సామరాజేందర్ రెడ్డి ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యా లతో సుఖ సంతోషాలతో సదా, వర్ధిల్లాలని ఇటువంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మన సారా ఆకాంక్షించారు. ఈ జన్మదిన వేడుకల్లో, మైనారిటీ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ ఇస్తియాక్ శ్రీయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి







- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్
- నార్కట్ పల్లి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ

**నల్గొండ ఏప్రిల్ 15(ప్రజా జ్యోతి ప్రతినిధి):** బుధవారం ఆయన నార్కట్ పల్లి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న కొనుగోలు ప్రక్రియను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపాలని, లారీలను ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

ఎక్కడైనా మిల్లుల సామర్థ్యం సరిపోకపోతే అదనపు మిల్లులను ఏర్పాటు చేసి కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అంతరాయం రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ అధికారి సర్టిఫికెట్ ఇచ్చే వరకు లోడింగ్ సక్రమంగా నిర్వహించాలని తెలిపారు.

రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ వరి పంట పరిస్థితులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. తెగుళ్ల గురించి ప్రశ్నించగా, ఒక రైతు పంటపై పురుగుమందులు పిచికారీ చేసినప్పటికీ చివరి దశలో దోమ కాటు కారణంగా నష్టం వాటిల్లిందని వివరించారు. మరో రైతు నాలుగు ఎకరాలు కౌలు తీసుకుని, రెండు ఎకరాలు స్వంతంగా కలిపి మొత్తం ఆరు ఎకరాల్లో వరి సాగు చేశానని తెలిపారు.

అనంతరం మండలంలోని జివ్విగూడెం గ్రామంలో ఉన్న శివ సాయి వినాయక రైస్ మిల్లును కలెక్టర్ తనిఖీ చేశారు. మిల్లులో ధాన్యం, గన్నీ బ్యాగుల నిల్వ గదులు, బియ్యం నాణ్యతను పరిశీలించారు. ఇప్పటి వరకు 10 లారీల ధాన్యాన్ని దిగుమతి చేసుకున్నామని మిల్ యజమాని రవీందర్ రెడ్డి కలెక్టర్ కు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం వేగవంతంగా అన్ లోడ్ చేసుకోవాలని, ప్రతి దశలో పారదర్శకత పాటించాలని ఆదేశించారు. తహసిల్దార్ ఎల్. వెంకటేశ్వరరావు, పౌరసరఫరాల డీటీ దీపక్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ తరుణ్ , మిల్లుయజమాని రవీందర్ రెడ్డి, అనిత రవీందర్ రెడ్డి, రైతులు ఉన్నారు.

## తెలంగాణ మోడల్ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు స్థల పరిశీలన

- జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, స్థానిక శాసనసభ్యులు బాలు నాయక్
- గ్రామీణ ప్రాంతాల్లో విద్యా ప్రమాణాల మెరుగుకు తెలంగాణ మోడల్ స్కూళ్లు - జిల్లా కలెక్టర్.బి చంద్రశేఖర్








**నల్గొండ ఏప్రిల్ 15(ప్రజా జ్యోతి ప్రతినిధి):** బుధవారం జిల్లా కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యే బాలు నాయక్ తో కలిసి దేవరకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి తెలంగాణ మోడల్ పబ్లిక్ స్కూల్ నిర్మాణం కోసం ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. ప్రీ-ప్రైమరీ నుండి 12వ తరగతి వరకు విద్యను అందించే విధంగా ఆధునిక సదుపాయాలతో తెలంగాణ మోడల్ స్కూల్ లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఉన్నత పాఠశాల లే-అవుట్ ప్రకారం తెలంగాణ మోడల్ స్కూల్ ఏర్పాటుకు స్థలం అనుకూలంగా ఉందని కలెక్టర్ అన్నారు.ఈ మోడల్ స్కూల్ నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు ఒకే చోట ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్య అందుబాటులో ఉంటుందని చెప్పారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని డైనింగ్ హాల్, కిచెన్, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్, తరగతి గదులు, మూత్రశాలలు (టాయిలెట్లు), బాత్రూములు, విశాలమైన ఆట స్థలం వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

అలాగే విద్యార్థుల రవాణా కోసం బస్సుల సదుపాయం కల్పించబడుతుందని, నియోజకవర్గంలోని విద్యార్థులు ఈ సౌకర్యాలను వినియోగించుకోవచ్చని చెప్పారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్, ఆర్డీఓ రమణారెడ్డి, తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో పార్వతి, పాఠశాల ప్రిన్సిపల్ నరసింహారెడ్డి, అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

### పవిత్ర మక్కా యాత్రకు వెళుతున్న యాత్రికులకు

## జలీల్ పుర మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం



**భువనగిరి, ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి) :** భువనగిరి పట్టణంలోని స్థానిక జలీల్ పుర మజీద్ కమిటీ, ఆధ్వర్యంలో పవిత్ర మక్కాయాత్రకు వెళుతున్న యాత్రికులను ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా మజీద్ కమిటీ అధ్యక్షుడు,ఇక్బాల్ చౌదరి మాట్లాడుతూ మక్కా యాత్రకు వెళుతున్న యాత్రికులకు వారు చేసే ప్రార్థనలో,ఎలాంటి పొర పాటులు మరియు అవకత వకలు జరగకుండా ఉండ టానికి,వారికి శిక్షణ ఇవ్వడం జరిగిందని, ఈ సందర్భంగా అన్నారు. యాత్రికులు మా ప్రార్థనలో దేశం యొక్క సమైక్యత అభివృద్ధి మరియు శాంతి నెలకొల్పాలని,అల్లాతో ప్రార్థన చేయాలని వారు ఈ సందర్భంగా అన్నారు. అనంతరం యాత్రికులను శాలువా, పూల దండతో ఘనంగా సన్మా నించడం జరిగింది. ఈ కార్య క్రమంలో మజీద్ కమిటీ సభ్యులు,ముస్తాఫ్ చౌదరి, అత ఉర్ రహమాన్ షకీల్ ముస్తఫా ఖాదిరి కాజమ్ అహ్మద్,షేక్ మీరా చౌదరి, సాదేఖ్ అలీ ఇక్బాల్ అహ్మద్, రహీంఉద్దీన్ మోహి ఉద్దీన్ ఆదిల్ సుజావుద్దీన్,ఇసాఖ్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులకు పిల్లల ఉత్తరాలు

కమ్మర్‌పల్లిలో వినూత్నంగా రోడ్డు భద్రతా అవగాహన





**కమ్మర్‌పల్లి ( ప్రజాజ్యోతి ) ఏప్రిల్ 15:** మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో రోడ్డు భద్రతపై బుధవారం విద్యార్థులు చేపట్టిన వినూత్న ప్రచారం అందరినీ ఆకట్టుకుంది. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక 'అరైవ్ అలైవ్ క్యాంపెయిన్-2026' లో భాగంగా, కమ్మర్‌పల్లి పోలీసుల ఆధ్వర్యంలో 'చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ డే'ను ఘనంగా నిర్వహించారు. మండలంలోని కమ్మర్‌పల్లి, చౌట్‌పల్లి, ఉప్లూర్, హాసాకొత్తూర్, కోనసముందర్, కోనాపూర్ మరియు బషీరాబాద్ గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల (గ్రాను) విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. భావోద్వేగంగా సాగిన పోస్ట్ కార్డుల కార్యక్రమంఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పోస్ట్ కార్డులు రాసే వినూత్న ప్రక్రియను పోలీసులు చేపట్టారు. "నాన్న, నా కోసం.. అమ్మ కోసం హెల్మెట్ పెట్టుకోండి", "మద్యం సేవించి వాహనం నడపకండి", "ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ క్షేమంగా ఇంటికి రండి" అంటూ పిల్లలు రాసిన సందేశాలు పెద్దల మనసులను కదిలించాయి. నిబంధనలను కేవలం చట్టంలా కాకుండా, బాధ్యతగా గుర్తుచేయడానికే పిల్లలతో ఈ ఉత్తరాలు రాయించినట్లు పోలీసులు తెలిపారు.

**రోడ్డు నిబంధనలపై అవగాహన**

అనంతరం పోలీసులు విద్యార్థులకు రోడ్డు భద్రతపై కీలక సూచనలు చేశారు. రోడ్డు దాటేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు సీటు బెల్ట్, హెల్మెట్ ప్రాధాన్యత గురించి డెమో ద్వారా వివరించారు. ముఖ్యంగా మైనర్ డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమని, పాఠశాలల వద్ద అతివేగంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల ప్రజలందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రమాద రహిత సమాజానికి సహకరించాలని ఈ సందర్భంగా పోలీసులు కోరారు. విద్యార్థులు చేసిన ఈ వినూత్న ప్రయత్నం మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

## స్టేషన్ తాండ గ్రామపంచాయతీ

# పరిధిలో కొనుగోలు కేంద్రం ప్రారంభం







**ఇంగల్వాయి. ( ప్రజా జ్యోతి న్యూస్ ) ఏప్రిల్. 15** ఇందల్వాయి మండలంలోని నల్లవెల్లి స్టేషన్ తండా గ్రామపంచాయతీ పరిధిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ భారతి జగత్ సింగ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నల్లవెల్లి సర్పంచ్ కన్య రాజేందర్, ఏఎంసి చైర్మన్ రాజు రంగారెడ్డి, రాజేందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ భారతి జగత్ సింగ్ మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరలు అందించేందుకు ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఏ గ్రేడ్ వరికి క్వింటాల్‌కు రూ. 2389, బి గ్రేడ్ వరికి రూ. 2369 చెల్లిస్తూ కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని, తమ శ్రమతో పండించిన పంటను నేరుగా కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుని లాభపడాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నల్లవెల్లి సర్పంచ్ కన్య రాజేందర్ పి డి సి సభ్యులు గంగారెడ్డి. రాజేందర్ తిరుపతి. పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, ఉపసర్పంచ్ శ్రీనివాస్ నాయక్ గ్రామ శాఖ అధ్యక్షురాలు లక్ష్మి శ్రావణి. వివో ఏలు మమత సౌమ్య సీసీ రుణేంద్ర ఏపిఎం సునీత ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గర్గుల్ విద్యార్థిని కలిగోట వీణను

# అభినందించిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 15. (ప్రజాజ్యోతి)** కామారెడ్డి జిల్లా గర్గుల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని కలిగోట వీణ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తూ గర్వకారణంగా నిలిచింది. ఇటీవల రాంచీ, రాజగిర్‌లో నిర్వహించిన సబ్ జూనియర్ నేషనల్ హాకీ చాంపియన్‌షిప్‌లలో ఆమె అద్భుత ప్రదర్శనతో భారత జట్టుకు ఎంపికైంది. ఈ ఇండియన్ టీం క్యాంప్ ఏప్రిల్ 19 నుండి భోపాల్‌లోని సాయి సెంటర్‌లో నిర్వహించబడనుంది. ఇక్కడి నుంచే జపాన్‌లో జరగనున్న సబ్ జూనియర్ (యు-18) ఆసియా కప్‌కు భారత జట్టు కు ప్రాతినిధ్యం వహించనుంది. అండర్ 18 ఇండియన్ టీం కి సెలెక్ట్ అయిన కలిగొట వీణ ను కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం తన చాంబర్ లో అభినందించి, శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమం లో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ రాజు, ఫిజికల్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి పాల్గొనడం జరిగింది.

## ఎస్ఐ వీకే

# రాములుకు ఘన సన్మానం

మియాపురం శశికాంత్



**బాన్సువాడ ఆర్‌సి ఎప్రిల్ 15 ప్రజా జ్యోతి** బీర్కూర్ మండల కేంద్రంలో కిష్టపూర్ గ్రామ సర్పంచ్ బాన్సువాడ మానేవ్వ గాంగొండ బీర్కూర్ కాంగ్రెస్ నాయకులు శేశి కాంత్ ఎస్సైరాములుకు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంద గంగాధర్, శీను పటేల్, మాజీ ఎంపీటీసీ అంజయ్య, శ్రీను, మాజీ సర్పంచ్ బాన్సువాడ సాయిలు , మాజీ సింగల్ విండో చైర్మన్ రాధాకృష్ణ, గ్రామస్తులుపాల్గొన్నారు.

# జీకే తండాలో ఐకెపి ప్యాడి

# సెంటర్ ప్రారంభించిన గ్రామ సర్పంచ్





**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ). 15** ఇందల్వాయి మండలంలోని జీకే తండా గ్రామపంచాయతీ పరిధిలో ఐకేపీ ప్యాడి కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ శిరీష మైపాల్ ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం సునీత, ఉపసర్పంచ్ రజిత సుధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ శిరీష మైపాల్ మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఐకేపీ ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తోందని తెలిపారు. ఏ గ్రేడ్ వడ్లకు క్వింటాల్‌కు రూ. 2389, బి గ్రేడ్ వడ్లకు రూ. 2369 చెల్లిస్తూ రైతులకు లాభదాయకంగా కొనుగోలు చేస్తున్నామని వివరించారు. రైతులు మధ్యవర్తులపై (దళారులు) ఆధారపడకుండా నేరుగా ఐకేపీ కొనుగోలు కేంద్రాలకు తమ ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పీరు ఆకాష్ రాజేష్ సాయిరాం గంగారం నాయక్ వినోద్ నాయక్ అనిల్ నాయక్ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ హాకీకి

# ఎంపికైన గర్గుల్ గ్రామ యువ క్రీడాకారిణి

- కాలిగోట వీణకు ఘన సత్కారం - ఆర్థిక సహాయం అందజేత



**కామారెడ్డి రూరల్ 15 ఏప్రిల్ ప్రజాజ్యోతి** కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామానికి చెందిన ప్రతిభావంతురాలైన యువ క్రీడాకారిణి కాలిగోట వీణ ఇంటర్నేషనల్ స్థాయిలో హాకీ ఆడేందుకు ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. చిన్న గ్రామం నుండి అంతర్జాతీయ వేదికపై తన ప్రతిభను చాటుకునే అవకాశాన్ని సాధించడం ఆమె కృషి, పట్టుదల, ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా వీణకు అవసరమైన ప్రయాణ, కిట్ మరియు ఇతర ఖర్చుల నిమిత్తం గర్గుల్ గ్రామ సర్పంచ్ చింతాల దివ్య రవి తేజ గౌడ్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రూ. 5,000 నగదు సహాయం అందజేశారు. గ్రామ అభివృద్ధి పట్లనే కాకుండా యువతలో ప్రతిభను ప్రోత్సహించడంలో కూడా తాము ఎల్లప్పుడూ ముందుంటామని ఆయన తెలిపారు. అదేవిధంగా వీణ చదువుతున్న పాఠశాల సిబ్బంది కూడా ఆమె ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తూ రూ. 10,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ, వీణ లాంటి విద్యార్థులు మరెంతో మందికి ఆదర్శంగా నిలుస్తారని, ఆమె అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని వీణకు అభినందనలు తెలిపారు. ఆమె భవిష్యత్తులో దేశానికి, రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వాదాలు అందించారు. గ్రామ స్థాయిలో ఇలాంటి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా గ్రామ యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, యువత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రాజంపేటలో మండల స్థాయి సభ నేడు

**రాజంపేట ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి)** రాజంపేట మండల అభివృద్ధి అధికారి బాలకృష్ణ, పది రోజులపాటు సెలవులో ఉన్నారు. ఈ నేపథ్యంలో మండల ప్రణాళికాధికారి ఎం.డి. జాబర్ ఇమాదుద్దీన్ అహ్మద్ గారిని తాత్కాలికంగా మండల అభివృద్ధి అధికారిగా నియమించారు. ఈ క్రమంలో నేడు ఉదయం 10 గంటలకు రాజంపేటలోని రైతు వేదిక సమీపంలోని శ్రీ లక్ష్మీ నరసింహ ఉద్యానవనంలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై మండల స్థాయి సభ నిర్వహించనున్నారు. ఈ సభకు గ్రామ సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, పత్రికా ప్రతినిధులు హాజరుకావలసిందిగా అధికారులు కోరారు.

## వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన

# మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెం నర్సయ్య



**కమ్మర్‌పల్లి ( ప్రజాజ్యోతి ) ఏప్రిల్ -15 :** రైతులు తాము పండించిన ప్రతి గింజను ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు విక్రయించుకోవాలనే ఉద్దేశంతో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ఇనాయత్ నగర్, అమిర్ నగర్, కోనాపూర్ గ్రామాలలో బుధవారం మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెం నర్సయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, దళారులను ఆశ్రయించి నష్టపోకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సంకేట రవి, ఐకేపీ ఏపీఎం కిరణ్ కుమార్ పాల్గొన్నారు. అలాగే స్థానిక సర్పంచ్‌లు అరుణ్ రెడ్డి, సంతోష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిన్నారెడ్డి తమ సంఘీభావాన్ని తెలిపారు. ఐకేపీ సిబ్బంది ఏడేల్లి రవి, భాగ్యలక్ష్మి, పిర్య నాయక్ మరియు స్థానిక రైతులు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అక్రమ పిడిఎస్ రైస్ పట్టివేత







**రామారెడ్డి ఫిబ్రవరి 15 (ప్రజా జ్యోతి)** రామారెడ్డి మండల కేంద్రంలోని జగదాంబ తండా చౌరస్తా పరిధిలో బుధవారం ఉదయం వెహికల్ చెకింగ్ చేస్తుండగా మాచారెడ్డి మండల కి చెందిన జూలూరి శ్రీ చరణ్, దుద్దెల రమేష్ లు ఇద్దరూ మారుతీ 800 రెండు వాహనాలను అక్రమ పిడిఎస్ రైస్ తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేయడం జరిగిందని స్థానిక ఎస్సై పి. రాజశేఖర్ తెలిపారు.

## కళాశాలకు సౌకర్యాలు

# అనుకూలం ఫలితాలు నామమాత్రం?



**రామారెడ్డి ఫిబ్రవరి 15 (ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాలలో రామారెడ్డి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెరిట్ విద్య అంతా అంతే..? సకల సౌకర్యాలతో కూడిన ఈ యొక్క కళాశాలలో ఒకప్పుడు రాష్ట్రస్థాయిలో అవార్డు అందుకున్న కళాశాల, ఈ సంవత్సరం విడుదలైన ఫలితాలలో విఫలమనే చెప్పవచ్చు..? విశాలమైన వాతావరణం, విద్యార్థులకు సరిపోయిన గదులు, అన్ని సక్కల సౌకర్యాలు కలిగి ఉన్న, రిజల్ట్ మాత్రం శూన్యం, ఈ యొక్క కళాశాలకు 11 మంది అధ్యాపకులు ప్రస్తుతం ఉన్నప్పటికీ మెరిట్ మాత్రం నామ మాత్రం, మొత్తం అవేరేజ్ గా 40% కూడా రాని ఫలితాలు,

**ఎందుకు ఈ విద్యార్థులకు అవస్థలు..!**

ఈ కళాశాలలో చదివితే కచ్చితంగా పాస్ అవుతాం విద్య, మంచి నైపుణ్యం నేర్చుకుంటాం మంచి విద్యను అభ్యసిస్తాం అలాంటి నమ్మకంతో ఈ యొక్క కళాశాలలో జాయిన్ అయినా విద్యార్థులకు ఎందుకు ఈ ఈ నిరాశ .. వాస్తవానికి కళాశాలలో 11 మంది అధ్యాపక బృందం విద్యను అందిస్తున్నారు. ఒక వెకెంట్ ఖాళీ, మరో వేకేంట్ ఎకనామిక్స్ అధ్యాపక పోస్ట్ ఖాళీ ఉంది. అయినా కూడా ఈ యొక్క కళాశాలలో ఈ సంవత్సరం ఫలితాలు మాత్రం నిరాశకు గురిచేస్తున్నాయి. ఈ యొక్క కళాశాలకు చుట్టుపక్కల సుమారు 10 గ్రామాల విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించడానికి వస్తూ ఉంటారు.

**లోపం ఎక్కడ..?**

వాస్తవంగా ఈ యొక్క కళాశాలలో సెకండ్ ఇయర్ విద్యను అభ్యసిస్తున్న 36 మంది విద్యార్థులకు గాను 14 మంది మాత్రమే పాసయ్యారు సుమారు 38.98 పర్సంటేజ్, అదేవిధంగా మొదటి సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న 62 మంది విద్యార్థులకు గాను 12 మంది విద్యార్థులు పాసయ్యారు అంటే సుమారు 19.36% యావరేజ్ గా సుమారు ఈ యొక్క కళాశాలకు 40% కూడా మెరిట్ దాటలేదు కళాశాలకు ఇంత మంది సిబ్బంది ఉండి కూడా మెరిట్ రాకపోవడానికి గల కారణాలేంటి. అధికారుల పర్యవేక్షణ లోపమా లేక సరైన విద్యను అందించకపోవడం అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ సంవత్సరంకుగాను మెరిట్ విద్యార్థులు ఈ. మానస బైపిసి సెకండియర్ తెలుగు మీడియం 844 మార్కులతో కాలేజ్ స్టాపర్ గా నిలిచారు. అదేవిధంగా బైపిసి కె. రాఘవి సెకండ్ ఇయర్ 798 మార్కులు సాధించారు, డి. నాగచైతన్య ఎంపీసీ ఫస్టియర్ ఇంగ్లీష్ మీడియం 403 మార్కులు సాధించారు. ఈ విద్యార్థుల మార్కులు మాత్రమే ఈ అధ్యాపకులకు సంతోషం..? మిగతా విద్యార్థుల సంగతి ఏమిటి? వాళ్ళు చదవకపోవడానికి గల కారణం బోధన సరిగా లేకపోవడమా..? లేక ప్రభుత్వం అన్ని విధాలుగా అన్ని రకాల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అదేవిధంగా కళాశాలకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అనేక రకాల సహకారాలు అందిస్తున్నప్పటికీ ఈ యొక్క ఫలితాల పై విద్యార్థులు అదేవిధంగా విద్యావేత్తలు, మేధావి వర్గం ఈ యొక్క ఫలితాలపై నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

# కొనుగోలు కేంద్రాన్ని

# ప్రారంభించిన ఏపీఎం సునీత



**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) ఏప్రిల్. 15** ఇందల్వాయి మండల కేంద్రంలోని ఎల్లారెడ్డి పల్లె గ్రామంలో ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ మఠంలా సుజాత శేఖర్ మరియు ఐకేపీ ఏపీఎం సునీత ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుజాత శేఖర్ మాట్లాడుతూ రైతులకు న్యాయమైన ధర అందించేందుకు ప్రభుత్వం ఐకేపీ ద్వారా వరి కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఏ గ్రేడ్ వరికి క్వింటాల్‌కు రూ. 2389, బి గ్రేడ్ వరికి రూ. 2369 చెల్లిస్తూ కొనుగోలు జరుగుతున్నట్లు వెల్లడించారు. రైతులు మధ్యవర్తుల (దళారులు)పై ఆధారపడకుండా నేరుగా ఐకేపీ కొనుగోలు కేంద్రాలకు తమ వరిని తీసుకురావాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుజాత శేఖర్ ఉప సర్పంచ్ సౌజన్య అశోక్ నితిన్ నాగేష్ మంజుల అధ్యక్షులు శ్యామల స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పలు గ్రామాలలో వరి ధాన్యం

# కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**మోర్తాడ్ ఏప్రిల్ 15(ప్రజా జ్యోతి)** మోర్తాడ్ మండలంలోని పాలెం డోనపాల్ తిమ్మాపూర్ గ్రామాలలో స్థానిక సర్పంచులు బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యాల రాములు మాట్లాడుతూ ప్రభుత్వం వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డోనపాల్ సర్పంచ్ బాజమ్మ రాములు ఉప సర్పంచ్ సాయి మాజీ సర్పంచ్ దేవన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు సొసైటీ కార్యదర్శి కాశీరాం పాలెం సర్పంచ్ రాదా రవి ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ తిమ్మాపూర్ సర్పంచ్ నరేష్ ఉపసర్పంచ్ సదానంద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నియమాలు పాటించు.. ప్రాణాలు రక్షించు..

– తూప్రాన్‌లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

– ఐజి చంద్ర శేఖర్ రెడ్డి, కలెక్టర్ ప్రతిమ సింగ్, ఎస్పీ డివి శ్రీనివాస్ రావు








**తూప్రాన్ (ప్రజాజ్యోతి) ఏప్రిల్ 15:** మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా వద్ద ప్రజా పాలన--పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు మానవహారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా గీతా స్కూల్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మానవహారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయని, గాయపడిన వారు కూడా జీవితాంతం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగించాలని, వాహనాలకు ఇన్సూరెన్స్ మరియు అవసరమైన పత్రాలు సరిగా ఉండాలని సూచించారు. అనంతరం అధికారులు భద్రతపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్, ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు, ఆర్డీవో జయచంద్ర రెడ్డి, డీఎస్పీ నరేందర్ గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ బొంది రజని రవీందర్ గౌడ్, వైస్ చైర్‌పర్సన్ కొక్కొండ సమతా రెడ్డి, సీఐలు, ఎస్ఐలు, కౌన్సిలర్లు మరియు గీతా స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

### గీతా జూనియర్ కళాశాల

# విద్యార్థుల ప్రతిభకు కలెక్టర్ అభినందనలు




**తూప్రాన్ (ప్రజాజ్యోతి) ఏప్రిల్ 15:** ఇంటర్మీడియట్ తాజా ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మెరుగైన ప్రతిభ కనబర్చిన తూప్రాన్ గీతా జూనియర్ కళాశాల విద్యార్థులను మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులకు శాలువాలు కప్పి, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాలతో కృషి చేస్తే మరింత ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని సూచించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయచంద్ర రెడ్డి, ఎమ్మార్వో చంద్రశేఖర్ రెడ్డి, ఎంఈవో పర్వతి సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ రజని రవీందర్ గౌడ్, వైస్ చైర్మన్ సమతా కాశిరెడ్డి, ప్రిన్సిపాల్ టి. రాజు, ఇంచార్జ్ ప్రిన్సిపాల్ సుధారాణి వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

# నీళ్లు వస్తున్నాయ్... కానీ తాగలేం!

– తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను హెచ్చరిస్తున్న గ్రామ ప్రజలు





**వెల్దుర్తి (ప్రజాజ్యోతి), ఏప్రిల్ 15:** వెల్దుర్తి పట్టణంలో ఉదయం సరఫరా అయ్యే తాగునీటి పరిస్థితి తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా కొన్ని వాడల్లో మాత్రం మురికిగా, దుర్వాసనతో కూడిన నీరు వస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్వచ్ఛమైన తాగునీరు అందకపోవడం వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ సరఫరా అయ్యే నీరు తాగడానికి పనికిరాకపోవడంతో కొంతమంది ప్రజలు బాటిల్ వాటర్‌పై ఆధారపడాల్సి వస్తోంది. దీనివల్ల అదనపు ఆర్థిక భారం పడుతోందని వారు చెబుతున్నారు. తాగునీటి సమస్య రోజురోజుకు తీవ్రమవుతున్నప్పటికీ సంబంధిత అధికారుల నుంచి స్పందన లేకపోవడం ప్రజల్లో ఆగ్రహానికి దారితీస్తోంది. పైప్‌లైన్లలో లీకేజీలు, నీటి ట్యాంకుల శుభ్రత లోపం వంటి కారణాల వల్ల ఈ పరిస్థితి నెలకొన్నదని గ్రామస్తులు భావిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి, నీటి సరఫరా వ్యవస్థను సమగ్రంగా పరిశీలించి, శుభ్రపరిచే చర్యలు చేపట్టి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకుని నాణ్యమైన మంచినీరు అందించాలని కోరుతున్నారు.

### రైతులకు వరంగా మారనున్న

# మేడికుంట పునరుద్ధరణ పనులు



**తూప్రాన్ (ప్రజాజ్యోతి) ఏప్రిల్ 15:** తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో పర్యావరణ పరిరక్షణకు మరొక మంచి అడుగు పడింది. వాసన్ స్వచ్ఛంద సంస్థ, టీసీపీఎల్ సహకారంతో మేడికుంట పునరుద్ధరణ పనులకు బుధవారం సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ శ్రీకారం చుట్టారు. కుంట కట్ట మరమ్మతులు చేపట్టడం, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే చర్యలు తీసుకోవడం ద్వారా సమీప ప్రాంతాల రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం కలుగుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వాసన్ సంస్థ ప్రతినిధులు వినయ్, బసవరాజ్, గ్రామ పాలకవర్గ సభ్యులు జిన్న కృష్ణ, సరిత పరమేష్ గౌడ్, రేఖ నాగరాజు గౌడ్ తో పాటు పలువురు రైతులు హాజరై కార్యక్రమానికి మద్దతు తెలిపారు.

# అంగన్‌వాడీలే ప్రగతికి తొలిమెట్టు.. విద్యార్థులకు పట్టాలు!

– ముగ్ధమనోహరంగా ప్రిస్కూల్ గ్రాడ్యుయేషన్ వేడుకలు – పాల్గొన్న ఎంపీ రఘునందన్, ఎమ్మెల్యే సునీత రెడ్డి..!





**నర్సాపూర్, ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి)** బాల్యమే దేశానికి బలమైన పునాది.. ఆ పునాదిని అంగన్‌వాడీలు 'అమ్మ ఒడి'లా సంరక్షిస్తున్నాయని మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ప్రశంసించారు. బుధవారం నర్సాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో స్థానిక సాయికృష్ణ గార్డెన్‌లో నిర్వహించిన 'ప్రిస్కూల్ గ్రాడ్యుయేషన్ డే' వేడుకలు కన్నుల పండువగా సాగాయి. 'సీడీపీఓ హేమ భార్గవి' సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమం చిన్నారుల కేరింతలతో విజ్ఞాన వినోదాల మేళవింపుగా నిలిచింది.

**వినూత్నంగా స్వాగతం.. సందడిగా నృత్యాలు**

కార్యక్రమం ప్రారంభంలోనే చిన్నారులు వివిధ పండ్ల వేషధారణలతో అతిథులకు సాదర స్వాగతం పలికి మురిపించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు సభికులను మంత్రముగ్ధులను చేశాయి. ముఖ్యంగా "రారా పోదాం స్కూల్ పిలుస్తుంది.. ఆడుకుందాం,చదుకుందాం దోస్తు రమ్మంటుంది" అంటూ వారు చేసిన నృత్య ప్రదర్శనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**మూడు దశాబ్దాల సేవకు గౌరవం!**

మూడు దశాబ్దాలుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు సేవలందిస్తున్న ఆయాలను గుర్తించి, సత్కరించడం ఈ వేడుకలో గొప్ప విషయంగా నిలిచింది. సుమారు 30 ఏళ్లుగా సేవలు అందించిన వారిని అతిథులు శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను అందజేస్తూ వారి సేవలు వెలకట్టలేనివని అభినందించారు. అనంతరం అంగన్వాడి టీచర్లకు ప్రభుత్వం కేటాయించిన మొబైల్ ఫోన్లను అందజేశారు.

**పట్టాలతో కొత్త ప్రయాణం..**

అంగన్‌వాడీలో శిక్షణ పూర్తి చేసుకుని ప్రాథమిక పాఠశాలల్లోకి అడుగుపెడుతున్న చిన్నారులకు పట్టాలు, మెడల్స్ అందజేసి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేశారు. "అమ్మ ఒడి నుంచి బడికి వెళ్తున్న ఈ చిన్నారులే రేపటి పౌరులు" అని ఎంపీ, ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ అద్భుతమైన వేడుకను ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ బృందాన్ని వారు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్, వైస్ చైర్మన్ బుజ్జేష్ యాదవ్, వార్డ్ కౌన్సిలర్లు, ఐసిడిఎస్ సూపర్వైజర్ మేహేతతో పాటు వివిధ సెక్టార్ల సూపర్వైజర్లు, సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక

– జిల్లా కలెక్టర్ ప్రాతిమ సింగ్







**మనోహరాబాద్, ఏప్రిల్ 15 ( ప్రజా జ్యోతి)** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని కల్లాకల్ గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు. రహదారి నియమాలు పాటిస్తూ వాహనదారులు బాధ్యతతో వాహనాలు నడిపితే రహదారి ప్రమాదాలను సమర్థవంతంగా నివారించవచ్చు కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. ప్రజల ప్రాణల భద్రతే పోలీస్ శాఖ లక్ష్యం ఐ.జి చంద్రశేఖర్ రెడ్డిమనోహరాబాద్ మండలంలోని కలకల్ లో జరిగిన అరయ్– ఆలైవ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఐ జీ చంద్ర శేఖర్ రెడ్డి , జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు లు పాల్గొన్నారు. డ్రైవర్స్ కు ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పించి, డ్రైవర్లకు పలు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐ జీ చంద్ర శేఖర్ రెడ్డి మాట్లాడుతూ..ట్రాఫిక్ నిబంధనల పట్ల బాధ్యతాయుత ప్రవర్తనను ప్రజలు అలవాటు చేసుకోవాలనీ,తూప్రాన్ కాలకాల్ గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఘనంగా చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ డే జరపాలని, 4 సంవత్సరాలు పైబడిన వయసు కలిగిన పిల్లలకు సైతం వాహనాలపై తీసుకెళ్ళే సమయంలో వారికి కూడా హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పక ధరించాల్సిన ఆవశ్యకత గురించి తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. మైనర్ లు వాహనాలు నడపకూడదని, డ్రంకెన్ డ్రైవ్, ఓవర్ స్పీడ్ వంటి వాటి గురించి విస్తృత ప్రచారం నిర్వహిస్తూ, ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అన్నారు. స్కూల్ బస్సులు ఫిట్ నెస్ కలిగి ఉండేలా చూడాలన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..ట్రాఫిక్ రూల్స్ పాటించాలని,వాహన చోదకులు హెల్మెట్ తప్పక తీసుకోవాలన్నారు. రోడ్డు పై ప్రయాణించేటపుడు ఎదుటి వారి అజాగ్రత్తలను కూడా గమనించి ప్రయాణించాలన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ..రోడ్డు ప్రమాదాలను నివారించాలనీ,ప్రతి సం; దాదాపు 7000 ప్రమాదాలు జరుగుతున్నాయని, జాగ్రత్త లే ప్రమాదాల నివారణకు మార్గమన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణ పై ప్రతిజ్ఞ చేశారుఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జయా చంద్రారెడ్డి, డీఎస్పీలు, స్థానిక సర్పంచ్, ఉప సర్పంచ్, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు నిబంధనలు పాటించండి..ప్రాణాలు కాపాడుకోండి..

– తొగుట సిఐ లతీఫ్ – తొగుట మండల కేంద్రంలో కేజీబీవీ విద్యార్థినిలచే రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం







**తొగుట, ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి):** రోడ్డు నిబంధనలు పాటించినట్లయితే వాహనదారులు తమ ప్రాణాలు కాపాడుకున్నవారవుతారని తొగుట సి.ఐ ఎస్.కే. లతీఫ్ సూచించారు. అరైవ్ అలయ్ నాలుగవ దశ కార్యక్రమంలో భాగంగా తొగుట మండల కేంద్రంలో బుదవారం తొగుట ఎస్సై వి. రవికాంత్ రావు తో కలిసి సిఐ ఎస్ కే లతీఫ్ కేజీబీవీ విద్యార్థినిలచే రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమం లో భాగంగా పిల్లలకు లెటర్ రైటింగ్ కంపిటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా తొగుట సిఐ, ఎస్.ఐ రవికాంత్ రావు లు మాట్లాడుతూ పిల్లలు మైనర్ డ్రైవింగ్ చేయరాదని, వాహనదారుకు ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని, వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, రోడ్డును దాటే సమయంలో జిబ్రా క్రాసింగ్ వద్దనే దాటాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం తొగుట క్రాస్ రోడ్ వద్ద విద్యార్థులు, పోలీస్ సిబ్బంది కలిసి హ్యూమన్ చైన్ ఏర్పాటు చేసారు. గజ్వేల్ సిద్దిపేట దారిలో హెల్మెట్, సీట్ బెల్ట్ పెట్టుకొని వచ్చిన వాహదరులను అభినందిస్తూ గులాబీ పువ్వులని బహుకరించినారు. రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. ఈ కార్యక్రమం లో తొగుట కేజీబీవి పాఠశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాఠశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు. అవగాహన ఉన్నా అమలు చేయడం లేదా రోడ్డు నిబంధనలు పాటించాలని ఒకవైపు ప్రభుత్వం, మరోవైపు పోలీస్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు ఎన్నో విధాలుగా అవగాహన కల్పిస్తున్నా వాహన దారులు సంఘటన జరిగిన కొన్ని గంటలు కొంత మేరకు ఆలోచిస్తున్నా తర్వాత రోడ్డు నిబంధనల విషయాన్ని షరా మామూలే అన్నట్లుగా పెడచెవిన పెడుతున్నారన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. మద్యం తాగి వాహనాలు నడిపి ఎంతో మంది తమ ప్రాణాలు కోల్పోతున్నా వాహన దారులలో మార్పు రావడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. పోలీసు సిబ్బంది డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుంటే పోలీసులను ఏవిదంగా తప్పించుకొని వెళ్ళాలి, తనిఖీల్లో పట్టుబడితే ఎవరికి ఫోన్ చేసి విడిపించుకోవాలన్న ఆలోచన తప్ప మద్యం సేవించి వాహనాలు నడపరాదన్న సంగతి పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో దొంగచాటుగా కొనసాగుతున్న బెల్టు షాపులలో రాత్రింబవళ్ళు మద్యం అందుబాటులో ఉండడం మూలంగా ఎప్పుడు పడితే అప్పుడు మద్యం సేవిస్తూ వాహనాలను అతివేగంగా, అజాగ్రత్తగా నడపడం వల్లే ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి నిండు ప్రాణం కోల్పోతే ఆ కుటుంబం ఏవిదంగా ఇబ్బంది పడుతుందో తెలియంది కాదు, ఆయన సంపాదన మీదే ఆధారపడే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు లోనై ఎన్ని కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందో తెలియంది కాదు. ఎవరో చెపితే మనలో మార్పు రావాలి అని అనుకునే కంటే ఆ మార్పు మన నుండే ఎందుకు ప్రారంభించ కూడదు అని ప్రతి ఒక్కరూ ఆలోచిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించడం అంత కష్టమైన పనేమి కాదు. ఆలోచించండి, అవగాహన పెంచండి, మన ప్రాణాలు ఎంతో విలువైనవి, వాటిని కాపాడుకోవడానికి ప్రయత్నించండి.

# ఘన జీవామృతం వాడకంతో భూసారం వృద్ధి

– వ్యవసాయ విస్తరణ అధికారి నాగార్జున

**తొగుట, ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి):** రైతులు స్వయంగా తయారు చేసుకొన్న ఘన జీవామృతం వల్ల భూసారం వృద్ధి చెంది పంటలకు అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ విస్తరణ అధికారి నాగార్జున రైతులకు సూచించారు. రైతులకు ఘన జీవామృతం తయారి కార్యక్రమాన్ని బుదవారం వ్యవసాయ విస్తరణ అధికారి నాగార్జున తొగుట మండలం బండారుపల్లి గ్రామ రైతు గునుగంటి రాజిరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఘనజీవామృతం తయారు చేసి చూపించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సుమారు 62 మంది పాడి రైతులు ఉన్నారని, వంద కిలోల పశువుల పేడ (వారం రోజుల్లో సేకరించినది), ఐదు లీటర్ల పశువుల మూత్రం, రెండు కేజీల ద్విదళ పప్పుల పిండి, రెండు కేజీల బెల్లం, రెండు కేజీల పుట్టమట్టి లేదా రసాయనాలు తగలని పొలం గట్టు మన్ను కలిపి తయారు చేయడం జరిగిందన్నారు. రైతులు వానాకాలం కోసం ఘన జీవామృతాన్ని అనుకూలమైన ఎండాకాలంలో తయారు చేసుకోవాలన్నారు. నారుమడి తయారీలో ఘనజీవామృతాన్ని వినియోగించినట్లయితే ఆరోగ్యమైన నారు తో పాటు నారు పీకే సమయంలో వేరు తెగిపోకుండా సులువుగా నారు తీయవచ్చున్నారు, ఘన జీవామృతాన్ని ఎకరానికి దుక్కిలో కనీసం 400 కిలోల ఘన జీవామృతం వేసుకోవాలని, దానితోపాటు పై పాటుగా ఎకరానికి కనీసం మరో 200 కిలోలు వేసుకోవడం వల్ల భూమిలో సూక్ష్మజీవుల సంఖ్య వృద్ధిచెంది భూమి సారవంతంగా మారి మొక్కలో ఎటువంటి పోషక లోపాలు రాకుండా చేస్తుందన్నారు. ఘన జీవామృతం యూరియా సామర్థ్యం కూడా పెంచుతుందని, యూరియా వినియోగం కూడా తగ్గించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోల వెంకట్ స్వామి, మాట్లాడుతూ గ్రామంలో ఉన్న రైతులు తమ ఇంటికి సరిపడే ఆహారాన్ని ఎటువంటి రసాయనాలు వినియోగించకుండా పండించి కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.



## 18వ వార్డు అంగన్వాడి కేంద్రంలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమం



**పరిగి, ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి) :** మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న 8వ పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పరిగి పట్టణంలోని 18వ వార్డు అంగన్వాడి కేంద్రంలో బుధవారం అంగన్వాడి టీచర్ కట్టా వెంకటమ్మ ఆధ్వర్యంలో పోషణ్ పాక్వాడ కార్యక్రమం నిర్వహించారు. వెంకటమ్మ మాట్లాడుతూ.. పిల్లల మొదటి ఆరేళ్ల జీవన విధ సానుకూల మార్పులు తీసుకురావడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా గర్భధారణ నుంచి రెండేళ్ల వరకు ఉండే తొలి 1000 రోజులు శిశువుల శారీరక, మానసిక అభివృద్ధికి అత్యంత కీలకమని, ఈ దశలో సరైన పోషకాహారం, సంరక్షణ అందించడం ద్వారా వారి భవిష్యత్తును మెరుగుపరచవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గర్భిణి స్త్రీలు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

## గోపీనగర్‌లో ఘనంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు

- ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, పట్నం సునీతా మహేందర్ రెడ్డి
- అట్టహాసంగా నిర్వహించిన జనచైతన్య ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం





**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి) :** గోపీనగర్ జనచైతన్య ఎస్సీ,ఎస్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. సంఘం అధ్యక్షులు బజార్ ఘట్ రమేష్ సారథ్యంలో, కమిటీ సభ్యుల సమన్వయంతో జరిగిన ఈ వేడుకలు కన్నుల పండుగలా సాగాయి. కార్యక్రమ ప్రాంగణాన్ని నీలి జెండాలు, బాబాసాహెబ్ చిత్రపటాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.ముఖ్య అతిథుల రాకతో పెరిగిన శోభ ఈ వేడుకలకు ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ,మాజీ జడ్పీ చైర్మన్ పట్నం సునీత మహేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారితో పాటు మాజీ కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, జగదీశ్వర్ గౌడ్, మాజీ కౌన్సిలర్ కొల్లూరు భరత్, సీనియర్ నాయకులు రఘునాథ రెడ్డి, కొల్లూరి పద్మారావు, మారబోయిన రాజు యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మారబోయిన రవి యాదవ్, షేక్ ఖాసీం, రాజేశ్వరి అమ్మ మరియు ఇతర స్థానిక ప్రముఖులు పాల్గొని కార్యక్రమానికి మరింత గౌరవాన్ని చేకూర్చారు. బాబాసాహెబ్ ఆశయాలే మనకు మార్గదర్శకం బజార్ ఘట్ రమేష్ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు బజార్ ఘట్ రమేష్ మాట్లాడుతూ... అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడారు.ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిన ఘనత బాబాసాహెబ్‌దే. హిందూ కోడ్ బిల్ ద్వారా మహిళా సాధికారతకు, ఓటు హక్కు ద్వారా ప్రజాస్వామ్య బలోపేతానికి ఆయన వేసిన పునాదులు మరువలేనివి,అని పేర్కొన్నారు. యువత అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టాలని, విద్యతోనే సామాజిక మార్పు సాధ్యమని పిలుపునిచ్చారు.

**సందడిగా వేడుకలు భారీగా హాజరైన జనం :**

కార్యక్రమం అనంతరం విచ్చేసిన అతిథులకు, స్థానిక ప్రజలకు కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానిక మహిళలు, యువత, సంక్షేమ సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేశారు. అంబేద్కర్ స్ఫూర్తితో సమాజంలో ఐక్యతను పెంపొందించడమే తమ లక్ష్యమని కమిటీ సభ్యులు ఈ సందర్భంగా ప్రకటించారు.

## రూ. 2.54 లక్షల ఢిల్లీ మద్యం పట్టివేత

**- ఎక్సైజ్ డిటిఎఫ్ టీం సీఐ సౌజన్య**



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి) :** ఖరీదైన శివాజీ రీగల్ మద్యాన్ని ఢిల్లీలో తక్కువ ధరలకు కొనుగోలు చేసి సికింద్రాబాద్‌లో మొండా మార్కెట్ శివాజినగర్ చెప్పాల్వాది బజార్ ప్రాంతంలో అమ్మకాలు జరుపుతుండగా బుధవారం తెల్లవారు జామున సికింద్రాబాద్ ఎక్సైజ్ డీటీఎఫ్ టీమ్ సీఐ సౌజన్య టీమ్ కలిసి పట్టుకున్నారు. ఢిల్లీకి వివిధ సామాగ్రి తీసుక వెళ్లినపుడు తిరుగు ప్రయాణంలో శారద కుమార్(28) వ్యక్తి ఢిల్లీలో శివాజీ రీగల్‌ను రూ.1500 లకు కొనుగోలు చేసి హైదరాబాద్,సికింద్రాబాద్ ప్రాంతాల్లో రూ.3000 వేల నుంచి రూ.3500 అమ్మకాలు జరుపుతున్నట్లు అందిన సమాచారం మేరకు సికింద్రాబాద్ డీటీఎఫ్ సీఐ సౌజన్య,ఎస్సై శివకుమార్, కానిస్టేబుళ్లు జనార్ధన్, రిజ్వాన్, సిద్దిక్‌లు అశోక్ లీలాండ్‌లో ఢిల్లీ నుంచి వచ్చి వాహనంలోని మద్యం బాటిల్ లను అమ్మకాలు జరుపుతుండగా పట్టుకున్నారు.వాహనంలో తనిఖీలు నిర్వహించగా 52 శివాజీ రీగల్ మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించారు. మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మద్యం బాటిళ్ల విలువ రూ.2.54 లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు. పట్టుకున్న మద్యం బాటిళ్లను, నిందితుడిని,వాహనాన్ని సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ సౌజన్య తెలిపారు.

## క్షేమంగా ఇంటికి చేరాలంటే రోడ్డు భద్రత నియమాలు పాటించాలి : సర్పంచ్ మాణిక్యం





**- హెల్మెట్ ధరించండి క్షేమంగా ఇంటికి చేరండి**

**పరిగి, ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి) :** రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, అప్పుడే మీ ప్రయాణం సంతోషదాయకంగా సాగుతుందని, మిట్ట కోడూరు గ్రామ సర్పంచ్ పి. మాణిక్యం తెలియజేశారు. బుధవారం పరిగి మండలంలోని ప్రాథమిక పాఠశాల మిట్ట కోడూరు లో ప్రధానోపాధ్యాయులు ఎండి ఉస్మాన్ అలీ అధ్యక్షతన ప్రజా పాలన.... ప్రగతి ప్రణాళిక యాక్షన్ ప్లాన్ లో భాగంగా చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ డే రోడ్డు భద్రత నియమ నిబంధనల పై అవగాహన కార్యక్రమం, క్షేమంగా మన ప్రయాణం సాగాలంటే పాటించవలసిన నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గ్రామ సర్పంచ్ పి మాణిక్యం మాట్లాడుతూ.. బైక్ మోటార్ సైకిల్స్ నడిపే వాళ్ళు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఫోర్ వీలర్స్ నడిపే వాళ్ళు సీట్ బెల్ట్ తప్పక పెట్టుకోవాలని, సెల్ ఫోన్ తో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని తెలియజేశారు. విద్యార్థినీ విద్యార్థులచే రోడ్డు భద్రతపై పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. రోడ్డు భద్రత అవగాహనపై చక్కని డ్రాయింగ్ పెయింటింగ్ వేసిన వారికి సర్పంచ్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ అనిత రాణి, ఉప సర్పంచ్ మల్లేశం, గ్రామ కార్యదర్శి బాలకిషన్, వార్డ్ మెంబర్స్ జనార్దన్, మల్లేశం, వెంకటేష్, గ్రామ పెద్దలు జహంగీర్, శ్రీనివాస్ రెడ్డి, నర్సింలు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఏ కృష్ణయ్య, ఎన్ నర్సింలు, రాజు, అంగన్వాడీ టీచర్స్ పద్మమ్మ, చంద్రకళ, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డుపై తాయి బజార్ సంత

- రైతులపై గంప రుసుము వసూళ్లు వెంటనే నిలిపివేయాలి : సయ్యద్ షా మహమ్మద్ హుస్సైని
- వేలంలో భారీ ధరలకు సంతలు దక్కించుకొని, రైతులపై అధిక రుసుములతో భారం






**పరిగి, ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి) :** ముజాహిద్ పూర్ గ్రామం, కుల్కచర్ల మండలం వికారాబాద్ జిల్లాలో ప్రతి మంగళవారం నిర్వహించే సంతను గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వేలం పాట ద్వారా ఒక సంవత్సరం కాలానికి వ్యాపారికి అప్పగించినట్లు తెలిసిందని, ఆ వ్యాపారి సంతకు వచ్చే రైతుల వద్ద నుండి ఒక గంపకు మరియు మూటకు ?30 నుండి ?50 వరకు రుసుము వసూలు చేస్తున్నారని హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ (హెచ్ఆర్పిఎస్) వికార్‌బాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ షా మహమ్మద్ హుస్సైని బుధవారం ఒక పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. కొందరు వ్యాపారస్తులు వేలంపాటలో పోటా పోటీగా అధిక మొత్తాలకు సంతను దక్కించుకొని, తరువాత ఆ డబ్బును తిరిగి సంపాదించుకోవడానికి రైతులపై అధిక రుసుములు విధిస్తూ దోపిడీ చేస్తున్నారని రైతులు వాపోతున్నారని ఆయన అన్నారు. చుట్టుపక్కల గ్రామాల రైతులు తమ కష్టపడి పండించిన కూరగాయలను అమ్ముకునేందుకు ఎంతో కష్టపడి సంతకు చేరుకుంటున్నారని, సరైన రవాణా సౌకర్యం లేక ఆటోలు లేదా ఇతర వాహనాలకు అధిక కిరాయి చెల్లించి వస్తున్నారని తెలిపారు. ఉదాహరణకు ఒక రైతు 3 కిలోల పాలకూరను సంతకు తీసుకొచ్చి ఒక్క కిలోకు ?40 ధరకు అమ్మితే మొత్తం ?120 మాత్రమే వస్తాయని, అందులో గంప రుసుముగా ?30 చెల్లించాల్సి వస్తుందని చెప్పారు. పంటను సంతకు తీసుకురావడానికి ఆటో కిరాయి ?60 అయ్యే పరిస్థితిలో మొత్తం ఖర్చు ?90 అవుతుందని, చివరికి రైతు చేతిలో మిగిలేది కేవలం ?30 మాత్రమే అవుతుందని ఆయన వివరించారు. ఈ పరిస్థితిపై రైతులు తీవ్రంగా బాధపడుతున్నారని తెలిపారు.

ఇంతటితో ఆగకుండా సంతను ఆర్‌డబి రోడ్డుపై నిర్వహించడం వల్ల గ్రామానికి వచ్చే ఆర్టీసి బస్సులు, స్కూల్ బస్సులు, కార్లు ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హుస్సైని అన్నారు. సంత రోజున ట్రాఫిక్ సమస్యలు పెరిగి ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రహదారిపైనే రైతులు కూర్చొని కూరగాయలు అమ్ముకోవాల్సి వస్తోందని, ఇలాంటి పరిస్థితుల్లో అనుకోకుండా రైతులకు ప్రమాదం జరిగితే రైతుల ప్రాణాలకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

అదేవిధంగా సంతలో రైతులకు కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవని ఆయన తెలిపారు. కూర్చోవడానికి స్థలం లేకపోవడం, షెడ్లు లేకపోవడం, ఎండ--వర్షం నుండి రక్షణ లేకపోవడం రైతులకు తీవ్ర ఇబ్బందిగా మారిందని చెప్పారు. తాగునీరు, పారిశుద్ధ్యం, లైటింగ్ వంటి సదుపాయాలు కూడా లేకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చిందన్నారు. అలాగే గ్రామంలో కొంతమంది మేకలను ఊరిలోనే వదిలేయడం వల్ల అవి సంతలో తిరుగుతూ రైతులు అమ్మకానికి పెట్టిన కూరగాయలను తినడం, తొక్కడం వల్ల కూడా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. కాబట్టి తాయి బజార్‌లో రైతులపై గంప రుసుము వసూళ్లను వెంటనే పునర్విమర్శించి అవసరమైతే నిలిపివేయాలని, సంతను రోడ్డుపై కాకుండా సరైన ప్రదేశంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, గ్రామంలో, సంతలో మేకలు తిరగకుండా చర్యలు తీసుకోవాలని, రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని హుస్సైని డిమాండ్ చేశారు.

రైతుల భద్రత, హక్కులను కాపాడేందుకు" సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. లేకపోతే రైతులతో కలిసి ఈ అంశంపై పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా పై విషయమై కుల్కచర్ల మండల ఎంపిడిఒకి, ముజాహిద్ పూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అలాగే కార్యదర్శి కి వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది అని తెలిపారు.

## అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి





**- కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్**

**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి) :** శేరిలింగంపల్లి డివిజన్ గోపినగర్ లో స్థానిక పేద ప్రజల అభ్యున్నతికి బాటలు వేస్తూ.. మాజీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్పర్సన్ రాగం సుజాత యాదవ్ శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ సొంత ఖర్చులతో నిర్మించినటువంటి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనం సమీపంలో జనచైతన్య వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమానికి పిఏసీ ఛైర్మెన్, శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరెకపూడి గాంధీ,వికారాబాద్ జిల్లా మాజీ జెడ్ పి ఛైర్పర్సన్ సునీత మహేందర్ రెడ్డి,టీపీసీసీ జనరల్ సెక్రటరీ జగదీశ్వర్ గౌడ్ తో కలిసి ముఖ్య అతిథులుగా శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత, దార్శనికుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయడం నేటి సమాజానికి ఎంతో అవసరమని.. అణగారిన వర్గాల హక్కుల కోసం మహిళా సాధికారత కోసం ఆయన చేసిన కృషిని స్మరించుకుంటూ.. కులరహిత వివక్ష లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరు కృషి చెయ్యాలన్నారు.. స్థానిక ప్రజలకు ఇచ్చిన వాగ్దానానికి కట్టుబడి అందరికి అందుబాటులో ఉండే విధంగా తన సొంత ఖర్చులతో అన్ని హంగులతో భవనం నిర్మించి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరుతో భవనం అందుబాటులోకి తెచ్చామన్నారు.ఆయన కలలుగన్నసామాజిక న్యాయం, సమానత్వం కలిగిన భారతదేశాన్ని నిర్మించడమే మనం ఆ మహనీయునికి అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గోపినగర్ అంబేద్కర్ భవన్ జన చైతన్య ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షులు.. సభ అధ్యక్షులు బజర్ఘాట్ రమేష్, డివిజన్ అధ్యక్షులు రాజు యాదవ్, మాజీ కౌన్సిలర్ రాజేశ్వరమ్మ, మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్,పద్మరావు, గఫుర్, బాపునగర్ హనుమాన్ యూత్ ప్రెసిడెంట్ రాజ్ కుమార్, సాయన్న,శ్రీకాంత్ దేవులపల్లి,నర్సింహా,మహేష్ చారీ, అలీ,ముంతాజ్ బేగం, రాంచందర్,షైబాజ్, అంబేద్కర్ భవన్ జనచైతన్య ఎస్సీ/ఎస్టి అసోసియేషన్ సభ్యులు రంగుల ప్రవీణ్, గొడవర్తి సందీప్, ఉప్పరి సత్యనారయణ, సాయినాథ్, డాక్టర్.కళ్ళు ముసలయ్య,రాధిక, ప్రవీణ్ అబ్రహాం, బజార్ఘట్ దుర్గేశ్, ఎస్.వెంకటేష్, నర్సింహా, తుకారాం,జీ.రాజు,రాజేందర్,యేసు, దేవ ప్రసాద్, దస్తగిరి, ఎజాస్, గండయ్య, రాములు,శివప్రసాద్ నాయక్,కార్తిక్, రైల్వే రవి, జగదీష్, పెంటయ్య, ఆనంద్, నాంపల్లి రాజు,అనిల్ కుమార్ స్థానికవాసులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ విద్యుత్ ఆర్టీసన్ ఉద్యోగులకు న్యాయం చేయాలి

**- మద్దతిచ్చిన బీజేపీ**



**తాండూరు ఏప్రిల్ 15 ప్రజా జ్యోతి :** వికారాబాద్ జిల్లా తాండూర్ నియోజకవర్గంలో గల సబ్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న తెలంగాణ విద్యుత్ శాఖలో ఆర్టీసన్ ఎంప్లాయిస్ కు ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలని కోరుతూ బిజెపి పట్టణ శాఖ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నగరం మల్లేశం పలువురు కౌన్సిలర్లు మద్దతుగా నిలిచారు. బుధవారం రోజు తాండూరు పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద తెలంగాణ విద్యుత్ శాఖ ఆర్టీసన్ జాయింట్ యాక్షన్ కమిటీ నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. విద్యుత్ శాఖలో సబ్ స్టేషన్ ఆపరేటర్లుగా వివిధ విభాగాలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరికీ కూడా న్యాయం చర్యంతవరకు బిజెపి అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తాండూర్ డివిజన్ ఎంప్లాయిస్‌కి సంఘీభావంగా బిజెపి జిల్లా కార్యదర్శి బంటారం భద్రేశ్వర్, 23వ కౌన్సిలర్ అంతారం కిరణ్ కుమార్, జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు బండారు శ్రీకాంత్, తాండూర్ పట్టణ ఉపాధ్యక్షుడు దోమ కృష్ణ, ప్రధాన కార్యదర్శులు మంతటి రాజు, ప్రభాకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## బాలికలకు భద్రతపై పోలీసుల అవగాహన కార్యక్రమం


**షీ టీం ఇంచార్జ్ నర్సిములు ఆధ్వర్యంలో చట్టాలు, సైబర్ నేరాలపై కీలక సూచనలు**




**పరిగి, ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి) :** జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా, పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని మహాత్మ జ్యోతిబా పూలే బాలికల పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిగి సబ్‌డివిజన్ షీ టీం ఇంచార్జ్ నర్సిములు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం వంటి ముఖ్య అంశాలపై విద్యార్థినులకు వివరించారు. అలాగే డయల్ 100, షీ టీం హెల్ప్‌లైన్ 181, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా వంటి సామాజిక సమస్యలపై అవగాహన కల్పించారు. మద్యపాన నిషేధం, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నియంత్రణపై కూడా సూచనలు ఇచ్చారు. ఇటీవల పెరుగుతున్న బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల నేపథ్యంలో 1930 హెల్ప్‌లైన్ వినియోగంపై ప్రత్యేకంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సౌజన్య, ఉపాధ్యాయులు, విద్యార్థినులు మరియు షీ టీం సభ్యులు బి.సావిత్రి, శోభ పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు ఘన సన్మానం

- ప్రతి కార్మికుడిని గౌరవించాలి
- బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ భద్రేశ్వర్



**తాండూరు ఏప్రిల్ 15 ప్రజాజ్యోతి :** తాండూరు మున్సిపల్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తాండూర్ అసెంబ్లీ కన్వీనర్ బంట్వారం భద్రేశ్వర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని బీజేపీ రాష్ట్ర అధిష్టానం పిలుపుమేరకు తాండూర్ మున్సిపల్ లో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు తాండూరు పట్టణంలోని బూతు నంబర్ 148,149,150లో గల పారిశుద్ధ్య కార్మికులకు సన్మానించడం జరిగిందని చెప్పారు. కార్మికులను గౌరవించడం అలవాటుగా మార్చుకోవాలి అన్నారు.ఇట్టి కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు నాగారం మల్లేశం, అంతారం కిరణ్, అసెంబ్లీ కో కన్వీనర్ బండారి శ్రీకాంత్,వార్డు సభ్యులు డాక్టర్ రమేష్ తదితరులు ఉన్నారు.



## ఇంటర్ సప్లిమెంటరీలో 100 శాతం ఉత్తీర్ణత లక్ష్యం - డీఐఈఓ శంకర్




**వికారాబాద్ ప్రతినిధి ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి) :** జిల్లాలో నిర్వహించే ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎన్. శంకర్ సూచించారు. బుధవారం జిల్లా ఇంటర్మీడియట్ కార్యాలయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశం నిర్వహించి, ఇటీవల విడుదలైన ఇంటర్ పబ్లిక్ పరీక్షల ఫలితాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సబ్జెక్టులో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజును ఈ నెల 20వ తేదీ లోపు విద్యార్థుల నుంచి వసూలు చేసి చెల్లించేలా ప్రిన్సిపాళ్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్చి నెలలో పరీక్షలను విజయవంతంగా నిర్వహించిన సిబ్బందిని అభినందించిన ఆయన, సప్లిమెంటరీ పరీక్షల దృష్ట్యా ఉపన్యాసకులు విద్యార్థులకు ప్రత్యేక మార్గదర్శనం చేయాలని తెలిపారు. అనంతరం కళాశాలల వారీగా ఫలితాలను సమీక్షించారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ప్రిన్సిపాళ్లు, ఉపన్యాసకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాళ్లు రూపాలక్ష్మి, నరసింహారెడ్డి, బుచ్చిరెడ్డి, సురేశ్వర స్వామి, స్వర్ణలత, రోజారాణి, వసంత, తాండూర్ ఇంచార్జ్ ప్రిన్సిపాల్ మల్లయ్య, ఉపన్యాసకులు చంద్రశేఖర్, రాములు, కార్యాలయ సిబ్బంది సలీమా బేగం, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు. **20లోపు ఫీజు చెల్లించండి :** ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 20వ తేదీ లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని డీఐఈఓ సూచించారు. తల్లిదండ్రులు సంబంధిత కళాశాలల్లో ఫీజు చెల్లించేందుకు సహకరించాలని కోరారు.

## కోర పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి )
నగరంలోని విద్యానగర్‌లో ఉన్న కోర పాఠశాలలో యు.కె.జి విద్యార్థుల కోసం ఈరోజు ఉదయం గ్రాడ్యుయేషన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రీ–ప్రైమరీ విద్యను పూర్తి చేసి ప్రాథమిక విద్యలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా నిర్వహించింది.
కార్యక్రమాన్ని పాఠశాల చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్,






రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్ రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం చిన్నారులు ఆకట్టుకునే నృత్య ప్రదర్శనలు చేసి ప్రేక్షకులను అలరించారు.
పట్టభద్రులుగా మారుతున్న సమయంలో చిన్నారులతో కలిసి తల్లులు కూడా నృత్యాలు చేసి భావోద్వేగ క్షణాలను సృష్టించారు. తర్వాత విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు, పతకాలు, ఫోటో ఫ్రేమ్‌లు జ్ఞాపక చిహ్నాలుగా అందజేశారు.
విద్యార్థులు కిండర్ గార్టెన్ నుండి ప్రాథమిక స్థాయికి మారుతున్న తమ అనుభూతులను స్పీచ్ రూపంలో వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సంతోష్ రెడ్డి, డైరెక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఇంగ్లీష్‌లో మాట్లాడే నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకున్నారని తెలిపారు. ప్రాథమిక విద్యలో అడుగుపెడుతున్న చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకను విజయవంతం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు పాఠశాల యాజమాన్యం అందరికీ కృతజ్ఞతలు తెలిపింది. పిల్లలకు అందజేసిన ఫోటో ఫ్రేమ్‌లు జీవితాంతం గుర్తుండే జ్ఞాపకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

## క్రీడా స్ఫూర్తి పెంపొందించేందుకు 'కేసీఆర్ కప్' ప్రారంభం


వేములవాడ,ఏప్రిల్,15:ప్రజాజ్యోతి
వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి గ్రామంలో 'కేసీఆర్ కప్' క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్‌ను బీఆర్ఎస్ రూరల్ మండల అధ్యక్షుడు గోస్కుల రవి టాస్ వేసి ప్రారంభించారు. కార్యక్రమానికి ముందు పాల్గొన్న క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకుని అభినందించారు. ఈ సందర్భంగా గోస్కుల



రవి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా 2001లో కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని స్థాపించిన విషయాన్ని గుర్తు చేశారు. పార్టీ స్థాపనకు 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా యువతను ప్రోత్సహించేందుకు ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత క్రీడల్లో చురుకుగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని, గెలుపు–ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇల్లందుల లాస్య ప్రణీత్, మాజీ సర్పంచ్ కటకం మల్లేశం, పెండ్యాల తిరుపతి, శ్రీనివాస్ రెడ్డి, వెల్మ బాల్‌రెడ్డి, సుమన్, నాయకులు పెండ్యాల శంకర్, పశుల అంజిబాబు, పార్టీ నాయకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు సేవలందించడమే ఆలయ ఫౌండేషన్ లక్ష్యం

తిమ్మాపూర్ ఏప్రిల్ 15 ( ప్రజాజ్యోతి )
ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఫౌండేషన్ సభ్యులు తీట్ల రమేష్ మాట్లాడుతూ పేద ప్రజలకు అవసరమైన విద్య, వైద్య సదుపాయాలకు సంబంధించిన సేవలందించడమే ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి మార్గదర్శనంలో నడుస్తున్న ఆలయ ఫౌండేషన్ లక్ష్యమని ఉమ్మడి కరీంనగర్ జిల్లా సభ్యులు తీట్ల రమేష్ బాబు పేర్కొన్నారు.తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామానికి చెందిన నక్క మొండయ్య భార్య లక్ష్మి కి గతంలో అనారోగ్యం వల్ల శస్త్ర చికిత్స ద్వారా మోకాలు పై వరకు తొలగించారు. ఆలయ ఫౌండేషన్ సిఈఓ కీర్తి నాగార్జున ద్వారా హైదరాబాద్ కు వెళ్లిన లక్ష్మికి ఇటీవల కృత్రిమ కాలు అమర్చడం జరిగింది.బుధవారం మొగిలిపాలెం వచ్చిన సందర్భంగా రమేష్ బాబు



మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కంటి పరీక్షలు,శస్త్ర చికిత్సల కోసం నరహరి బసంత్ నగర్ లో పెద్ద ఆసుపత్రి కట్టించినట్లు తెలిపారు. ఉన్నత చదువులతో పాటుగా ఉపాధి కల్పన లో పెద్ద, పెద్ద కార్పొరేటు కంపెనీ ల ద్వారా ఉద్యోగ అవకాశాలకోసం క్యాంప్ లు కూడా ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.కృత్రిమ కాలు అమర్చడం కోసంభాధితుల పక్షాన ఫౌండేషన్ ను సంప్రదించిన మాజీ వైస్ ఎంపిపి తుమ్మనపల్లి శ్రీనివాసరావ్,న్యాయవాది బీజేపీ మాజీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి లకు ధన్యవాదములు తెలిపారు. సర్పంచ్ తాట్ల తిరుపతి,కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు మోరపల్లి రమణారెడ్డి,వార్డు సభ్యులు చెన్నబోయిన రవి,పాశం రాఘవరెడ్డి, ఎల్కపల్లి స్వామి, జక్కుల శ్రీనివాస్, జనార్ధన్ రావు,రవికుమార్, వరుణ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బ్రాండ్ ఇమేజ్ గా కోట రెజోనెన్స్ కళాశాల

### రాష్ట్రస్థాయి ఫస్ట్ మార్కులు రావడం గర్వకారణం
### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ,సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్ టౌన్,ఏప్రిల్ 15( ప్రజాజ్యోతి )
కరీంనగర్ లోని కోట ఇన్స్టిట్యూట్ వారి రెజోనెన్స్ జూనియర్ కాలేజ్ కరీంనగర్ కు ఇంటర్ ఫలితాల ద్వారా రాష్ట్ర స్థాయి గుర్తింపు తెచ్చి పెట్టిందని ఇది కరీంనగర్ కు గర్వకారణమని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు కరీంనగర్ లోని రేకుర్తి లో గల కెపిఎస్ హైస్కూల్లో కోట రెజోనెన్స్ జూనియర్ కాలేజ్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి ఫస్ట్ మార్కులు వచ్చిన సందర్భంగా బుధవారం ఏర్పాటుచేసిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు కరీంనగర్లో అనతి కాలంలోనే కార్పొరేట్ కళాశాలలను తలదన్నేలా గ్రామీణ ప్రాంతం నుండి మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలనె ఉద్దేశంతో ఉత్తమ పౌరులుగా తయారు చేయాలనే సంకల్పంతో కోట విద్యాసంస్థలను స్థాపించిన చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు ప్రపంచంలో చదువును మించిన ఆయుధం లేదని కష్టపడి చదువుకున్న వారే ఉన్నత స్థానాలలో ఉన్నారని కోట విద్యాసంస్థలు భవిష్యత్తులో




మరిన్ని అద్భుత విజయాలు సాధించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆకాంక్షించారు మరో అతిథి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు వచ్చిన అంజిరెడ్డి కరీంనగర్ కు రాష్ట్రస్థాయిలో కీర్తి తీసుకురావడం మనందరికీ గర్వకారణం అన్నారు ఫలితాలు రావడానికి ఇంకా టైం పడతది అనుకున్నా ఒక యజ్ఞంలా కృషిచేసి తొందరలోనే ఫలితం వచ్చేలా కృషిచేసిన డాక్టర్ డి అంజిరెడ్డి ఇదే స్ఫూర్తితో రాష్ట్రస్థాయి పరంపర కొనసాగించాలని కోరారు కోట ఇన్స్టిట్యూట్ అనేది ఇప్పుడు కరీంనగర్లో బ్రాండ్ ఇమేజ్ గా మారిందని కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు రాబోయే రోజుల్లో నెంబర్ వన్ గా కరీంనగర్ను తీర్చిదిద్దాలనే దానికి కోట విద్యాసంస్థలు బాటలు వేశాయని అన్నారు మరో అతిథి ట్రస్మ అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు మాట్లాడుతూ కోట విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డి యొక్క క్రమశిక్షణ అతనిని బ్రాండ్ ఇమేజ్కు దగ్గరగా తీసుకు వెళ్లిందని అన్నారు కోట విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డి మాట్లాడుతూ ఇక్కడి విద్యార్థులు ఎక్కడికో వెళ్లకుండా స్మార్ట్ క్లాస్ విద్యా విధానం ద్వారా స్థానికంగానే మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో కోట విద్యాసంస్థలను స్థాపించి తొలి ప్రయత్నం లోనే రాష్ట్రస్థాయి మార్కులు సాధించడం గర్వకారణంగా ఉందని అన్నారు విద్యార్థులు వారి తల్లిదండ్రులు అధ్యాపక బృందం ఇచ్చిన ప్రోత్సాహంతో భవిష్యత్తులో మరిన్ని సంచలనాలు నమోదు చేస్తామని డాక్టర్ డి అంజిరెడ్డి అన్నారు రాష్ట్రస్థాయిలో ఫస్ట్ మార్క్ సాధించిన ప్రథమ సంవత్సరం ఎంపీసీలో గాలి సౌమ్యశ్రీ 469, ద్వితీయ సంవత్సరం కే సహన శ్రీ 995 , ద్వితీయ సంవత్సరం బైపీసీలోజి రోషిని 993 , బైపిసి ప్రథమ సంవత్సరంలో పి శరణ్య438 లను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ట్రస్మా అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు లు అందించి పూల గుచ్చం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో కోట విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డి ప్రిన్సిపాల్ అధ్యాపక బృందం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ప్రజా సంక్షేమమే లక్ష్యం

### ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి
### ఇందిరమ్మ ఇండ్ల కోసం డబ్బులు వసూలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు
### మంథనిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల పంపిణీ లో..

మంథని, ఏప్రిల్ 15 (ప్రజాజ్యోతి):
ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసి మంథని లోని శివ కిరణ్ గార్డెన్స్ లో మంథని నియోజకవర్గ పరిధిలోని సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ, అంగన్వాడి టీచర్లకు మొబైల్ ఫోన్లు, గ్యాస్ స్టౌ పంపిణీ , ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వ పాలన వచ్చిందని, ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల వ్యవధిలో మహాలక్ష్మి పథకం క్రింద డిసెంబర్ 9 నుంచి ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం ప్రారంభించామని, ఇప్పటి వరకు 290 కోట్ల పైగా జీరో టికెట్స్ మహిళలకు జారీ చేయడం జరిగిందని, మహిళలు 10 వేల కోట్లకు పైగా డబ్బులు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఆదా చేసుకున్నారని మంత్రి తెలిపారు. మంథని డిపో నుంచి మహిళలు చేసిన ఉచిత ప్రయాణాల వల్ల దాదాపు 67 కోట్ల రూపాయలు ఆదా అయ్యాయని తెలిపారు. నేడు అంగన్వాడి టీచర్లకు సెల్ ఫోన్, గ్యాస్ స్టవ్ లను పంపిణీ చేస్తున్నామని అన్నారు. సెల్ ఫోన్ ద్వారా సాంకేతికతంగా మరింత మెరుగైన సేవలు ప్రజలకు అందించే అవకాశం ఉంటుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి నిర్ణీత కాలంలో పనులు పూర్తయ్యే విధంగా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలని






మంత్రి సూచించారు. మే నెల తర్వాత మరో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి సంవత్సరం 3500 ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని అర్హులైన చివరి లబ్ధిదారుడి వరకు ఇందిరమ్మ ఇండ్లు చేరుతాయని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోసం ఎవరైనా రూపాయి వసూలు చేయాలని చూస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు కు బిల్లులు ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే ఫిర్యాదు చేయాలని, ఇంటి నిర్మాణ పురోగతి ఆధారంగా బిల్లుల చెల్లింపు చేయడం జరుగుతుందని, ఎటువంటి సిఫార్సు నడువదని ఎవరికి ఇవ్వవద్దని మంత్రి పేర్కొన్నారు. రైతులకు ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరమే రెండు లక్షల రుణమాఫీ పూర్తి చేసామన్నారు. నిరుద్యోగ యువత కోసం గ్రూప్ 1 , గ్రూప్ 2, గ్రూప్ 3, గ్రూప్ 4, పోలీస్, విద్యా, వైద్య, ఇంజనీరింగ్, సంక్షేమ శాఖలో వివిధ పరీక్షలు విజయవంతంగా నిర్వహించి 70 వేలకు పైగా నియామక పత్రాలు పంపిణీ చేశామని అన్నారు. గత పాలకుల హయాంలో వడ్డీ లేని రుణాల కింద మహిళా సంఘాలకు ఒక్క రూపాయి కూడా రాలేదని, మన ప్రభుత్వం వచ్చిన తర్వాత రెగ్యులర్గా మహిళా సంఘాలకు వడ్డీ సొమ్ము పంపిణీ చేస్తున్నామన్నారు. మహిళా సాధికారత లక్ష్యంగా పెద్దపల్లి లో వీ–హబ్ ప్రారంభించడం జరిగిందని అన్నారు. పిల్లలకు అంతర్జాతీయ స్థాయిలో విద్యా ప్రమాణాలతో చదువుకోవాలనే లక్ష్యంతో అడవిసోమన్ పల్లిలో 200 కోట్ల రూపాయల తో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకులాలను నిర్మిస్తున్నామన్నారు. పేదలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు కూడా అవసరమైన చర్యలు చేపట్టడం జరిగిందని అన్నారు. ఆర్థిక వ్యవస్థ బాగు చేస్తూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ తప్పనిసరిగా అమలు చేస్తామని అన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రమాదాలు జరిగిన సంఘటనల్లో చాలా మంది బాధితులను ఆసుపత్రిలో జాయిన్ చేయడానికి ముందుకు రావడం లేదని, దీనిని నివారించేందుకు ప్రభుత్వం రహ వీర్ పేరుతో కొత్త పథకాన్ని ప్రవేశపెట్టిందని, ప్రమాదం జరిగినప్పుడు బాధితులను గోల్డెన్ అవర్ లో ఆసుపత్రిలో జాయిన్ చేస్తే రూ. 25 వేల ప్రోత్సాహకం ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రైవేట్ ఆస్పత్రిలో జాయిన్ చేస్తే చికిత్స కోసం లక్షన్నర వరకు ప్రభుత్వం చెల్లిస్తుందని కలెక్టర్ తెలిపారు.
అంతకు ముందు మంథని పట్టణంలో 32 లక్షల డిఎంఎఫ్టి నిధులతో చేపట్టిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల జె.బి.ఎస్ రినోవేషన్ పనులను మంత్రి ప్రారంభించారు.
ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డిసిపి రామ్ రెడ్డి, మంథని ఆర్ డి ఓ సురేష్, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులకు స్టేట్ ర్యాంక్, గోల్డ్ మెడల్స్

పెద్దపల్లి ప్రతినిధి, ఏప్రిల్ 15 ప్రజా జ్యోతి; యూనిఫైడ్ ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో గాయత్రి విద్యానికేతన్ విద్యాసంస్థల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పాఠశాలకు గౌరవం తెచ్చిపెట్టారు. ఈ పోటీల్లో విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా ఏడవ తరగతి విద్యార్థి ఏ. సాత్విక్ తేజ రాష్ట్ర స్థాయిలో 13వ ర్యాంక్ సాధించి ప్రతిభ చాటుకున్నాడు. అదేవిధంగా మొత్తం తొమ్మిది మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్లు సాధించి పాఠశాల ప్రతిష్ఠను మరింత పెంచారు. గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు: డి. శ్రీనికేష్ (మొదటి తరగతి), ఏ. ప్రణవ్ (మొదటి తరగతి), టి. అవ్యాన్ సాయి (మొదటి తరగతి), కె. వేదశ్రీ (మొదటి తరగతి), సి.హెచ్. సుమతి (రెండవ తరగతి), కె. శ్రీనిత్య (మూడవ తరగతి), ఆర్. శివాంశ్ (నాలుగవ తరగతి), బి. జశ్వంత్ (ఐదవ తరగతి), ఎన్. శ్రీహిత (ఎనిమిదవ తరగతి) తమ ప్రతిభను ప్రదర్శించారు. ప్రత్యేకంగా టి. అవ్యాన్ సాయి ఇప్పటికే మూడు గోల్డ్ మెడల్స్ సాధించగా, బి. జశ్వంత్ రెండు గోల్డ్ మెడల్స్ సాధించడం విశేషం. ఈ విజయాల సందర్భంగా గాయత్రి విద్యానికేతన్ విద్యాసంస్థల చైర్మన్ అలంకి శ్రీనివాస్,




కరెస్పాండెంట్ రజనీదేవి విద్యార్థులను గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్లతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠ్యాంశాలతో పాటు ఒలింపియాడ్ వంటి పోటీ పరీక్షలు విద్యార్థుల్లో లోతైన ఆలోచనా శక్తి, విశ్లేషణాత్మక నైపుణ్యాలను పెంపొందిస్తాయని తెలిపారు. గాయత్రి విద్యానికేతన్ విద్యాసంస్థలు విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ఇలాంటి పోటీ పరీక్షలను ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయ్, వైస్ ప్రిన్సిపల్ ప్రియాంక, గణిత ఉపాధ్యాయురాలు నవ్య పాల్గొని విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల విజయాలపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ పాఠశాల నిర్వహణను అభినందించారు. ఈ విజయాలు గాయత్రి విద్యానికేతన్ విద్యాసంస్థల విద్యా ప్రమాణాలను మరోసారి నిరూపించాయి.a

## అంబాల సదానందంకు 'దళిత రత్న' అవార్డు

### ఉద్యమకారునికి అరుదైన గౌరవం

జమ్మికుంట,ఏప్రిల్15 ( ప్రజాజ్యోతి ):
జమ్మికుంట మండలం తనుగుల గ్రామానికి చెందిన ఉద్యమకారుడు అంబాల సదానందంకు అరుదైన గౌరవం దక్కింది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో "ధూమ్ ధామ్" వంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా చురుకుగా పాల్గొని, బోనమెత్తుకొని ప్రజల్లో చైతన్యం నింపిన సదానందం తనదైన ముద్ర వేశారు. ఉద్యమంలో అనేక వేదికలపై వందలాది కార్యక్రమాల్లో పాల్గొని కీలక పాత్ర పోషించారు. రాష్ట్ర ఏర్పాటుకు అనంతరం ఇన్నాళ్లకు ఆయన సేవలకు గుర్తింపుగా మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో 'దళిత రత్న' అవార్డును ప్రదానం చేశారు. ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు బైరి వెంకటేష్ చేతుల మీదుగా ఈ పురస్కారం అందించారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ, తనకు ఈ అవార్డు రావడం ఆనందంగా ఉందని, కార్యక్రమం నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం, ఉత్సవ కమిటీ చైర్మన్ మరియు ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో పాటు సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత రాష్ట్ర నాయకులు బత్తుల పాండు, సామాజిక కార్యకర్తలు అంబాల రజనీకాంత్, జక్కె రాజేష్, అనిల్ సందీప్, అంబేద్కర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతిభ కనబర్చిన కేజీబీవీ విద్యార్థులకు జిల్లా కలెక్టర్ అభినందన

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి ఏప్రిల్ –15 (ప్రజాజ్యోతి)
ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)విద్యార్థులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం అభినందించారు. ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం ఫలితాలు విడుదల కాగా, జిల్లాలోని ప్రథమ సంవత్సరంలో సిరిసిల్ల కేజీబీవీ బీపీసీలో కీర్తన 436/440, మర్రిపల్లి కేజీబీవీ ఎంపీసీలో బీ మమత 466/470, రుద్రంగి కేజీబీవీ ఎంపీసీలో జీ మమత 466/470 మార్కులు సాధించారు. తంగళ్లపల్లి కేజీబీవీ ఎంపీ హెచ్ డబ్ల్యూలో ఎల్ శృతికి490 /500, వేములవాడ కేజీబీవీ ఏఐఎంఎల్ లో అక్షిత 486/500, మర్రిపల్లి కేజీబీవీలో జీ శ్యామల ఎంపీసీలో 984/1000 మార్కులు సాధించిన సందర్భంగా ఆ విద్యార్థులు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ను కలువగా, వారిని అభినందించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్ణయించుకొని పట్టుదలతో కృషి చేస్తే విజయాన్ని సాధించడం సాధ్యమవుతుందని ఆమె సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జీసీడీఓ పద్మజ, స్పెషల్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.




## పోతిరెడ్డి పల్లెలో గేదె దూడ పైచిరుత పంజా

ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి)
ఎల్లారెడ్డిపేట మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో చిరుత పులి సంచార కలకలం రేపింది గ్రామానికి చెందిన ఒక రైతు పసుపు కొట్టంలో కట్టివేసిన గేద దూడపై చిరుత దాడి చేసి చంపి తినడం కార్మికులకు భయాందోళన గురిచేసింది గ్రామ శివారు లో అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది .ప్రతిరోజు మాదిరిగానే పశువులను కొట్టంలో కట్టువేసి వెళ్లిన రైతు తెల్లవారుజామున వచ్చి చూడగానే గేదె దూడ మృతదేహాన్ని గుర్తించాడు. ఈ విషయాన్ని వెంటనే గ్రామస్తులకు తెలియజేయడంతో వార్త క్షణాల్లో గ్రామవంతం వ్యాపించింది. ఈ సంఘటన గ్రామస్తులు తీవ్ర భయాందోళన గుర్రై అటవీ ప్రాంత సమీపంలో ఉన్న పశువుల కొట్టాల వద్ద అప్రమత్తంగా ఉండాలని గ్రామ ప్రజలు సూచించారు .అటవీ శాఖ వారికి సమాచారము అందించారు పిల్లలు మహిళలు ఒంటరిగా బయటకు వెళ్ళవద్దని హెచ్చరించారు .సమాచారం అందుకున్న అటవీశాఖ మరియు పోలీస్ శాఖ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చిరుత సంచారం ఉన్న నేపథ్యంలో గ్రామ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని రాత్రివేళ పశువులను బలమైన గోడలతో ఉన్న కొట్టాలోనే ఉంచాలని అధికారులు సూచించారు.



## రాజన్న ఆలయం వద్ద 150 మంది అన్నార్తులకు భక్తులకు అన్నదానంతో పాటు స్వీట్ల పంపిణీ*మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్

వేములవాడ,ఏప్రిల్,15:ప్రజాజ్యోతి
ట్రస్టు ఆధ్వర్యంలో దాతలు అందిస్తున్న సహకారంతో 1821 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా బుధవారం రోజున రాజన్న ఆలయం వద్ద 150 మంది పేదలకు అన్నార్తులకు మరియు భక్తులకు అన్నదానంతో పాటు స్వీట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నేటి అన్న దాతలుగా పెళ్ళిరోజు సందర్భంగా విశ్వనాథుల శ్రీనివాస్ త్రివేణి దంపతులు, చిరంజీవి పశికంటి యువాన్ష్ పుట్టినరోజు సందర్భంగా పశికంటి రమేష్ బాబు సరస్వతి దంపతులు పశికంటి శశిప్రీతం స్వాతి దంపతులు శాశ్వత దాతలుగా డాక్టర్ జువ్వాడి వెంకటేశ్వర రావు స్నేహలత దంపతులు ప్రతాప స్వప్న సంపత్ దంపతులు నగుబోతు రవీందర్ జ్యోతి దంపతులు గణాచారి మఠం శైలజ సాంబశివు దంపతులు దేవరాజు ఉమ బాలచందర్ రాజు దంపతులు రామడుగు శ్రీలత కొడుకులు కోడళ్లు: ప్రజ్ఞ శరత్చంద్ర దంపతులు శిరీష సాయిచంద్ర దంపతులు శర్వాణి రవిచంద్ర దంపతులు హైదరాబాద్ వాస్తవ్యులు చిన్నారులు శ్రీహర్ష, సాయి కృష్ణ ఉన్నారని మీయొక్క పుట్టిన రోజు పెళ్ళిరోజు మరియు ఇతరత్ర కార్యక్రమాలకు పేదలకు అన్నార్తులకు ఒక్కపూట భోజనం అందించడానికి సహకారం అందించే దాతలు ట్రస్టు సభ్యులను గాని 9246939388 నంబరుకు సంప్ర దించాలని, ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మహమ్మద్ అబ్దుల్ రఫీక్ సగ్గు రాహూల్ పసుల శ్రీధర్ మధు కవిత మఠం శివకుమార్ గంప గోపాల్ రాచకొండ నందయ్య తదితరులు పాల్గొన్నారు



### ఆరోగ్యవంతమైన
# కూరగాయల సాగు చేసుకోవాలి



**నేలకొండపల్లి ఏప్రిల్ 15 ప్రజాజ్యోతి:** ఆరోగ్యవంతమైన కూరగాయల సాగు చేసుకోవాలని నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి యం. రాధ సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక లో బుధవారం రైతులకు నూరు శాతం రాయితీ కూరగాయల విత్తనాల మిని కిట్స్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు....రైతులు వ్యవసాయం సాగులో భాగంగా కూరగాయాల సాగు ను ప్రోత్సాహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందించే విత్తనాలతో ఎలాంటి మందులు పిచికారి చేయకుండా సేంద్రియంతో కూరగాయలు పండించాలని సూచించారు. ఆకు కూరలను ఎక్కువగా సాగు చేసుకోవాలని సూచించారు. మండలం లోని రైతాంగం కు దాదాపు 200 మిని కిట్స్ ను అందించినట్లు తెలిపారుకావాల్సిన రైతులు వ్యవసాయ కార్యాలయం లో సంప్రందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ విస్తీరణాధికారి పి. వెంకటలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

### విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్
# నియమాలపై అవగాహన సీఐ ఉస్మాన్ షరీఫ్






**రఘునాథపాలెం ప్రజాజ్యోతి** పోలీసులు చిన్న వయస్సులోనే ట్రాఫిక్ నిబంధనలు, అలవాట్లు నేర్చుకోవడం వల్ల బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి దోహదపడుతుందని రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ అన్నారు. రఘునాథపాలెం మండలం, బుధవారం కోయచలక గ్రామంలో రోడ్డు భద్రతపై ఎంజేపీటీబీసిడబ్ల్యూర్ పాఠశాల విద్యార్థులకు, స్థానికులకు అవగాహన కల్పించారు. అరైవ్ అలైవ్ వంటి కార్యక్రమాల ద్వారా పాఠశాలల్లో ట్రాఫిక్ సిగ్నళ్లు, జీబ్రా క్రాసింగ్, హెల్మెట్/సీట్ బెల్ట్ వాడకంపై విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను అరికట్టి, సురక్షితమైన భవిష్యత్తును నిర్మించవచ్చని అన్నారు. అందుకే చిన్నతనం నుంచే ట్రాఫిక్ నిబంధనలను పాటించేలా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. చిన్న వయసులో డ్రైవింగ్ చేయకూడదని, సైకిల్ తొక్కేటప్పుడు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవడం, హెల్మెట్ వాడటం మంచిదన్నారు. రోడ్డు దాటేటప్పుడు ఎడమ-కుడి-ఎడమ చూసుకోవాలన్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్ళేటప్పుడు హెల్మెట్, కార్లలో సీట్ బెల్ట్ ధరించడం తప్పనిసరిని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ నరేష్,ఎస్ఐ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా
# భూక్య బాలకృష్ణ ప్రమాణ స్వీకారం






**బోనకల్, ఏప్రిల్ 15 (ప్రజా జ్యోతి):** కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా బోనకల్ మండల కేంద్రానికి చెందిన భూక్యా బాలకృష్ణ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఖమ్మంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో తెలంగాణ పిసిసి ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ హాజరై ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ సభ్యులను మహేష్ గౌడ్ ప్రమాణ స్వీకారం చేయించి జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా నియామక పత్రాన్ని భూక్యా బాలకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గా ప్రమాణ స్వీకారం చేసిన భూక్యా బాలకృష్ణ మాట్లాడుతూ... నాకు కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా కమిటీలో స్థానం దక్కినందుకు కృషిచేసిన డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క కు, పిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్ , కాంగ్రెస్ మండల అధ్యక్షులు గాలి దుర్గారావు, మండల కాంగ్రెస్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా నాకు ఇంత బాధ్యతాయుతమైన పదవిని కట్ట పెట్టినందుకు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎల్లవేళలా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బంధం నాగేశ్వరరావు, చేబ్రోలు వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ బోనకల్ గ్రామ శాఖ అధ్యక్షులు తోటపల్లి స్వామి, ఎర్రంశెట్టి సుబ్బారావు, మరీదు శ్రీనివాసరావు, బానోతు శ్రీను, గుగులోతు చందు, తమ్మారపు వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

### జావేద్ మృతి పట్ల
# టిడబ్ల్యూజేఎఫ్ హెచ్ 2843 తీవ్ర విచారం

- స్నేహశీలి, ఆత్మీయ నేస్తం జావేద్ టిడబ్ల్యూజేఎఫ్ హెచ్ 2843

జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రెస్ క్లబ్ కమిటీ



**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** బుధవారం సీనియర్ కాంగ్రెస్ నాయకులు,ఖమ్మం సిటీ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు మహమ్మద్ జావిద్ రోడ్డు ప్రమాదంలో మరణించడంతో టిడబ్ల్యూజే హెచ్ 2843 యూనియన్ నాయకులు అండ్ ప్రెస్ క్లబ్ కమిటీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జావేద్ స్నేహశీలి అని, ఆత్మీయ నేస్తమని,అందరితో సోదరుభావంతో, కుటుంబంలో ఒక వ్యక్తిగా అన్నా అని అడిగిన వెంటనే అక్కున చేర్చుకునే ఆప్తమిత్రుడుగా ఉండే దావీదు మరణం పట్ల టిడబ్ల్యూజేఎఫ్ హెచ్ 2843 యూనియన్ నాయకులు, ప్రెస్ క్లబ్ కమిటీ జావిద్ మరణం తీవ్రంగా కలచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి రాజకీయ భవిష్యత్తు కలిగిన నాయకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరం అన్నారు.జావేద్ మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు.

### కాంగ్రెస్ సీనియర్ నేత మహమ్మద్ జావిద్
# మృతి పట్ల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దిగ్భ్రాంతి

- కాంగ్రెస్ పార్టీకి జావిద్ అందించిన సేవలు మరువలేనివి
- జావిద్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది

**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** కాంగ్రెస్ సీనియర్ నేత, ఖమ్మం కార్పొరేషన్ పార్టీ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ జావిద్ రోడ్డు ప్రమాదంలో మృతి పట్ల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాలపాటు పార్టీ కష్టకాలంలో ముందుండి జావిద్ సేవలు అందించారని గుర్తు చేశారు. ఖమ్మం నగర కార్పొరేషన్ మాజీ అధ్యక్షునిగా, ప్రస్తుతం పిసిసి కార్యవర్గ సభ్యునిగా, రాజీవ్ గాంధీ పంచాయతీ అభియాన్ కమిటీలో కీలక నేతగా, సేవాదళ్ రాష్ట్ర నాయకునిగా సుదీర్ఘకాలం పార్టీకి ఆయన అందించిన సేవలు మరువలేనివి అన్నారు. మహమ్మద్ జావిద్ కుటుంబానికి యావత్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు. జావిద్ కుటుంబానికి ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం తన తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. జావిద్ ఆత్మకు శాంతి కలగాలని ఆయన ప్రార్థించారు.

### విద్యుత్ మౌలిక వసతుల విస్తరణతో
# పేదల అభివృద్ధి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- గ్రామీణ విద్యుత్ సరఫరా మెరుగుదలకు సబ్ స్టేషన్ కీలకం
- పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అదనపు విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణం
- నిరుపేదలకు ప్రభుత్వ భూముల్లో ఇంటి పట్టాల పంపిణీకి హామీ
- మహిళల ఆర్థికాభివృద్ధికి వడ్డీ లేని రుణాలు, సంక్షేమ పథకాల అమలు









**సత్తుపల్లి, ఏప్రిల్15(ప్రజాజ్యోతి)** విద్యుత్ మౌలిక వసతుల విస్తరణతో పేదల అభివృద్ధి సాధ్యం అవుతుందని డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క బుధవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎన్పిడిసియల్ సిఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామంలో ఏర్పాటు చేయనున్న 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడేందుకు ఈ సబ్ స్టేషన్ ఉపయోగప డుతుందని తెలిపారు. రైతులకు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.ప్రజలకు నాణ్యమైన విద్యుత్తు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ఎక్కడ కోతలు జరగకుండా అవసరమైన చోట అదనపు విద్యుత్ ఉప కేంద్రాలను నిర్మిస్తున్నామని తెలిపారు. నిరుపేదలకు ప్రభుత్వ స్థలాలలో ఇంటి పట్టాలు పంపిణీ చేయడం గత కాంగ్రెస్ హయాంలో అనేకసార్లు చేపట్టిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వ పాలనలో ఈ ప్రక్రియ పూర్తిస్థాయిలో విస్మరించిందని, భవిష్యత్తులో రేజర్ల గ్రామంలో అర్హులైన నిరుపేదలకు తప్పనిసరిగా ఇంటి పట్టాలు అందిస్తామని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు.నూతన రేషన్ కార్డుల జారీ, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహిళలకు వడ్డీ లేని రుణాలు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ప్రభుత్వానికి వచ్చే ప్రతి రూపాయి పేద ప్రజల కోసం ఖర్చు చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.మహిళలు డ్వాక్రా సంఘాలలో చేరి వడ్డీ లేని రుణాలు పొంది ఆర్థికంగా ఎదగాలని సూచించారు. గ్రామంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిలో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామానికి అవసరమైన అన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం తప్పనిసరిగా అమలు చేస్తుందని పేర్కొన్నారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా పేదల సంక్షేమం, అభివృద్ధిని తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందన్నారు. అభివృద్ధి, సంక్షేమం జోడేద్దుల్లాగా ప్రభుత్వం ప్రజలకు అందిస్తోందని పేర్కొన్నారు.ఈ రోజే మూడు కొత్త ఆసుపత్రులను ప్రారంభించడంతో పాటు 4 కొత్త సబ్ స్టేషన్‌లకు శంకుస్థాపనలు చేసినట్లు తెలిపారు. నిన్ననే సత్తుపల్లిలో యంగ్ ఇండియా స్కూల్‌కు శంకుస్థాపన చేసినట్లు వెల్లడించారు.పేదల సంక్షేమం కోసం 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తున్నదని తెలిపారు.ధనికులు సమాజంలో ఎలా జీవిస్తారో అదే స్థాయిలో ప్రతి పేదవాడు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని పేర్కొన్నారు.రేజర్ల గ్రామంలోని ప్రభుత్వ భూమిలో లేఔట్ ఏర్పాటు చేసి అర్హులైన నిరుపేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేస్తామని, స్థానిక ఎమ్మెల్యే ప్రతిపాదన మేరకు ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని మంత్రి హామీ ఇచ్చారు.సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ ఈ రోజు డిప్యూటీ సీఎం, మంత్రి పొంగులేటి కలిసి అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే మరో విడత ఇందిరమ్మ ఇళ్ల జాబితా విడుదల అవుతుందని పేర్కొన్నారు. సుమారు 400 మందికి గృహ స్థలాలను కేటాయించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్ఈ ఎన్పిడిసిఎల్ శ్రీనివాస చారి, తహసీల్దార్, ఎంపీడీఓ, సంబంధిత అధికారులు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్, వైస్ చైర్ పర్సన్ బొంతు సుమలత, గొర్ల మారి రామ్మోహన్ రెడ్డి, సుబ్బారెడ్డి, ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత సామాజిక బాధ్యతగా గుర్తించాలి

### అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్





**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** స్థానిక రోడ్డు భద్రత సామాజిక బాధ్యతగా గుర్తించాలని అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్ అన్నారు.ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రోడ్డు భద్రతపై విద్యార్థులకు అరైవ్ ఆలైవ్ అవగాహన కార్యక్రమం నగరంలోని ఎస్ ఆర్ జూనియర్ కాలేజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీజీ మాట్లాడుతూ రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యతని, ఇది ప్రమాదాలను నివారించి ప్రాణాలను కాపాడుతుందన్నారు. ద్విచక్ర వాహనాలపై హెల్మెట్,కార్లలో సీట్ బెల్ట్ ధరించడం,ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం,మద్యం సేవించి డ్రైవింగ్ చేయకపోవడం, సెల్ ఫోన్ డ్రైవింగ్, అతివేగాన్ని నియంత్రించడం వంటి నిబంధనలు పాటించడం ద్వారా సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందన్నారు.యుద్ధాలలో, నేరాలల్లో మరణించే వారి కంటే రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మంది చనిపోతున్నారనేది వాస్తవమని, ప్రతి సంవత్సరం సుమారు 1.8 లక్షల మంది ప్రాణాలు కోల్పోతుండగా, ప్రతి నిమిషానికి ఒక ప్రమాదం జరుగుతోందని, ప్రతి మూడు నిముషాలకు ఒకరు చనిపోతున్నారని పేర్కొన్నారు.మృతులలో అత్యధికులు 18-45 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు ఎక్కువ వున్నారని తెలిపారు. మితిమీరిన వేగం,నిర్లక్ష్యం, రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడం వల్ల ఈ మరణాలు సంభవిస్తున్నాయని అన్నారు.విదేశాల్లో కఠినమైన చట్టాలు, భారీ జరిమానాలు ఉండటంతో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తారని, కానీ ఇండియాలోకి రాగానే అవే నిబంధనలను నిర్లక్ష్యం చేస్తారని, ఈ అలసత్వం వల్ల ఏటా భారీగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా పిల్లలకు రోల్ మోడల్ (ఆదర్శం)గా నిలవాలని, ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్,సీట్‌బెల్ట్ ధరించడం వంటివి నిత్యజీవితంలో పాటిస్తూ,పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు.ఉపాధ్యాయులు పాఠశాలలో, తల్లిదండ్రులు ఇంట్లో భద్రతా అలవాట్లను ప్రోత్సహించడం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చని సూచించారు. అవగాహన కార్యక్రమంలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని కుటుంబ సభ్యులకు, బంధువులకు అవగాహన కల్పించాలన్నారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ చిన్న నిర్లక్ష్యపు చర్యల వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు.రోడ్డు ప్రమాదం వల్ల కుటుంబంలోని వ్యక్తిని కోల్పోవడం కుటుంబానికి తీరని లోటని, ఇది తీవ్రమైన దుఃఖం, మానసిక వేదన,నిత్యజీవితంలో పెను మార్పులను కలిగిస్తుందని, మానసిక ఒత్తిడి, ఆర్థిక కష్టాలు ఎదురవుతాయని గుర్తించాలన్నారు. బయటకు వెళ్లిన వ్యక్తులు క్షేమంగా ఇంటికి చేరుకోవడం కోసం హెల్మెట్, సిట్ బెల్ట్ ధరించడం, సెల్ ఫోన్ డ్రైవింగ్ చేయవద్దని కుటుంబ సభ్యులు చెప్పాలన్నారు.విద్యార్థులు రోడ్డు భద్రతా నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తామని, హెల్మెట్,సీటు బెల్ట్ ధరిస్తామని, మద్యం తాగి వాహనం నడపమని ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లా ఉఆర్డర్ ప్రసాద్ రావు, ఆర్టివో రాజశేఖర్, ఏసీపీలు రమణమూర్తి, మహేష్, శ్రీనివాసులు, సర్వర్, సిఐలు భానుప్రకాష్, కరుణాకర్, బాలకృష్ణ, మోహన్ బాబు, రాజిరెడ్డి, సత్యనారాయణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

### చేతన మీసేవ ఆధ్వర్యంలో ఘనంగా
# జడ్జి మండా వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 15 ప్రజాజ్యోతి ,** భద్రాచలం పట్టణంలోని కారుణ్య అనాథ పిల్లల ఆశ్రమంలో కూకట్‌పల్లి జిల్లా కోర్టు జడ్జి మండా వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు చేతన మీ సేవా నిర్వాహకులు భూక్యా రంజిత్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని అనాథ పిల్లల కోసం 25 కిలోల బియ్యం, అరటి పండ్లు అందజేశారు. చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి, వారికి మిఠాయిలు పంచి ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకులు , పిల్లలు మాట్లాడుతూ, జడ్జి మండా వెంకటేశ్వరరావు జన్మదినాన్ని తమ మధ్య జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉ ందని తెలిపారు. ఈ సందర్భంగా జడ్జికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.అనాథ పిల్లల మధ్య జన్మదినాన్ని జరుపుకోవడం ద్వారా సేవా మనోభావాన్ని చాటిన ఈ కార్యక్రమాన్ని స్థానికులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో చేతన మీ సేవా నిర్వాహకులు భూక్యా రంజిత్ నాయక్, మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కొప్పుల మురళీ, ఫోటోగ్రాఫర్ అమ్మ నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ సీనియర్ నేత మహమ్మద్
# జావిద్ మృతి పట్ల జిల్లా కాంగ్రెస్
### కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ దిగ్భ్రాంతి

- కాంగ్రెస్ పార్టీకి జావిద్ అందించిన సేవలు మరువలేనివి
- జావిద్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది

**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** కాంగ్రెస్ సీనియర్ నేత, ఖమ్మం కార్పొరేషన్ పార్టీ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ జావిద్ రోడ్డు ప్రమాదంలో మృతి పట్ల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాలపాటు పార్టీ కష్టకాలంలో ముందుండి జావిద్ సేవలు అందించారని గుర్తు చేశారు. ఖమ్మం నగర కార్పొరేషన్ మాజీ అధ్యక్షునిగా, ప్రస్తుతం పిసిసి కార్యవర్గ సభ్యునిగా, రాజీవ్ గాంధీ పంచాయతీ అభియాన్ కమిటీలో కీలక నేతగా, సేవాదళ్ రాష్ట్ర నాయకునిగా సుదీర్ఘకాలం పార్టీకి ఆయన అందించిన సేవలు మరువలేనివి అన్నారు. మహమ్మద్ జావిద్ కుటుంబానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు. జావిద్ కుటుంబానికి ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తన తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. జావిద్ ఆత్మకు శాంతి కలగాలని ఆయన ప్రార్థించారు.

# పూర్వం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

20 సంవత్సరాల తర్వాత ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒకే చోట కలవడం

ఆనాటి మధుర జ్ఞాపకాలు, చిలిపి చేష్టలు గుర్తు చేసుకుంటు కాలక్షేపం

ఉపాధ్యాయులు గుర్తుపట్టలేనంతగా మారిన విద్యార్థిని,విద్యార్థులు

అదిలాబాద్ టౌన్, ఏప్రిల్ 14 ( ప్రజా జ్యోతి )

అదిలాబాద్ పట్టణం సంజయ్ నగర్ లోని విశ్వశాంతి ఉన్నత పాఠశాల 2005-2006 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పట్టణంలోని కలెక్టర్ చౌరస్తా వజ్ర బ్యాంకెట్ హాల్లో ఆదివారం ఘనంగా



నిర్వహించారు. 20 సంవత్సరాల తర్వాత విద్యార్థిని, విద్యార్థులు అందరూ ఒకే చోట కలుసుకొని వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆనాటి ఘటనలను నెమరు వేసుకున్నారు. ఇంతటి స్థాయికి ఎదిగిన




మాకు పాఠాలు చెప్పిన గురువులను చూసి విద్యార్థులు భావద్వేగానికి గురి అయ్యారు. పాఠశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించి పాదాభివందనాలు తెలియజేశారు. విద్యార్థినీ విద్యార్థులు ఒకరి తర్వాత ఒకరు స్టేజి పైకి వచ్చి వారి యొక్క వివరాలను వారు చేస్తున్న వృత్తిని తెలియజేసారు. ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు స్టేజి పైన మైక్ లో వారి ఉపన్యాసాన్ని వినిపించారు. 20 సంవత్సరాలైనా ఉపాధ్యాయుల అందరిని గుర్తుంచుకొని ఈ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి పిలుపునిచ్చినందుకు విద్యార్థిని విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఉపాధ్యాయులు వెల్లడిస్తూ ఇలాగే మీరు ఆనందంగా ఉంటూ మీరు ఏ వృత్తిలో ఉన్న ఆ వృత్తిని దైవంగా భావించి, ఇంటి పెద్దలు అమ్మానాన్న, ఆడవారైతే అత్తమామలను బాగా చూసుకొని కుటుంబ గౌరవాన్ని నిలబెట్టుకోని సమాజంలో మంచి పేరును సంపాదించాలన్నారు.ఎలాగైతే మనం ఈ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి మనకు తోచినంత చందాను జమ చేసి ఈ కార్యక్రమం నిర్వహించాము , అలాగే మనలో ఏ విద్యార్థులైన ఆపదలో ఉన్నప్పుడు వారికి మనకు తోచినంత సహాయం చేసి అండగా నిలబడదామన్నారు. మనం చదువుకున్న వారిలో ఎలాంటి శుభ కార్యాలు ఉన్న , ఆపదలో ఉన్న వారికి అండగా నిలబడడమే మన పూర్వ విద్యార్థుల లక్షణమని అన్నారు. భోజన విరామం తర్వాత ఉపాధ్యాయులు వెళ్లిపోయిన తర్వాత విద్యార్థిని విద్యార్థులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని , కాసేపు డీజే చప్పుళ్ల మధ్య చిన్న పిల్లల లాగా నృత్యాలతో అలరించారు. అంతాక్షరి ఆడుకుంటూ కాసేపు కాలక్షేపం చేశారు. మళ్లీ పాత రోజుల్లో జరిగిన సంఘటనలు గుర్తు చేసుకుంటూ ఆనందోత్సవం లో మునిగిపోయారు. మళ్ళీ 20 సంవత్సరంల తర్వాత పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని, అప్పుడే మనమందరం మళ్ళీ ఒకే చోట కలవడానికి అనుకూలంగా ఉంటుందని అన్నారు. అలాగే హిందీ ఉపాధ్యాయులు రామునలు సార్ ప్రసంగిస్తూ మీరు ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని ఎలా నిర్వహించాదానికి ఎలా కష్టపడ్డారో అలాగే మీ బ్యాచ్ అందరూ ఒక జాయింట్ అకౌంట్ ను తీయాలని అందులో విద్యార్థులు నెలకు తమకు తోచినంత డబ్బును జమ చేయాలని , ఆ డబ్బును మీలో ఎవరైనా కష్టంలో ఉన్నప్పుడు వినియోగించుకోవాలని సలహా ఇచ్చారు. ఇది ఒక మంచి ఆలోచన అని అన్నారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతంగా ముందుకు సాగడానికి, ఎంతో కష్టపడి, ఉపాధ్యాయులను , విద్యార్థినీ విద్యార్థుల ను మార్గదర్శనం చేసిన వినోద్, రమేష్ రెడ్డి, అపర్ణ, కళ్యాణి, శ్రావంతి ని పూర్వ విద్యార్థులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

# ప్రియుడి మోజులో భర్త హతం..

పరకాల, ఏప్రిల్ 15,(ప్రజా జ్యోతి):

పరకాల పట్టణంలో సినీ కథను తలపించే విధంగా భార్య చేత భర్త హత్యకు గురైనట్టు వెలుగులోకి వచ్చిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. సీఎస్ఐ కాలనీకి చెందిన మడికొండ సుమన్ (30), ట్రాక్టర్





మెకానిక్‌గా జీవనం సాగిస్తున్నాడు. అతని భార్య లావణ్యకు నరేష్ అనే వ్యక్తితో అక్రమ సంబంధం ఉన్నట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మృతునికి ఇద్దరు కూతుళ్లు.ఈ నేపథ్యంలో మార్చి 3న సుమన్‌ను నిర్మానుష ప్రాంతానికి తీసుకెళ్లిన లావణ్య, తదుపరి రోజు అతని సెల్‌ఫోన్‌లో బ్రతికున్నట్లుగా స్టేటస్ పెట్టినట్లు తెలిసింది. అయితే మార్చి 6న ఏమి తెలియనట్లుగా ఇంటికి చేరుకోవడంతో మృతుడి తండ్రి సాంబయ్యకు అనుమానం కలిగింది. దీంతో మార్చి 8న పరకాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గతంలో కూడా రెండు సార్లు హత్యకు ప్రయత్నాలు చేసి విఫలమైనట్లు కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు. చివరగా ములుగు జిల్లా చలువాయి ప్రాంతంలో హత్య చేసినట్లు విశ్వాసనీయ సమాచారం.కేసును నమోదు చేసిన పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టగా, బుధవారం లావణ్య తన భర్తను హత్య చేసినట్లు ఒప్పుకున్నట్టు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ హత్యలో ఆమె ప్రియుడు నరేష్, తమ్ముడు రాజు కూడా సహకరించినట్లు ఆరోపిస్తున్నారు.

ఈ ఘటన పరకాలలో ఒక్కసారిగా చర్చనీయాంశంగా మారగా, మృతుడి బంధువులు పెద్ద సంఖ్యలో పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు కేసును మరింత లోతుగా విచారిస్తున్నారు.

# ఘోర ప్రమాదం

మొదటిపేజీ తరువాయి..

ప్రమాదానికి కారణమై ఉండొచ్చని తెలిపారు. ఈ పడవ ఏప్రిల్ 4న బంగ్లాదేశ్



నుంచి బయల్దేరినట్లు తెలుస్తోంది. కాక్స్ బజార్‌లోని శరణార్థుల శిబిరాల్లో ఉన్న వీరు కనీస జీవన సదుపాయాల కోసం మలేసియాకు వలస వెళ్తుండగా ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకున్నట్లు ఐరాస అధికారులు వెల్లడించారు. వాస్తవానికి రోహింగ్యాలు.. మయన్మార్‌కు చెందినవారు. కానీ, 2017లో అక్కడి సైన్యం మారణహోమం నుంచి తప్పించుకునేందుకు లక్షలాది రోహింగ్యాలు బంగ్లాదేశ్‌కు తరలిపోయారు. దీంతో కాక్స్ బజార్‌లో శరణార్థి శిబిరాలు కిక్కిరిసిపోయాయి. అయితే, ఇటీవల ఇక్కడి పరిస్థితులూ క్షీణించడంతో వీరంతా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయేందుకు వలసబాట పడుతున్నారు. ఈ క్రమంలోనే ప్రమాదకర సముద్ర ప్రయాణాలను ఎంచుకుంటున్నారు.

# ఆరోగ్యం కోసం సంప్రదాయ పద్ధతి

## సహజ స్వచ్ఛమైన నూనెలు, కోసం శ్రీ లక్ష్మి నారాయణ ఆయిల్ స్టోర్స్

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి

నేటి ఆధునిక కాలంలో ఆహారపు



అలవాట్లలో వస్తున్న మార్పుల వల్ల ఆరోగ్య సమస్యలు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా మనం వాడే వంట నూనెలు,ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాల పట్ల ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. ఈ నేపథ్యంలో, ప్రజలకు అత్యంత నాణ్యమైన , స్వచ్ఛమైన , ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను అందించాలనే లక్ష్యంతో ఖమ్మం వైరా రోడ్డు ఇందిరానగర్ బోర్డు ఎదురుగా మసీద్ రోడ్డు లో 'శ్రీ లక్ష్మి నారాయణ ఆయిల్ స్టోర్స్ ప్రారంభించబడింది.మన

### ఆరోగ్యం మన చేతుల్లోనే..

మన ఆరోగ్యం మన చేతిలోనే అనే నినాదంతో, కృత్రిమ రసాయనాలు లేని, సహజ సిద్ధమైన ఉత్పత్తులను ప్రజలకు చేరవేయడమే మా ప్రధాన ఉద్దేశ్యం. అధిక లాభాల కోసం కాకుండా, వినియోగదారుల ఆరోగ్యమే పరమావధిగా మా స్టోర్స్ సేవలందిస్తోంది.

### కట్టె గానుగ నూనె – ప్రత్యేకతలు

నేటి పారిశ్రామికీకరణలో నూనెలను వేడి చేసి,రసాయనాలు కలిపి తీయడం వల్ల వాటిలోని పోషక విలువలు నశిస్తున్నాయి.వీటికి భిన్నంగా,మా 'శ్రీ లక్ష్మి నారాయణ ఆయిల్ స్టోర్స్'లో కట్టె గానుగ (వుడెన్ కోల్డ్ ప్రెస్డ్ ) పద్ధతిలో నూనెలను తీస్తాము.కస్టమర్ల సమక్షంలోనే,కళ్ల ముందే ధాన్యాలను గానుగలో వేసి నూనె తీసి ఇస్తాము. దీనివల్ల నూనె స్వచ్ఛతపై వినియోగదారులకు పూర్తి నమ్మకం కలుగుతుంది. పోషకాల పరిరక్షణ: కట్టె గానుగలో తక్కువ ఉష్ణోగ్రత వద్ద నూనె తీయడం వల్ల గింజల్లోని సహజసిద్ధమైన రుచి,వాసన ,పోషక విలువలు అలాగే ఉంటాయి.

### సహజ సిద్ధమైన ఆరుదల ధాన్యాలతో

రసాయన ఎరువులు,పురుగుమందుల ప్రభావం లేని,ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిన ధాన్యాలను మాత్రమే మేము సేకరిస్తాము.వీటిని తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పీచు పదార్థం, ఖనిజ లవణాలు సమృద్ధిగా లభిస్తాయి.



### నాణ్యతకు,నమ్మకానికి చిరునామా

గత కొద్ది కాలంగా ఆహార కల్తీపై ఆందోళన చెందుతున్న ప్రజలకు, 'శ్రీ లక్ష్మి నారాయణ ఆయిల్ స్టోర్స్' ఒక భరోసాను కల్పిస్తోంది. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా, స్వచ్ఛమైన ఉత్పత్తులను అందించడమే మా మా లక్ష్యం.ఖమ్మం ప్రజలందరూ మా స్టోర్ సందర్శించి, స్వచ్ఛమైన నూనెలు , కొనుగోలు చేసి ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నాము.

మా చిరునామా:
శ్రీ లక్ష్మి నారాయణ ఆయిల్ స్టోర్స్,
హౌస్ నెంబర్: 15-5-16,
ఇందిరా నగర్ బోర్డ్ ఎదురుగా ,మసీద్ రోడ్
నెంబర్: 2,
ఖమ్మం.

# మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు

మొదటిపేజీ తరువాయి..

గత రెండు సంవత్సరాల్లో మొత్తం రూ.568.50 కోట్ల వ్యయంతో 630 అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు మంత్రికి అధికారులు వెల్లడించారు. ఇందులో రూ.128 కోట్లతో 113 పనులు పూర్తయ్యాయని నివేదిక సమర్పించారు. మిగిలిన పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ప్రతి పనికి టైమ్‌లైన్ నిర్ణయించి వేగంగా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. మార్కెట్ యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారం చేయకుండా లైసెన్సులు కొనసాగిస్తున్న ట్రేడర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారి లైసెన్సులను రద్దు చేయాలని ఆదేశించారు. అలాంటి వారికి సహకరించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

అభివృద్ధి పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక డ్యాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు.




Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967